
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 112

శనివారం 6-1-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మిగులుకూ మేలు

కారణమేదైనా గానీ పథకాలు పొందలేకపోయిన అర్హులందరికీ లబ్ధి: సీఎం జగన్

- మళ్లీ దరఖాస్తుకు అవకాశమిస్తూ ఏటా రెండు దఫాలుగా మంచి చేస్తున్నాం
- ప్రజల తరపున మంచి సేవకుడిలా ఈ ప్రభుత్వం ఉంది
- వివిధ పథకాల కింద మిగిలిపోయిన 68,990 మంది అర్హుల ఖాతాల్లోకి రూ.97.76 కోట్లు
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా జమ చేసిన సీఎం

మిగిలిపోయిన అర్హులకు ఇప్పటివరకు ఐదు విడతల్లో రూ.1,700 కోట్ల మేర ప్రయోజనం



వివిధ కారణాల వల్ల లబ్ధి అందని అర్హుల ఖాతాల్లో జమ చేసిన నగదుకు సంబంధించిన చెక్కుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, చిత్రంలో మంత్రులు తదితరులు

సాక్షి, అమరావతి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో మేలు చేయాలనే తపనతో జవాబుదారీతనం, పారదర్శకతతో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. పథకాల కోసం పేదలు ఏ ఇబ్బందీ పడకుండా మిగిలిపోయిన అర్హులకు సైతం ఆర్నెల్లకు ఒకసారి లబ్ధి చేకూర్చుతున్నామని తెలిపారు. అర్హులెవరూ మిస్ కాకూడదన్నదే ఈ ప్రభుత్వ ఆరాటమని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని 68,990 మంది మిగిలిపోయిన అర్హుల ఖాతాల్లో రూ.97.76 కోట్లను ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా జమ చేశారు.

మళ్లీ దరఖాస్తుకు అవకాశమిస్తూ..

నా నుంచి మొదలుపెడితే కలెక్టర్లు, సచివాలయాల వరకు ప్రతి ఒక్కరికీ ఎంతో సంతృప్తినిచ్చే కార్యక్రమం ఇది. ఎవరికి ఏ సమస్య వచ్చినా మంచి సేవకుడిలా ప్రభుత్వం పరిష్కరిస్తుందనే భరోసా కల్పించే కార్యక్రమం ఇది. ఏ కారణం చేతనైనా పొరపాటున ఒక పథకం అర్హులకు అందకుంటే నెల రోజుల సమయం ఇచ్చి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాం. దాన్ని వెరిఫై చేసి మిగిలిపోయిన అర్హులకు ఆర్నెల్ల లోపు లబ్ధి చేకూరుస్తున్నాం. ఏటా రెండు దఫాలుగా క్రమం తప్పకుండా జూన్ – జూలైలో ఒకసారి, డిసెంబరు – జనవరిలో మరోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సమాచారం తెలియక దరఖాస్తు చేసుకోకపోవడం, దరఖాస్తులో ఏదైనా పొరపాట్లు దొర్లడం, కావల్సిన పత్రాలు ఇవ్వక పోవడం, ఆధార్ మిస్ మ్యాచ్ లాంటి పలు కారణాలతో పథకాలకు దూరమైన అర్హులకూ దీని ద్వారా మంచి చేస్తున్నాం. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకూడదన్నదే మా ఆరాటం.

> "ఈ ప్రభుత్వం.. ప్రజల తరపున మంచి సేవకుడిలా పని చేస్తోంది. అర్హత ఉండి కూడా ఏ కారణం చేతనైనా వివిధ సంక్షేమ పథకాలకు దూరమైన మిగిలిపోయిన అర్హులకూ లబ్ధి చేకూరుస్తూ ఏటా రెండు దఫాలుగా కార్యక్రమాలను నిర్వహించడమే ఇందుకు నిదర్శనం. ప్రజలకు ఈ ప్రభుత్వం ఎంత తోడుగా నిలబడుతోందనేది చెప్పేందుకు ఇది ఒక సందేశంలా నిలుస్తూ ఎంతో సంతృప్తినిస్తోంది"
> – ముఖ్యమంత్రి జగన్

వివిధ పథకాలు మిస్ అయిన వారికి లబ్ధి..

అమ్మఒడి పథకానికి అర్హత పొందిన 42.62 లక్షల మంది ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. ఈ పథకానికి సంబంధించి వివిధ కారణాలతో మిస్ అయిన మరో 40,616 మందికి ఇవాళ నగదు జమ చేస్తున్నాం. జగనన్న చేదోడు ద్వారా 3.25 లక్షల మందికి మంచి జరిగింది. వివిధ కారణాల వల్ల పథకాన్ని అందుకోలేకపోయిన మరో 15 వేల మందికి ఇప్పుడు లబ్ధి చేకూరుస్తున్నాం. ఈబీసీ నేస్తం కింద ఇప్పటికే 4.40 లక్షల మందికి మంచి జరగ్గా మిగిలిపోయిన మరో 4,180 మందికి ఇప్పుడు ప్రయోజనం చేకూరుతోంది. వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా అప్పట్లో 2.80 లక్షల మందికి మంచి జరగ్గా ఇప్పుడు మరో 3,030 మందికి మంచి చేస్తున్నాం. మత్స్యకార భరోసా ద్వారా ఇప్పటికే 1.20 లక్షల మందికి మంచి జరగ్గా ఇవాళ మరో 2 వేల మందికి మేలు జరుగుతోంది. కళ్యాణమస్తు – షాదీ తోఫా ద్వారా 29,934 మందికి ఇప్పటికే ప్రయోజనం చేకూరగా ఇప్పుడు మరో 1,912 మందికి లబ్ధి చేకూరుస్తున్నాం. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 3.60 లక్షల మందికి ఇప్పటికే మంచి జరగ్గా ఇవాళ మరో 1,884 మందికి మేలు చేస్తున్నాం. నేతన్న నేస్తం ద్వారా అప్పట్లో 80,686 మందికి మంచి జరగ్గా ఇవాళ మరో 352 మందికి మంచి చేస్తున్నాం.

ఐదు దఫాల్లో రూ.1,700 కోట్లు

2021లో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టి క్రమం తప్పకుండా ప్రతి ఆర్నెల్లకు ఒకసారి నిర్వహిస్తున్నాం. ఇలా ఐదు పర్యాయాల్లో దాదాపు రూ.1,700 కోట్లను అర్హత ఉండి పొరపాటున మిస్ అయిన లబ్ధిదారులకు అందచేశాం.

మరో 1.17 లక్షల కొత్త పెన్షన్లు..

ఇవే కాకుండా కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసి వైఎస్సార్ పెన్షన్ కానుక అందిస్తున్నాం. మరో 1,11,321 మందికి కొత్తగా బియ్యం కార్డులను కూడా ఈ నెల నుంచి అందిస్తున్నాం. మరోవైపు 6,314 మందికి కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డులు, 34,623 మందికి కొత్తగా ఇళ్ల స్థలాలను కూడా అందచేస్తున్నాం. పథకమేదైనా సరే.. అర్హులెవరూ మిస్ కాకూడదు, పేదలు ఇబ్బంది పడకూడదనే ఆరాటంతో ఆర్నెల్లకు ఒకసారి శాచ్యురేషన్ పద్ధతిలో మిగిలిపోయిన అర్హులందరికీ మంచి చేస్తున్నాం. వారు దరఖాస్తు చేసుకునేందుకు వలంటీర్ సేవలను అందుబాటులో ఉంచుతున్నాం. సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. లేదంటే జగనన్నకు చెబుదాం 1902కి కాల్ చేసినా చాలు.. ఎలా అప్లై చేసుకోవాలి? ఏ పత్రాలు కావాలి? అనే విషయాలను వివరిస్తారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ స్పెషల్ సీఎస్ జి.అనంతరాము, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పరిశ్రమలశాఖ (హేండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్) ముఖ్యకార్యదర్శి కె.సునీత, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఏ.సూర్యకుమారి, హేండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ ముదావత్ ఎం.నాయక్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ కె.విజయ, పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సతీమణి కోసం నేతన్న చీర



సీఎం సతీమణి వైఎస్ భారతి కోసం నేసిన పట్టు చీరను ముఖ్యమంత్రికి అందిస్తున్న చేనేత కారుడు నాగరాజు

ముఖ్యమంత్రి కుటుంబంపై అభిమానంతో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చేనేతకారుడు మురుగుడు నాగరాజు తాను ప్రత్యేకంగా నేసిన మంగళగిరి పట్టు చీరను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు బహుకరించాడు. ఆ చీరను సీఎం సతీమణి వైఎస్ భారతికి అందచేయాలని కోరాడు.

ఇంత డీబీటీ మరెక్కడా లేదు..

ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు మీరు (సీఎం జగన్) శ్రీకారం చుట్టారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ డీబీటీ ద్వారా రూ.2.46 లక్షల కోట్లకుపైగా ప్రజలకు అందించిన దాఖలాలు లేవు. పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసి ఇన్ని పథకాలకు రూపకల్పన చేశారు. ప్రతి గ్రామంలో ఆఖరి కుటుంబం వరకు సంక్షేమం అందాలన్న మీ ఆలోచనకు జేజేలు. మిగిలిపోయిన అర్హులను జల్లెడ పట్టి మరీ లబ్ధి చేకూర్చడం మీ చిత్తశుద్ధికి నిదర్శనం. టంచన్‌గా పింఛన్ ఇవ్వడమే కాకుండా మాట ప్రకారం పెంచిన మీపట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగింది. పేదల కళ్లలో సంతోషం చూడాలన్న మీ తపనను సహించలేక కొందరు విషం చిమ్ముతున్నా ప్రజలు వాస్తవాలను గుర్తించారు. వారి మనసులో మీరు చెరగని ముద్ర వేశారు. సామాజిక న్యాయం, సాధికారత మీవల్లే సాధ్యమని ప్రజలు దృఢంగా నమ్ముతున్నారు.

– ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

అన్నీ అందుతున్నాయి..



అన్ని పథకాలు అందుతున్నాయి. మా అమ్మకు పెంచిన ఫించన్ రూ.3 వేలు అందాయి. మా ఆటో కార్మికులు కూడా సంతోషంగా ఉన్నారు. మీరు చల్లగా ఉండాలి.

–ఖాజా హుస్సేన్, లబ్ధిదారుడు, కల్లూరు, పాణ్యం నియోజకవర్గం

అన్నలా తోడున్నారు..



నాన్న చిన్న బట్టల షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అమ్మ చనిపోయింది. డిగ్రీ పూర్తి చేశా. ఆర్థిక ఇబ్బందులతో పై చదువులకు దూరమయ్యా. ట్యూషన్స్ చెప్పుకుంటూ, టైలరింగ్ ద్వారా కుటుంబాన్ని పోషిస్తున్నా. వలంటీర్ ద్వారా జగనన్న చేదోడు పథకం గురించి తెలుసుకుని లబ్ధి పొందా. ఆ డబ్బులతో వ్యాపారాన్ని పెంచుకున్నా. మీరు అందించే సాయం మా జీవితాలకు ఎంతో ఉపయోగపడుతోంది. సొంతింటి కల కూడా మీవల్ల నెరవేరింది. త్వరలో గృహ ప్రవేశం కూడా చేస్తాం. ఇది నూతన సంవత్సర కానుకగా భావిస్తున్నా. నాకు అమ్మలేని లోటును అన్నగా మీరు తీరుస్తున్నారు. దిశ యాప్ భరోసాతో ఒంటరిగా బయటికి వెళ్లగలుగుతున్నాం. ఒక్క రూపాయి లంచం లేకుండా అన్నీ అందుతున్నాయి. మిమ్మల్ని మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం.

– సాయి ప్రత్యూష, లబ్ధిదారు, శ్రీకాకుళం

కాపు నేస్తం ఆదుకుంది



దివ్యాంగుడైన నా భర్తకు పింఛన్ ఇస్తున్నారు. ఆయనకు ఏడాది క్రితం హార్ట్ ఎటాక్ రావడంతో ఆరోగ్యశ్రీ కింద లక్ష రూపాయల ఉచిత వైద్యం అందించారు. మాకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. కాపు నేస్తం మూడు విడతలు తీసుకున్నా. నాలుగో విడత కరెంట్ బిల్లు సమస్య వల్ల రాలేదన్నారు. వలంటీర్ ద్వారా సచివాలయంలో సంప్రదించడంతో మళ్లీ వచ్చిందని చెప్పారు. ఆ డబ్బులతో కుట్టుమిషన్ కొనుక్కుని జీవనం సాగిస్తున్నా. నాకు అన్ని పథకాలు అందాయి. ఐదేళ్లలో రూ.3.50 లక్షలు మేరకు లబ్ధి పొందా. కాపులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోకపోయినా మీరు గుర్తు పెట్టుకుని సాయం చేశారు. మా కాపు అక్కచెల్లెమ్మలు అంతా మీ వెంటే ఉంటారు. మీరే ఎప్పటికీ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాం.

– శాంతిశ్రీ, లబ్ధిదారు, హుకుంపేట, రాజమండ్రి రూరల్



వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం నెరుసుపల్లెలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులు



పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పడాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు



తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పేర్లు నమోదు



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెనలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఆంధ్రజ్యోతి డైరెక్టర్‌కు కార్మిక శాఖ నోటీసు

జీతం, అలవెన్సులు చెల్లించకుండా తొలగించారని మాజీ విలేకరి ఫిర్యాదు



GOVERNMENT OF ANDHRA PRADESH
LABOUR DEPARTMENT

ఆంధ్రజ్యోతి డైరెక్టర్‌కు పంపిన నోటీసు

పలమనేరు(చిత్తూరు జిల్లా): తాను ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చానెల్‌లో 20 ఏళ్లు విలేకరిగా వెట్టిచాకిరి చేశానని, కనీసం జీతం కూడా ఇవ్వకుండా తనను తొలగించారని, ఈ మేరకు సంస్థపై కార్మిక శాఖకు ఫిర్యాదు చేశానని ఆర్ఎస్ లోకనాథం అనే వ్యక్తి శుక్రవారం తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పలమనేరు పట్టణానికి చెందిన ఆర్ఎస్ లోకనాథం 20 ఏళ్లు ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చానల్‌లో పనిచేశారు. ఇటీవల చానల్‌లోని పలువురిని కుదించి పలమనేరు రిపోర్టరే మూడు నియోజకవర్గాలను కవర్ చేయాలని ఆదేశించారు. దీంతో లోకనాథం కారు అద్దెకు తీసుకుని ముఖ్యమైన కార్యక్రమాలను కవర్ చేశారు. ఇందుకు సంబంధించిన అద్దె బిల్లులను బ్రాంచ్ మేనేజర్ పెట్టుకుని డబ్బు డ్రా చేసుకోవడంతో కడుపుమండిన బాధితుడు తమ యాజమాన్యం పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే లోకనాథం పైనే ఆగ్రహం వ్యక్తంచేసి ఆయన్ను విధుల నుంచి తొలగించారు. దీనిపై బాధితుడు తిరుపతిలోని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీఎల్) బాబూనాయక్‌కు గత నెల 22న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీసీఎల్ గత నెల 30వ తేదీన ఆంధ్రజ్యోతి డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు.

పచ్చ పార్టీకి దొంగఓట్లే పెద్దదన్ను

- పర్చూరు, రేపల్లె, అద్దంకిలో టీడీపీ గెలుపునకు అదే కిటుకు
- ఇతర రాష్ట్రాల్లో వారికీ ఇక్కడ ఓట్లు
- నియోజకవర్గంలోనే రెండుచోట్ల కొందరికి ఓట్లు
- పర్చూరులో 10,468, రేపల్లెలో 8,880, అద్దంకిలో 7, 207 ఓట్ల తొలగింపు
- ఇప్పుడు దేశం పార్టీని వణికిస్తున్న ఓటమి భయం

ప్రజా సంక్షేమం కోసం పథకాలు అమలు చేయడం... చేసిన పనులు సగర్వంగా చెప్పుకోవడం... తద్వారా ఎన్నికల సమయంలో ఓట్లడగటం నిజమైన నాయకుడి లక్షణం. అదే దొంగ ఓట్లను నమ్ముకోవడం... అధికారంకోసం అడ్డదారులు ఎంచుకోవడం... అందుకోసం కుట్రలు, కుతంత్రాలకు తెరతీయడం... ఎంతటి అక్రమానికైనా వెరవకపోవడం కుటిల నీతికి నిదర్శనం. రెండో కేటగిరీకి చెందినవారే మన పచ్చనేతలు. విజయమే పరమావధిగా దొంగ ఓట్లను ఇష్టానుసారంగా చేర్పించేసి వారిద్వారా గెలవడం అలవాటు చేసుకున్నారు. ఇందుకు పర్చూరు, రేపల్లె, అద్దంకి నియోజకవర్గాలే సాక్ష్యం. అక్కడ అధికారుల తనిఖీల్లో వేలాది దొంగఓట్లు బహిర్గతమయ్యాయి. వాటి ద్వారానే గతంలో వారు విజయం సాధించారని ఈ సంఘటన రుజువు చేస్తోంది.



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని పలు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ దొంగ ఓట్లతోనే గత ఎన్నికల్లో గెలుపొందింది. తాజాగా బయటపడ్డ దొంగ ఓట్ల వ్యవహారం చూస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని అధికారపార్టీ నేతలు జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారులకు పలుదఫాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వాటి తొలగింపునకు ఫారం–7 దరఖాస్తులు పెట్టారు. జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టగా పెద్ద ఎత్తున అక్రమ ఓట్లు ఉన్నట్లు తేలింది. ప్రధానంగా ఇతర రాష్ట్రాల్లో ఓట్లున్నవారికీ ఇక్కడ ఓట్లుండటం, స్థానికంగా ఒకే నియోజకవర్గంలో రెండు చోట్ల ఓట్లు నమోదు కావడం, చని పోయినవారి ఓట్లు జాబితాలో ఉండటం బయటపడింది. ఈ విధంగా బాపట్ల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 46,116 దొంగ ఓట్లను అధికారులు తొలగించారు. గత ఎన్నికల్లో టీడీపీ గెలుపొందిన పర్చూరు, రేపల్లె, అద్దంకి నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు అధికంగా బయట పడ్డాయి. అక్రమ ఓట్ల వల్లే గత ఎన్నికల్లో టీడీపీ గెలుపొందినట్లు స్పష్టమవుతోంది. ఇప్పుడు వాటిని తొలగించడం వల్ల రాబోయే ఎన్నికల్లో వారి విజయం ప్రశ్నార్థకంగా మారనుంది.

పర్చూరులో పదివేలకు పైగా దొంగ ఓట్లు

పర్చూరు నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపొందారు. 2014లో 10,775 ఓట్లు, 2019లో 1647 ఓట్ల మెజారిటీ వచ్చింది. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1967, 1991, 2004, 2019లో మాత్రమే పదివేలకు పైబడి మెజార్టీవచ్చింది. మిగిలిన 11 ఎన్నికల్లో 7 వేలకు మించలేదు. తాజాగా అధికారులు ఈ నియోజకవర్గంలో 10,468 దొంగ ఓట్లను తొలగించారు. మరిన్ని దొంగ ఓట్లు బయటపడే అవకాశముంది. దీన్నిబట్టి పర్చూరులో టీడీపీ దొంగ ఓట్లవల్లే గెలుపొందినట్లు తెలుస్తోంది.

రేపల్లెలోనూ దొంగ ఓట్ల హవా...

రేపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ 2014లో 13,355 ఓట్లు, 2019లో 11,555 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకూ జరిగిన 15 ఎన్నికల్లో 8 సార్లు 10 వేలకు మించి మెజార్టీ రాగా 7 సార్లు 10వేలలోపు మెజార్టీ వచ్చింది. ఇక్కడ ఓట్ల విచారణ పూర్తికాక ముందే 8,880 దొంగ ఓట్లను గుర్తించారు. ఇంకా మరికొన్ని దొంగ ఓట్లు బయట పడే అవకాశముంది. దొంగ ఓట్ల తొలగింపు రాబోయే ఎన్నికల్లో పచ్చపార్టీపై ప్రభావం చూపనున్నట్టు తెలుస్తోంది.

అద్దంకిలోనూ అదే తీరు...

అద్దంకి నియోజకవర్గంలో గత మూడు ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ కాంగ్రెస్(ఐ), వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. గత ఎన్నికల్లో ఆయనకు 12,991 మెజార్టీ వచ్చింది. 2009, 2019 ఎన్నికల్లో మాత్రమే ఈ నియోజకవర్గంలో 10 వేలకు మించి మెజార్టీ వచ్చింది. మిగిలిన 12 ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు సగటున 5 వేలకు మించి మెజార్టీ రాలేదు. తాజాగా ఈ నియోజకవర్గం పరిధిలో అధికారులు 7,207 దొంగ ఓట్లను తొలగించారు. విచారణ పూర్తయితే మొత్తం 8 వేల పైచిలుకు దొంగ ఓట్లను తొలగించే అవకాశముంది.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

32 ప్రత్యేక రైళ్లను నడపనున్న దక్షిణ మధ్య రైల్వే / విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాలకు ఏర్పాటు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు ద.మ రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ రైళ్లను నడుపనున్నారు.

- సికింద్రాబాద్–బ్రహ్మపూర్ (07089) ఈ నెల 7, 14 తేదీలలో సాయంత్రం 7.45 గం.లకు సికింద్రాబాద్‌లో బయలుదేరి తర్వాత రోజు ఉదయం 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- బ్రహ్మపూర్–వికారాబాద్ (07090) ఈ నెల 8, 15 తేదీలలో మధ్య రాత్రి 12.30 గం.లకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి తర్వాత రోజు ఉదయం 8.30 గం.లకు వికారాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07091) 9, 16 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- బ్రహ్మపూర్–సికింద్రాబాద్ (07092) రైలు 10, 17 తేదీలలో మధ్య రాత్రి 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి తర్వాత రోజు ఉదయం 6.30 గం.లకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కర్నూలు సిటీ (08541) 10, 17, 24 తేదీలలో సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 1.25 గంటలకు కర్నూలు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (08542) 11, 18, 25 తేదీలలో మధ్యాహ్నం 3.30 గం.లకు కర్నూలులో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 11 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- శ్రీకాకుళం–వికారాబాద్ (08547) 12, 19, 26 తేదీలలో సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9 గం.లకు వికారాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (08548) 13, 20, 27 తేదీలలో రాత్రి 8.25 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–తిరుపతి (02764) 10, 17 తేదీలలో సాయంత్రం 6.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.45 గం.లకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (02763) 11, 18 తేదీలలో సాయంత్రం 5.15 గం.లకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.55 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07271) 12న రాత్రి 9 గం.లకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07272) 13న రాత్రి 8.10 గం.కు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, తర్వాత రోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–బ్రహ్మపూర్ (07093) 8, 15 తేదీలలో సాయంత్రం 7.45 గం.లకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, తర్వాత రోజు ఉదయం 11.15 గం.లకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07094) 9, 16 తేదీలలో మధ్యాహ్నం 12.30 గం.లకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి, తర్వాత రోజు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- నర్సాపూర్–సికింద్రాబాద్ (07251) 10న సాయంత్రం 6 గం.లకు నర్సాపూర్‌లో బయలుదేరి తర్వాత రోజు తెల్లవారుజామున 4.50 గం.లకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07252) 11న ఉదయం 8.30 గం.లకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 11.30 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 112

శనివారం 6-1-2024



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



భారత మహిళల విజయం

టీ20 సిరీస్‌లో 9 వికెట్ల తేడాతో ఆసీస్‌పై మెరుపు విజయం - స్పోర్ట్స్‌లో



బ్రూక్‌ఫీల్డ్ చేతికి 'ఏటీసీ'

అమెరికన్ టవర్ కార్పొరేషన్‌కు చెందిన దేశీ బిజినెస్ కొనుగోలు - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫ్యూయల్ సెల్ పరీక్ష సక్సెస్

ఉపగ్రహాలకు ఇంధన సరఫరాలో కీలకమైన ఫ్యూయల్ సెల్ పనితీరును విజయవంతంగా ఇస్రో పరీక్షించింది.

వివరాలు 6లో ▸



ఈడీ అధికారులపై దాడి

పశ్చిమ బెంగాల్‌లో ఈడీ అధికారులపై టీఎంసీ మద్దతుదారులు దాడి చేసి అధికారులను గాయపరిచారు.

వివరాలు 6లో ▸



రాజ్యసభకు స్వాతి మలివాల్!

డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్‌ను రాజ్యసభకు నామినేట్ చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



తోకముడిచిన సొమాలియా పైరేట్లు

6లో

నౌక హైజాక్ యత్నాన్ని అడ్డుకున్న భారత నేవీ కమాండోలు

15 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 21 మంది క్షేమం



మిగులుకూ మేలు

కారణమేదైనా గానీ పథకాలు పొందలేకపోయిన అర్హులందరికీ లబ్ధి: సీఎం జగన్

మళ్లీ దరఖాస్తుకు అవకాశమిస్తూ ఏటా రెండు దఫాలుగా మంచి చేస్తున్నాం

ప్రజల తరపున మంచి సేవకుడిలా ఈ ప్రభుత్వం ఉంది.. వివిధ పథకాల కింద మిగిలిపోయిన 68,990 మంది అర్హుల ఖాతాల్లోకి రూ.97.76 కోట్లు

క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా జమ చేసిన సీఎం

మిగిలిపోయిన అర్హులకు ఇప్పటివరకు ఐదు విడతల్లో రూ.1,700 కోట్ల మేర ప్రయోజనం

II లో


నారా దారి.. అడ్డదారి

ఊతకర్రల సాయంతో చంద్రబాబు దింపుడుకళ్లం ఆశలు

ఎన్నికల వేళ జగన్‌ను ఎదుర్కోవటానికి కుట్రలు, కొత్త పుంతలు

- అన్ని పార్టీలూ తన అవసరాల కోసమే మోహరింపు.. కాంగ్రెస్, బీజేపీని తన మనుషుల ద్వారా నడిపిస్తున్న వైనం
- అవసరమైనప్పుడల్లా పార్టీలకు ఇం'ధనం'.. ప్రత్యేక విమానాల సేవలు
- శిష్యుడు రేవంత్ సహా తెలంగాణ నేతలు అందరినీ కాంగ్రెస్ గూటికి చేర్చిన బాబు
- ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక సీఎం పీఠంపై కూర్చోవడానికీ సహకారం..
- తన సామాజిక వర్గానికి చెందిన సునీల్‌ను కాంగ్రెస్ వ్యూహకర్తగా నియమించి పావులు
- నాడు జగన్‌పై కాంగ్రెస్ ద్వారా అక్రమ కేసులు బనాయింపు.. ఆ నాటి నుంచి హస్తంతో బాబు అక్రమ బంధం
- హఠాన్మరణం తర్వాత వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్
- ఆ పార్టీకి ఏపీలో ఎవరు సారథ్యం వహించినా ఒరిగేది శూన్యమే

2లో



నిజం చెప్పడు... నేరుగా పోరాడడు.. అవకాశవాదమే కాదు అలవోకగా అబద్ధాలాడేసే నైజం. ఇచ్చిన మాటంటే లెక్కే ఉండదు. ఏరు దాటాక తెప్పని బూడిద చేసి నీట్లో కలిపేసే రకం. అధికారం కోసం దేనికైనా రెడీ. శత్రువుల కాళ్లు పట్టుకోవటానికైనా... మిత్రుల కాళ్లు నరికేయదానికైనా...!! ఎంతసేపూ... తనకు ఎవరు, ఎలా ఉపయోగపడతారనే యావే. బహుశా! ఆధునిక రాజకీయాల్లో చంద్రబాబు లాంటి నాయకుడెవరినీ చూడలేం. పురాణాల్లోనూ ఇలాంటి పాత్ర కనిపించదు. ఎందుకంటే వాటిలోని పాత్రల లక్షణం ఒక్కటీ ఈయనలో ఉండదు. ఈయనకున్న అవ లక్షణాలు పురాణాల్లోని ఏ ప్రతినాయకుడికీ ఉండవు. కానీ చంద్రబాబులోని ఈ అవలక్షణాలన్నిటికీ విజన్.. చాణక్యం.. అనే ముసుగులేసి ఆయనో ఘనమైన నాయకుడని నమ్మించింది ఓ వర్గం మీడియా. వీళ్ల దృష్టిలో బాబు ఏం చేసినా... అది రాష్ట్ర ప్రయోజనాల కోసమే. ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా... ప్రజాస్వామ్యం కోసమే!!. ఔరా.. ఇంత దౌర్భాగ్యమా??

ఆర్టీసీ సంక్రాంతి కానుక

- స్పెషల్ బస్సుల్లో సాధారణ ఛార్జీలే..
- ఈ నెల 6 నుంచి 18 వరకు నిర్వహణ
- ముందస్తు రిజర్వేషన్లకు రాయితీ
- డిజిటల్ చెల్లింపులకు అవకాశం

12లో



వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

రాజోలు, వెంకటగిరిల్లో బస్సు యాత్రకు జనం జేజేలు

మరోవైపు కనిగిరిలో చంద్రబాబు సభ అట్టర్ ఫ్లాప్

టీడీపీ తొలి ఎన్నికల శంఖారావ సభకు జనం కరువు

- వివరాలు 2లో

ముమ్మరంగా వర్జీనియా సాగు

- ఆశాజనకంగా పొగాకు తోటలు
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రారంభమైన క్యూరింగ్ పనులు



పొగాకు పంట

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో వర్జీనియా పొగాకు సాగు ముమ్మరంగా సాగుతుంది. ఈ ఏడాది రైతులు వేసిన పంటలు మిచాంగ్ తుపాను కారణంగా కొంతమేర దెబ్బతింది. అయినప్పటికీ రైతులు మళ్లీ పంటలను వేశారు. అక్టోబర్‌లో వేసిన తోటలు పలుచోట్ల పక్వానికి రావడంతో రైతులు ఆకులు రెలిచి క్యూరింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రస్తుతం పొగాకు పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రధానంగా వరి, మొక్కజొన్న, చెరుకు తర్వాత అత్యధికంగా వర్జీనియా పంటల్ని రైతులు పండిస్తున్నారు. గత రెండేళ్లుగా పొగాకు పంటకు ధర అధికంగా ఉండడంతో ఈ ఏడాది అనేక మంది రైతులు కౌలుకు తీసుకుని మరీ పొగాకు వేశారు. ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో ఉత్తర తేలిక నేలలో(ఎన్ఎల్ఎస్) పొగాకు సాగు చేస్తున్నారు. ఇక్కడ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. అమెరికా, రష్యా, జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాల్లో పండిస్తున్న పంటకు దీటుగా ఈ ప్రాంత రైతులు పొగాకు పండిస్తున్నారు. అక్టోబర్ నుంచి మార్చి వరకూ పొగాకు సీజన్.. పండించిన పొగాకును ఆకులు రెల్చి క్యూరింగ్ చేసి బేళ్లుగా కట్టి గ్రేడ్ చేసి వేలం కేంద్రాల్లో విక్రయిస్తారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకూ పొగాకు కొనుగోళ్లు జరుగుతాయి.

తోటల ఎదుగుదల బాగుంది.

పలు గ్రామాల్లో ముందుగా వేసిన పొగాకు తోటల రెల్పులు, క్యూరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది 55 వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను తిరిగి వేశారు. తోటల ఎదుగుదల బాగుంది. పరిమితికి లోబడి పంట వేసి అధిక దిగుబడులు సాధిస్తే సాగు లాభసాటిగా ఉంటుంది. - **ఎం.ఆదిశేషయ్య, పొగాకు బోర్డు ఆర్ఎం, రాజమండ్రి**

55 వేల ఎకరాల్లో వర్జీనియా సాగు

ఈ ఏడాది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో 49 మిలియన్ల కిలోల ఉత్పత్తికి కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. సుమారు 55 వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 68 మిలియన్ల కిలోల వరకూ ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని 14,097 మంది రైతులు 12,235 బ్యారన్‌లు రిజిస్ట్రేషన్ చేసుకుని పొగాకు సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రం పరిధిలో 2,877 మంది రైతులు 2,407 బ్యారన్‌లు రిజిస్ట్రేషన్ చేసుకుని సుమారు 4,490 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జంగారెడ్డిగూడెం-2లో 2,760 మంది రైతులు 2,608 బ్యారన్‌ల పరిధిలో సుమారు 4,335 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు. కొయ్యలగూడెంలో 2,892 మంది రైతులు 2,539 బ్యారన్‌ల పరిధిలో 4,443 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు.

రేపు గిరిజన శంఖారావం

సాక్షి, అమరావతి: విజయవాడ కేంద్రంగా 'గిరిజనుల శంఖారావం' భారీ సభను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతున్న సభ ఏర్పాట్లను ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తదితర గిరిజన నేతలు శుక్రవారం పరిశీలించారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాన్ని శంకర్‌నాయక్ విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. గిరిజన ప్రజా సమాఖ్య(జీపీఎస్), గిరిజన విద్యార్థి సమాఖ్య(జీవీఎస్)ల ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సభకు రాష్ట్రంలోని గిరిజనులు, గిరిజన నేతలు, జాతీయ నేతలు భారీగా తరలిరానున్నారని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తదితరులు హాజరవుతారన్నారు.

గోదావరి చెంతన తెలుగు సభల నిర్వహణ భేష్

ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

- ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- తొలి రోజు మూడు వేదికలపై సందడి చేసిన కవులు, కళాకారులు



జ్యోతి ప్రజ్వలన చేసి సభలను ప్రారంభిస్తున్న ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి చెంతన సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయమని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఇక్కడి గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజరాజనరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, ఆదికవి నన్నయ భారతాన్ని ఆంధ్రీకరించి వెయ్యేళ్లయిన సందర్భంగా ఈ సభలు నిర్వహిస్తున్నారు. రాజరాజ నరేంద్రుడు, నన్నయ భట్టారక, నారాయణభట్టు వేదికలపై నిర్వహిస్తున్న ఉత్సవాలను గవర్నర్ విశ్వభూషణ్, విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. గవర్నర్ విశ్వభూషణ్ మాట్లాడుతూ.. సంస్కృతి, రచనలకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం విరాజిల్లుతోందన్నారు. అలాంటి గడ్డపై తెలుగు మహాసభలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. కావ్యాలు, పురాణేతిహాసాలను తెలుగు వాళ్లు అనువదించినట్టు ఎవరూ చేయలేదన్నారు. తెలుగులో ఎన్నో యాసలు, ప్రాసలు, ఉపభాషలు ఉన్నాయన్నారు. పోతన భాగవతం, అన్నమయ్య కీర్తనల్లోని పదాలు చూస్తే ముచ్చటేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యకారి వారణాసి రామ్‌మాధవ్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి అందెశ్రీ, జేఎన్‌టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ పాల్గొన్నారు.

9న 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సు

సాక్షి, అమరావతి: తెలుగు భాషా వికాసం, సంస్కృతుల పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్టు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. ఈనెల 9న అనంతపురం జిల్లాలో 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సులో తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న 90 మంది సాహితీమూర్తులను సత్కరిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. 10 మంది సాహితీస్రష్టలకు తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాలు, 40 మందికి తెలుగు భాషా సేవ ప్రతిభా పురస్కారాలు, మరో 40 మంది కవులు, కళాకారులను కూడా సత్కరిస్తామన్నారు. సదస్సులో అనంత జిల్లా సాహిత్య వైశిష్ట్యం, జిల్లా భాష, పద్య కవిత్వం, ఆధునిక కవిత్వం, నవల, కథానిక, జానపదం, బళ్లారి రాఘవ నాటకం, సాహిత్య విమర్శ, సాహిత్యంలో హాస్యం వంటి ప్రత్యేక ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, 'జయహో శ్రీకృష్ణదేవరాయలు' నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తామన్నారు. త్వరలోనే విశాఖ కేంద్రంగా 'ఉత్తరాంధ్ర సాహితీ సదస్సు', నెల్లూరులో 'దక్షిణాంధ్ర సాహితీ సదస్సు', తణుకులో 'గోదావరి సాహితీ వైభవ సదస్సు', 'ధార్మిక సాహితీ సదస్సు' నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు రచయితలు, కవి పండితులు, సాహితీమూర్తుల వివరాల జాబితాను సమగ్రంగా నవీకరిస్తున్నట్టు తెలిపారు. సంబంధిత వ్యక్తుల పేరు, చిరునామా, ఫోన్ నంబర్, మెయిల్ అడ్రస్, రచనల పూర్తి వివరాలను 8801811782, 7989499978 నంబర్లకు వాట్సాప్/ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం olcommissionap@gmail. com మెయిల్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో భాషా సంఘం సభ్యుడు రామచంద్రారెడి పాల్గొన్నారు.

ఇదండీ వరస



ఈ రకంగా కూడా ప్రచారం చేసుకోవచ్చుగా సార్!!

సునీత, రామ్‌సింగ్ వ్యాజ్యాలపై విచారణ 10కి వాయిదా

అభ్యర్థనలను సవరించామన్న న్యాయవాదులు

సవరణలను అనుమతించిన న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రామ్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై తదుపరి విచారణ ఈ నెల 10వ తేదీకి వాయిదా పడింది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌తో పాటు చార్జిషీట్‌ను సైతం రద్దు చేయాలంటూ సునీత, రామ్‌సింగ్ తదితరులు తమ వ్యాజ్యాల్లో తాజాగా చేసిన సవరణలను హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీభానుమతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య విషయంలో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రామ్‌సింగ్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ జరపాలని పులివెందుల పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రామ్‌సింగ్‌లపై కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో రాజశేఖర్‌రెడ్డి, సునీత హైకోర్టును ఆశ్రయించారు. తమపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరారు. ఈ వ్యాజ్యాలు గురువారం విచారణకు రాగా, సునీత తదితరుల వ్యాజ్యాల్లోని అభ్యర్థనలపై పోలీసుల తరపున స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూరా వెంకట సాయినాథ్ అభ్యంతరం తెలిపారు. చార్జిషీట్ కూడా దాఖలు చేశామని, అందువల్ల కేసు కొట్టేయాలన్న సునీత తదితరుల వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి, వ్యాజ్యాల్లో చేసిన అభ్యర్థనలను సవరించాలని సునీత తదితరులను ఆదేశించారు. శుక్రవారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా, సునీత తదితరుల తరపు న్యాయవాదులు స్పందిస్తూ.. కోర్టు ఆదేశాల మేరకు తమ అభ్యర్థనల్లో సవరణలు చేశామని కోర్టుకు నివేదించారు. ఆ సవరణలను అనుమతించిన న్యాయమూర్తి.. కోర్టు సమయం సరిపోకపోవడంతో తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం



నియోజకవర్గ స్థాయిలో రాజోలులో నిర్వహించిన సాధికార సభకు హాజరైన అశేష జనవాహిని

- రాజోలు నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- భారీగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు

సాక్షి, అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో సామాజిక సాధికార నినాదం మార్మోగింది. శుక్రవారం మలికిపురం ప్రధాన రహదారి నుంచి వైఎస్సార్ సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరితో ప్రధాన రహదారి నిండిపోయింది. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తమకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటూ 'జై జగన్.. జై వైఎస్సార్‌సీపీ' నినాదాలతో హోరెత్తించారు. వీరికి స్థానిక ప్రజలు జేజేలు పలికారు. అనంతరం జరిగిన సామాజిక సాధికార సంభ జన సంద్రాన్ని తలపించింది.

హోదా పెంచారు : మోపిదేవి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో పెద్ద పీట వేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గౌరవం ఇచ్చారని, సమాజంలో హోదాను పెంచారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ తెలిపారు. తనతో పాటు బీదా మస్తాన్‌రావు, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆర్. కృష్ణయ్యలను రాజ్యసభకు పంపించారంటే బీసీల పట్ల జగన్‌కు ఉన్న ప్రేమను అర్థం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ. మైనార్టీలకు అధికారంలో సముచిత స్థానం ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. అంబేడ్కర్, పూలే కన్న కలలను సీఎం జగన్ నిజం చేశారన్నారు.

సామాజిక విప్లవం: మంత్రి విశ్వరూప్

సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో సామాజిక విప్లవం వచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మహిళలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదిగేందుకు తోడ్పడ్డారన్నారు. సమాజంలో బడుగు, బలహీన వర్గాలు ఉన్నత స్థితికి రావాలంటే చదువుతోనే సాధ్యమని జగన్ సంపూర్ణంగా విశ్వసించారని, అందుకే నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే నేరుగా నగదు జమ చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ కానుకను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచారని చెప్పారు.



మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

పేదల పక్షాన : మంత్రి చెల్లుబోయిన వేణు

రాష్ట్రంలో పేద వర్గాల పక్షాన నిలబడింది సీఎం జగన్ ఒక్కరేనని, ప్రతి సంక్షేమ పథకం లబ్ధిని పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందజేస్తున్నారని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను బానిసలుగా చూసిన చంద్రబాబుకు, ఈ వర్గాల వారిని అందలం ఎక్కించిన జగన్‌కు మధ్య పాలనను బేరీజు వేసుకుని, వచ్చే ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఈ ప్రభుత్వంలో జరుగుతున్న మేలును చూసి చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడు ఓర్చుకోలేక, నిత్యం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి.. జన కెరటం

- సీఎం జగన్ చేసిన అభివృద్ధిని ఎలుగెత్తి చాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- అశేష జనవాహిని మధ్య సామాజికసాధికార సభ



సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు



నియోజకవర్గ స్థాయిలో వెంకటగిరిలో నిర్వహించిన సాధికార సభకు భారీగా హాజరైన జనం

సాక్షి, తిరుపతి: తిరుపతి జిల్లా వెంకటగిరిలో సామాజిక న్యాయం నినదించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు సీఎం జగన్ పాలనలో తాము సాధించిన అభివృద్ధిని ఎలుగెత్తి చాటారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన ప్రజలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్ర ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. వెంకటగిరిలో ప్రారంభమైన ర్యాలీ పోలేరమ్మ ఆశీర్వాదం అందుకుని డక్కిలి మీదుగా రాపూరుకు చేరుకుంది. యాత్ర వెళ్లిన ప్రతి వీధిలో స్థానిక ప్రజలు నీరాజనాలు పలికారు.

దళితుల కోసం రూ. 86 వేల కోట్లు ఖర్చు : ఎంపీ గురుమూర్తి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఉన్నతికి సీఎం వైఎస్ జగన్ చేసినంత కృషి దేశంలో మరే ముఖ్యమంత్రీ ఇప్పటివరకు చేయలేదని ఎంపీ గురుమూర్తి చెప్పారు. ఒక్క దళితుల కోసమే సీఎం జగన్ రూ. 86 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. దళితుల పిల్లల చదువుల కోసం ఈ నాలుగున్నరేళ్లలో రూ. 10 వేల కోట్లు, ఈ వర్గాల మహిళల కోసం మరో రూ. 10వేల కోట్లు ఇచ్చారన్నారు. మళ్లీ జగనన్న వస్తేనే సంక్షేమం కొనసాగి, మన జీవితాల్లో మరింతగా వెలుగులు నిండుతాయని చెప్పారు.

సీఎం జగన్ అంటేనే ఓ విప్లవం: ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల పేదలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్ అంటేనే ఓ విప్లవమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. చదువుతోనే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని జగనన్న నమ్మి ప్రభుత్వ విద్యా రంగాన్ని అత్యున్నతంగా తీర్చి దిద్దుతున్నారని తెలిపారు. మన పిల్లలు ఈరోజు బెంచీల మీద కూర్చుని, దర్జాగా యూనిఫాం, షూస్ వేసుకుని, టైలు కట్టుకుని.. ఇంగ్లిష్ మీడియం చదువులు చదువుతున్నారన్నారు. ధనవంతుల పిల్లలకు, పేదల పిల్లలకు తేడా లేకుండా చేసిన జగనన్నకు మనం ఎంతగా రుణ పడిపోయామో అర్థం చేసుకోవాలని కోరారు. పేదలకు ఎలాంటి జబ్బులు చేసినా, ఎంత పెద్దవైనా రూ. 25 లక్షల మేర వైద్య సాయం అందిస్తున్నారని అన్నారు.

సీఎం జగన్ కులం, మతం చూడరు.. కేవలం ప్రేమను చూపిస్తాడు: అలీ

సీఎం జగన్ కులం, మతం చూడరని, కేవలం ప్రేమనే చూపిస్తారని ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ అన్నారు. ఎప్పుడూ పేదలకు ఇంకా ఎంతో మంచి చేయాలని తపిస్తున్నారన్నారు. ఎన్నడూ చిరునవ్వు చెదరనివ్వని జగనన్న ప్రజల జీవితాల్లోనూ అదే సంతోషాన్ని చూడాలని సుపరిపాలన చేస్తున్నారని కొనియాడారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడం మనకు చాలా అవసరమని చెప్పారు.

జగన్ బటన్ నొక్కితే.. బాబు గొంతు నొక్కుతాడు: నాగార్జున యాదవ్

సీఎం జగన్.. బటన్ నొక్కి నేరుగా పేదలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ చెప్పారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం జనం గొంతు నొక్కే కార్యక్రమాలే చేశారని ధ్వజమెత్తారు. 14 ఏళ్లలో ఒక్కసారి కూడా బటన్ ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్సీలు పోతుల సునీత, మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం తదితరులు మాట్లాడారు.

మేము రాం 'బాబో'య్..

టీడీపీ తొలి ఎన్నికల శంఖారావ సభ అట్టర్ ఫ్లాప్

- 'రా.. కదిలిరా' అని బాబు నినదిస్తుంటే.. సభ నుంచి వెళ్లిపోయిన ప్రజలు
- ఖాళీ కుర్చీలకే ప్రసంగాన్ని వినిపించిన ప్రతిపక్ష నేత
- ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ప్రజలను తరలించేందుకు తమ్ముళ్ల ప్రత్యేక ఏర్పాట్లు
- వాహనాలు సమకూర్చి, డబ్బులు పంచినా ప్రజల్లో స్పందన కరువు



పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో కనిగిరిలో నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న వేళ జనం లేక వెలవెలబోతున్న కుర్చీలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ అధినేత చంద్రబాబు ఏర్పాటు చేసిన తొలి ఎన్నికల శంఖారావ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. ప్రకాశం జిల్లా కనిగిరిలో శుక్రవారం జరిగిన ఈ సభకు ప్రజల నుంచి కనీస స్పందన లేకపోవడంతో టీడీపీ నేతలు తలలు పట్టుకున్నారు. 'రా.. కదిలి రా' అని చంద్రబాబు సభలో ఓ పక్క నినదిస్తూ ప్రసంగం మొదలు పెట్టిన వెంటనే.. కార్యకర్తలు, ప్రజలు లేచి వెళ్లిపోయారు. దీంతో ఖాళీ కుర్చీలకే చంద్రబాబు తన ప్రసంగం వినిపించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా 25 పార్లమెంట్ జిల్లాల్లో 25 బహిరంగ సభలు నిర్వహిస్తామని ప్రకటించిన చంద్రబాబు.. అందులో భాగంగా ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు మొట్టమొదటిగా కనిగిరిని ఎంచుకున్నారు. అనుకున్నదొక్కటి అయినదొక్కటి చందాన తెలుగు తమ్ముళ్లు చంద్రబాబుకు ఝలక్ ఇచ్చారు. క్యాడర్ లేక సభ వెలవెలబోవడంతో ఆ ఎఫెక్ట్ రాష్ట్రం మొత్తం పడుతుందనే ఆందోళన ఆ పార్టీ నేతల్లో స్పష్టంగా కనిపించింది. మొట్టమొదటి ఎన్నికల శంఖారావం కావడంతో పది రోజులుగా రాష్ట్రస్థాయి టీడీపీ నేతలంతా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తిష్ట వేసి వాహనాలు సమకూర్చడంతో పాటు మద్యం, డబ్బు, బిర్యానీ ప్యాకెట్లు పంచేందుకు ఏర్పాట్లు చేశారు. లక్ష మంది వస్తారంటూ ప్రగల్భాలు పలికినా అందులో పది శాతం కూడా జనం రాక సభ ఫ్లాపవడంతో ఇక తమ పనైపోయిందని ఆపార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. ఇక సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడంతో, చేతులెత్తి జై కొట్టండి.. చప్పట్లు కొట్టి ఆమోదం తెలపండంటూ వారిలో చలనం తెచ్చేందుకు తిప్పలు పడ్డారు.

పౌరుషాల గడ్డ నుంచి శంఖారావం పూరించాం: చంద్రబాబు

పౌరుషాల గడ్డ కనిగిరి నుంచి ఎన్నికల శంఖారావం పూరించామని సభలో ప్రసంగిస్తూ చంద్రబాబు అన్నారు. వెనుకబడిన కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మార్కాపురాన్ని జిల్లాగా చేస్తామని, వెలిగొండ పూర్తి చేసి కనిరిగిలో ఫ్లోరైడ్ సమస్య లేకుండా ఇంటింటికి కుళాయి ద్వారా నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు.

ప్రజలకు ఏం మేలు చేశావని నీకోసం వస్తారు?



- చంద్రబాబుపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి పేర్ని నాని
- ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్క మంచి పనైనా చేశావా?
- కనిగిరికి అరచేతిలో వైకుంఠం చూపిస్తా అంటున్నావ్
- ఎలక్షన్లు వస్తే పచ్చి అబద్ధాలు, మోసాలు చేయడం నీ పని

సాక్షి, అమరావతి: ''రా.. కదలిరా అని పిలవగానే నీకోసం జనం ఎందుకు కదలి రావాలి. నువ్వు ఎవరికి ఏం మంచి చేశావని జనం వస్తారు'' అంటూ చంద్రబాబునాయుడిపై మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు ఇప్పుడొచ్చి హైదరాబాద్, బెంగళూరు తరహాలో కనిగిరిని అభివృద్ధి చేస్తానని, పేదరికం లేని సమాజాన్ని సృష్టిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఎన్నికలు వస్తే నీకు బీసీలు గుర్తు వస్తారు. కానీ వాళ్లకు మంత్రి పదవులు ఇవ్వవు. సరైన పథకాలు అమలు చేయవు. గతంలో ఎన్నో హామీలు ఇచ్చి మేనిఫెస్టో మాయం చేశావ్. చెప్పడానికి సిగ్గు అనిపించడం లేదా? బీసీలకు గుర్తుండే ఒక మంచి పథకం అయినా తీసుకొచ్చారా? ఎంతసేపు ఇస్త్రీ పెట్టెలు, మేకలు, గొర్రెలు, కల్లు కార్మికులకు కొడవళ్లు ఇచ్చారు. వీటితో వారి బతుకులు మారాయా? జయహో బీసీ కార్యక్రమం కేవలం ఓట్లు కోసమే కదా? బీసీలతో ఓట్లు వేయించుకుని వాళ్ల బతుకులను మాత్రం మార్చలేదు. విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు పెంచింది నీ పాలనలోనే కదా? నిత్యావసర వస్తువులు నీ హెరిటేజ్ బజార్లలో తక్కువకు ఇస్తున్నావా?

ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా?

నువ్వు, పవన్ కళ్యాణ్ 2014లో అధికారం కోసం ఇంటికో ఉద్యోగం అని హామీ ఇచ్చారు కదా! ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి. కనీసం ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా?. వైఎస్ జగన్ సీఎం అయ్యాక లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయి. మద్యం తాగమంటూ పేదలను ప్రోత్సహిస్తావా? అందుకేనా బ్రాందీ తక్కువ ధరకు ఇస్తానని.. ఇంటికే సరఫరా అని అంటున్నావు. ఇదేనా నువ్వు పేదలకు చేసే మేలు? ఎన్నికల్లో మీరు అభ్యర్థులను ఎక్కడికైనా మార్చవచ్చు. మేము మారిస్తే తప్పా. జవహర్‌ను కొవ్వూరు నుంచి తిరువూరుకు ఎందుకు మార్చారు? నువ్వు చంద్రగిరి నుంచి కుప్పానికి ఎందుకు మారావు? నీతులు చెప్పడానికి సిగ్గుండాలి. ఇప్పుడు నువ్వు కొత్త హామీలిస్తూ ప్రజల చెవిలో పూలు పెట్టడానికి రెడీ అయ్యావు.ఆడపిల్ల పుడితే రూ. 25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తా అని 2014 మేనిఫెస్టోలో చెప్పావు? ఒక్కరికైనా డిపాజిట్ చేశావా? గతంలో నువ్వు ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చావా?జగన్ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు, 4 పోర్టులు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ స్కూళ్లు, రోడ్లు, ప్రైవేటు పరిశ్రమలొచ్చాయి. ఇది అభివృద్ధి కాదా?

నిన్నెవరు నమ్ముతారు..

నీ హెరిటేజ్ వస్తువుల అమ్ముకోవడం కోసం రంజాన్ తోఫా తెచ్చావు. సీఎంగా ఉన్నప్పుడు చదువు ప్రభుత్వ బాధ్యత కాదన్నావు. నాడు పేదల చదువును అవహేళన చేసి.. ఇప్పుడు అధికారంలోకి వస్తే విమానాల్లో విదేశాలకు తీసుకెళ్తానంటే నిన్ను ఎవరు నమ్ముతారు. నీకు పవన్‌కు సిగ్గులేదు. గతంలో తిట్టుకుని, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు.

అది షర్మిల వ్యక్తిగతం..

షర్మిల ఒక రాజకీయ నాయకురాలు. చాలా మంది పార్టీలు మారుతూనే ఉన్నారు. ఆమె పార్టీ పెట్టి.. కాంగ్రెస్‌ను విమర్శించారు. తర్వాత అదే పార్టీలో తన పార్టీని విలీనం చేశారు. వైఎస్సార్‌సీపీ వైఎస్ జగన్ నాయకత్వంలో ఏర్పడింది. మేమంతా జగన్ నాయకత్వం చూసి వచ్చాం. నాయకత్వం నచ్చలేదంటే ఉన్నవారుంటారు. వెళ్లే వారు వెళ్తారు. ఎవరితో ప్రయాణం చేయాలి అనేది వారి వ్యక్తిగత నిర్ణయం. తెలంగాణలో పార్టీ పెట్టేటప్పుడే వద్దని జగన్ చెప్పారు. నా ఇష్టం అన్నపుడు ఇక వారి రాజకీయ ప్రయాణంతో జగన్‌కు ఏ సంబంధం ఉంటుంది?

చంద్రబాబుపై ఎంపీ కేశినేని తిరుగుబాటు?

- కేశినేని నాని కుటుంబంలో చిచ్చు రగిల్చిన చంద్రబాబు
- లోకేశ్ ఒత్తిడితో నాని సోదరుడికి ప్రోత్సాహం
- తిరువూరులో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు
- ఎంపీ అభ్యర్థిగా అవకాశం లేదని నానికి సీనియర్ నేతల స్పష్టీకరణ
- చంద్రబాబు తీరుపై మండిపడుతున్న నాని
- ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడి
- విజయవాడ లోక్‌సభ స్థానంలో తన అభ్యర్థులను నిలపడానికి సిద్ధం



సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీ నుంచి రెండుసార్లు విజయవాడ లోక్‌సభ స్థానానికి ఎన్నికైన కేశినేని నాని ఆ పార్టీ అధినేత చంద్రబాబుపై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఖర్చుకు వెరవకుండా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తన కుటుంబంలోనే చిచ్చుపెట్టి, చలి కాచుకోవాలని భావించిన చంద్రబాబుకు గట్టి షాకే ఇస్తున్నారు. తనకు విజయవాడ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేస్తానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా అవకాశం లేదని టీడీపీ సీనియర్ నేతలు ఆలపాటి రాజా, నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ చెప్పారని శుక్రవారం ఆయనే స్వయంగా ట్వీట్ చేయడం సంచలనంగా మారింది. ఈ ముగ్గురు నేతలు నానిని కలిసి, ఇకపై పార్టీ వ్యవహారాల్లో కలుగజేసుకోవద్దని చెప్పారు. తిరువూరులో చంద్రబాబు పాల్గొనే సభ నిర్వహణ బాధ్యతను కేశినేని చిన్నికి అప్పగిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీంతో నానికి చంద్రబాబు ఇంటి దారి చూపించినట్లు స్పష్టమైపోయింది. లోకేశ్ ఒత్తిడికి తలొగ్గిన చంద్రబాబు.. ఎంపీ నాని సోదరుడు చిన్నిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో నాని కుటుంబంలో చిచ్చు రేగింది. నాని, చిన్ని వర్గాల మధ్య రగులుకున్న వర్గ విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయి. కేశినేని చిన్ని వర్గం లోకేశ్‌ను మేనేజ్ చేస్తున్నారని, దీంతో పార్టీ సర్వనాశనం అవుతోందని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఎంపీ కేశినేని నానికి విజయవాడ నగరం, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో బలమైన వర్గం ఉంది. వీరంతా పార్టీని ఓడించి లోకేశ్‌కు తగిన బుద్ధి చెబుతామని గట్టిగా చెబుతున్నారు. వీరంతా త్వరలో టీడీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు.

ఆసక్తికర వ్యాఖ్యలతో..

ఎంపీ కేశినేని నానికి చంద్రబాబు షాక్ ఇవ్వటంతో కేశినేని నాని శుక్రవారం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవి పార్టీలో కలకలం రేపుతున్నాయి. 'నేను చంద్రబాబుకు వెన్నుపోటు పొడవలేదు. వెన్నుపోటు పొడిస్తే పెద్ద పదవిలో ఉండేవాడిని. నేను ఇండిపెండెంట్‌గానైనా గెలుస్తా. ఫిబ్రవరి మొదటివారంలో నా అభిప్రాయం చెబుతా. గొడవలు పడటం నా తత్వం కాదు. గొడవలు పడాలంటే యువగళంలోనే జరిగేవి'' అంటూ వ్యాఖ్యానించారు. గతంలో సైతం నాని పలుమార్లు కేశినేని చిన్ని వర్గానికి చెందిన దేవినేని ఉమా, బొండా ఉమా, బుద్దా వెంకన్న వంటి నేతలపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు చంద్రబాబు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ఇటీవల కొంతమంది అవినీతిపరులు టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. విజయవాడ నుంచి జగ్గయ్యపేట వరకు దోచుకునేందుకే వీరు ప్రయత్నిస్తున్నారని పేర్కొనటం గమనార్హం. ఇండిపెండెంట్‌గానైనా పోటీకి నాని సిద్ధమవుతున్నారు. విజయవాడ ఎంపీతో పాటు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన వర్గం అభ్యర్థులను నిలిపి టీడీపీకి తన సత్తా చూపేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు నాని వర్గం నేతలు చెబుతున్నారు. నాని వర్గం ఎన్నికల బరిలో నిలిస్తే టీడీపీ బొక్కబోర్లా పడక తప్పదని విశ్లేషకులంటున్నారు.

నిలువెల్లా దుర్మార్గాన్ని, విషాన్ని నింపేసుకున్న 63 కిలోల.. 73 ఏళ్ల చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవటానికి కుతంత్రాలను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ప్రజాబలం లేక ఓటమి తరుముకొస్తుండటంతో వాటిని పతాక స్థాయికి చేరుస్తున్నారు. ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన సీఎం జగన్‌ను తను, తన పార్టీ ఏమీ చేయలేమని తెలుసు గనక జనసేన, సీపీఐ, సీపీఎం లాంటి పార్టీలన్నిటినీ కూడగడుతున్నారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ కూడా... తనకు అనుకూలంగానే పనిచేసేలా వాటిలోని తన మనుషుల ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. 2019లో చంద్రబాబు ఓడిపోగానే ఆయన ఆదేశాల మేరకు బీజేపీలోకి ఫిరాయించిన సి.ఎం.రమేశ్, సుజనా చౌదరి ఇప్పటిదాకా బాబు-బీజేపీలను కలపటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. సి.ఎం.రమేశ్ ఓవైపు ఆ పని చేస్తూనే మరోవైపు బీటెక్ రవిని రంగంలోకి దించడంతోపాటు వైఎస్ షర్మిలకు ప్రత్యేక విమానాలు సమకూర్చి సేవలందిస్తున్నారు. చంద్రబాబు కాంగ్రెస్‌లోకి పంపిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావటంతో టీడీపీ-కాంగ్రెస్ సంబంధాలు మరింత బలపడ్డాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ ద్వారా వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు బనాయించిన నాటి నుంచి హస్తంతో చంద్రబాబు అక్రమ బంధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ వ్యూహకర్తగా తన సామాజిక వర్గానికే చెందిన సునీల్‌ను నియమించి తెరచాటున పనులు చక్కబెడుతున్నారు. ఏపీ కాంగ్రెస్ ఏ దిశగా వెళ్లినా అది తనకే మేలు చేసేలా బాబు ఏర్పాట్లయితే చేసుకున్నారు. కానీ 90ల నాటి కాలం చెల్లిన ఈ పాచిపోయిన ఐడియాలు ఇప్పుడు పనికొస్తాయా? హఠాన్మరణం తర్వాత కూడా దివంగత వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీకి, అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిన పార్టీకి ఏపీలో ఎవరు నేతృత్వం వహించినా ప్రజలు మద్దతు ఇవ్వబోరని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు ఎవరెవరిని ఎలా వాడుకుంటున్నారో ఒక్కసారి చూద్దాం...

నారా దారి.. అడ్డదారి

ఎన్నికల వేళ జగన్‌ను ఎదుర్కోవటానికి కుట్రలు కొత్త పుంతలు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటం, గత ఎన్నికలకు మించి ఘోర పరాజయం గోచరిస్తుండటంతో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంపై దింపుడు కళ్లం ఆశలతో అరాచకత్వానికి పాల్పడుతున్నారు. గత ఎన్నికల్లో అధికారాన్ని కాపాడుకునేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో విడిగా పోటీ చేయించిన చంద్రబాబు ఇప్పుడు అధికారం కోసం అర్రులు చాస్తూ జనసేనతో జత కలిశారు. తెలంగాణలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ఆపార్టీకి ఇం'ధనం' సమకూర్చిన చంద్రబాబు ఆ ఎన్నికల్లో ఓడిపోయాక అక్కడ టీడీపీ నేతలందరినీ 'హస్త'గతం చేశారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తనకు అత్యంత సన్నిహితులైన రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, సుజనా చౌదరి లాంటి వారిని బీజేపీలోకి పంపి అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రమేష్ ద్వారా ప్రత్యేక విమానాలను సమకూరుస్తూ కుట్రలకు పదును పెట్టారు. తన శిష్యుడైన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపి నోట్ల కట్టలు వెదజల్లి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టేలా చేసిన చంద్రబాబు ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక మరోసారి ఇం'ధనం' సమకూర్చి సీఎం పీఠంపై కూర్చోవడానికి సహకరించారు. కాంగ్రెస్‌కు వ్యూహకర్తగా పని చేస్తున్న సునీల్ కనుగోలు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. చంద్రబాబు చెప్పినట్లు ఆడేందుకు, వ్యూహాల పేరిట బాబు ప్లాన్‌ను అమలు చేసేందుకు ఆయన సదా సిద్ధంగా ఉంటారు.

పరాకాష్టకు కుట్రలు, కుతంత్రాలు..

సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ రోజుకు రోజుకు పెరుగుతోందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో ఆపార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్ నౌ లాంటి జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడైంది. ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు పూర్తిగా కోల్పోవడంతో టీడీపీ ఉనికి కూడా చాటుకోలేదని ఆ సర్వేలు తేల్చి చెప్పాయి. గత ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన చంద్రబాబు అడ్డదారి పట్టారు. అనాదిగా మైనార్టీలు కాంగ్రెస్ వెనుకే ఉంటారన్న ఓ పాచిపోయిన భావనను తనకు అనుకూలంగా మార్చుకోవాలన్నది ఆయన ఎత్తుగడ. వైఎస్సార్‌సీపీలో టిక్కెట్ దక్కని వారికి తన శక్తుల ద్వారా కాంగ్రెస్ టికెట్లు ఇప్పించి ఇం'ధనం' సమకూర్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది బాబు ప్లాన్. ఒకవైపు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను చీల్చడం.. మరోవైపు బీజేపీ వ్యతిరేక ఓటు వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయడం దీని వెనుకున్న మరో ఎత్తుగడ. ఇలా ఓవైపు కాంగ్రెస్‌ను తానే నడుపుతూ స్వార్థానికి వాడుకోవడమే కాకుండా.. ఇంకోవైపు బీజేపీని కూడా తన వైపు తిప్పుకుని అవినీతి కేసుల నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లో ఉన్న తన మనుషులు, తాను సృష్టించిన పాత్రల ద్వారా ఈ ఎత్తుగడలను అమలు చేసే ప్రణాళిక వేశారు.

శిథిలమైన కాంగ్రెస్‌తో శూన్యమే..

2014లో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగా విభజించింది. విభజనతో పూడ్చలేని నష్టాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మిగిల్చింది. తరతరాలపాటు రాష్ట్ర ప్రజానీకాన్ని కోలుకోనివ్వకుండా దెబ్బ తీసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి కనీసం విభజన చట్టంలో కూడా చేర్చకుండా మోసం చేసింది. తద్వారా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తప్పించుకునే అవకాశాన్ని కల్పించింది. ఏపీకి తీరని అన్యాయం చేసింది కాబట్టే కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు అధఃపాతాళానికి తొక్కేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు లభించగా నోటాకు 1.28 శాతం ఓట్లు రావడమే అందుకు నిదర్శనం. మన రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఇదీ. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శిథిలమైన కాంగ్రెస్ నుంచి చంద్రబాబు ఆశించే ప్రయోజనం ఒనగూరే అవకాశమే లేదని రాజకీయ పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. హఠాన్మరణం తర్వాత కూడా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన పార్టీకి ఏపీలో ఎవరు నేతృత్వం వహించినా ప్రజలు మద్దతు ఇవ్వరని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. జనం మెచ్చిన సీఎం జగన్ సామాజిక న్యాయ పాలన ప్రభంజనంలో చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు, దుర్మార్గాలు కొట్టుకుపోవడం తథ్యమని తేల్చి చెబుతున్నారు.

పింఛన్లు నాడు - నేడు



నాడు అన్నీ అగచాట్లే

ఏలూరు జిల్లా చింతలపూడిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పింఛన్ కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పడిగాపులు పడుతున్న ఈ దయనీయ దృశ్యం గత ప్రభుత్వ ఏలుబడిలోనిది. అప్పటి పాలకుడు చంద్రబాబుకు మంచి మనసు లేనే లేదనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఆ ఐదేళ్లలో ప్రతి నెలా పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పలుమార్లు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. గంటల తరబడి చాంతాడంత క్యూలో వేచి ఉండాల్సిన దుస్థితి. ఒక్కో రోజు సిగ్నల్ లేదంటూ మరుసటి రోజు రమ్మనే వాళ్లు. డబ్బులు చేతికందే వరకు పండుటాకులకు ఆందోళనే. ఇక కొత్తగా పింఛన్ మంజూరు చేయించుకోవాలంటే, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇంకా దౌర్భాగ్యం ఏమిటంటే.. ఆ ఊళ్లో ఎవరైనా పింఛన్ తీసుకునే లబ్ధిదారుడు చనిపోతేనే కొత్తగా అతని స్థానంలో మరొకరికి పింఛన్ మంజూరు చేసేవారు. దీనికి కూడా లంచాలు, పైరవీలు.. తమ, పర భేదాలు. పింఛన్ మంజూరైనా, దానికి.. దీనికి అంటూ ప్రతి నెలా పింఛన్‌లో కొంత మొత్తం కోత పడేది. రాష్ట్రం అంతటా ఇదే పరిస్థితి.

నాడు

చంద్రబాబు ప్రభుత్వ ఐదేళ్లలో సగటున పింఛన్ మొత్తం ప్రతి నెలా
₹400 కోట్లు

2019 అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు లబ్ధిదారులు
39 లక్షలు

2014-19 మధ్య ఒక్కో లబ్ధిదారుడు ఐదేళ్లలో పొందిన పింఛన్ మొత్తం
₹58,000

అధికారంలోకి వచ్చిన తొలి 4 నెలల్లో రూ.200.. ఆ తర్వాత
₹1,000

నేడు

ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి నెలా పింఛన్ మొత్తం
₹1,968 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు
66.34 లక్షలు

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఒక్కో లబ్ధిదారుడు గత నాలుగున్నర ఏళ్లలో అందుకున్న మొత్తం
₹1,47,500

ప్రస్తుతం పింఛన్
₹3,000



నేడు నేరుగా ఇంటికే..

అదే ఊళ్లో ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ఎక్కడా కూడా కనిపించదు. ప్రతి నెలా సరిగ్గా ఒకటో తేదీనే వలంటీర్ నేరుగా లబ్ధిదారుల ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు చేతిలో పెడుతున్నారు. ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదు. అర్హత ఉండాలే కానీ.. దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సంతృప్త స్థాయిలో పింఛన్లు మంజూరు చేసే విధానం తీసుకొచ్చింది. వివక్ష, లంచాలు, పైరవీలకు తావే లేకుండాపోయింది. వలంటీరే దగ్గరుండి దరఖాస్తు చేయించి, ప్రక్రియ పూర్తి కాగానే మంజూరు పత్రాన్ని ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు. లబ్ధిదారుల మోముల్లో ఆనందం తాండవిస్తోంది. – సాక్షి, అమరావతి/చింతలపూడి

ఫార్మాసిటీని సందర్శించిన పంజాబ్ సీఎం



పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌ను సన్మానిస్తున్న రాంకీ ఎండీ పీపీ లాల్ కృష్ణ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ (పెందుర్తి): జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శుక్రవారం సందర్శించారు. ఆయనకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, రాంకీ ఎండీ పీపీ లాల్‌కృష్ణ స్వాగతం పలికారు. రాంకీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, రాంకీ సంబంధిత అధికారులతో పంజాబ్ సీఎం సమావేశమై ఫార్మా రంగంపై చర్చించారు. ఫార్మా రంగంపై పవర్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనకాపల్లి కలెక్టర్ రవి పటాన్‌శెట్టి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంటల ప్రాతిపదికన వైద్యుల కన్సల్టేషన్‌లు

సాక్షి, అమరావతి: డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో (గతంలో ఏపీవీవీపీ) స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్న చోట్ల గంటల ప్రాతిపదికన సేవలు అందించేలా ప్రైవేట్ వైద్యులను నియమించడానికి వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన ప్రాంతాల్లో గంటకు రూ.2,000, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1500 చొప్పున చెల్లించనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టాలని సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య, సిబ్బంది పోస్టులు ఖాళీగా లేకుండా సీఎం జగన్ ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. దీన్లో భాగంగా 2019 నుంచి ఇప్పటికి 53 వేలకు పైగా పోస్టులను ఒక్క వైద్య శాఖలోనే భర్తీ చేశారు. ఇక సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో ఖాళీలన్నీ భర్తీ చేయడానికి ఇప్పటికే అనేకసార్లు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాగా, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పలు స్పెషాలిటీల్లో వైద్యులు డిమాండ్ చేసినంత వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ఎవ్వరు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం లేకుండా చేసేందుకు గంటల ప్రాతిపదికన వైద్యుల కన్సల్టేషన్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు.

నిర్మలా సీతారామన్‌తో మంత్రి బుగ్గన భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.

కొత్త రైస్ కార్డులకూ రేషన్ పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 1,11,321 రైస్ కార్డులను మంజూరు చేయగా.. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని ఈ నెల నుంచే కొత్త కార్డుదారులకు రేషన్ అందించాలని నిర్ణయించింది. నిజమైన అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఏటా రెండుసార్లు జూన్, డిసెంబర్‌లలో కొత్తగా కార్డులు జారీ చేస్తోంది. ఇందులో భాగంగానే సీఎం వైఎస్ జగన్ శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో లబ్ధిదారులకు కార్డుల పంపిణీని ప్రారంభించారు. తద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థలో కొత్తగా 2,59,687 మంది లబ్ధిదారులకు మేలు చేకూరనుంది. తహశీల్దార్ డిజిటల్ సంతకం పూర్తయిన వెంటనే వికేంద్రీకరణ విధానంలో గ్రామ, వార్డు సచివాలయాల్లోనే కార్డులు ముద్రించి వాటిని వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. కొత్త లబ్ధిదారులు చేతికి కార్డు అందకున్నా.. జాబితాలో పేరు ఉంటే ఆధార్ ఆధారంగా ఎండీయూ వాహనాల వద్ద రేషన్ తీసుకునేలా పౌర సరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏపీ భూ యాజమాన్య హక్కుల చట్టం రద్దు కోసం పోరాడతా: పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఏపీ భూ యాజమాన్య హక్కుల చట్టం(ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) ఒక క్రూరమైన చట్టం (డ్రాకొనియాన్ లా) అని, దీనిని రద్దు చేసేందుకు అవసరమైన కార్యాచరణను తాను సిద్ధం చేస్తానని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పలువురు న్యాయవాదులతో మాట్లాడారు. 'నీతి ఆయోగ్ ఓ మంచి ఆశయంతో భూ హక్కులకు సంబంధించిన యాజమాన్య నిర్ధారణ చేయాల్సిన ముసాయిదాను అన్ని రాష్ట్రాలకీ పంపింది. 2019 డిసెంబర్‌లో దీన్ని చట్టం రూపంలో ఆంధ్రప్రదేశ్ కేంద్రానికి పంపింది. అప్పటి నుంచి ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదముద్ర పడటానికి ఎన్నో సవరణలు, ఇంకెన్నో ప్రయాసలు పడ్డారు. ప్రజలకు తమ సొంత ఆస్తులకే రక్షణ లేని విధంగా చట్టం తయారైందని తెలుస్తోంది' అని అన్నారు.

● తెలంగాణ

రేపే కొమురవెల్లి మల్లన్న కల్యాణం

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. యేటా మార్గశిర మాసం చివరి ఆదివారం నిర్వహించే స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. అలాగే ఫాల్గున మాసం చివరి సోమవారం నిర్వహించే అగ్నిగుండాల ప్రవేశాలతో జాతర ముగుస్తుంది. ఇదిలా ఉండగా ఆలయ నిర్వాహకులు మల్లన్న కల్యాణ ఆహ్వాన పత్రికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో పాటు మరికొందరు మంత్రులకు అందజేశారు.

మూడు నెలల్లో రెండు మార్లు కల్యాణం

ఈ నెల 7వ తేదీన జాతర ప్రారంభమై ఏప్రిల్ 8వ తేదీన అగ్నిగుండాల ప్రవేశంతో ముగియనుంది. కొమురవెల్లి జాతర మూడు నెలల పాటు (12 ఆదివారాలు) కొనసాగుతుంది. స్వామివారి కల్యాణం రెండు పద్ధతుల్లో జరగనుంది. ప్రతి సంవత్సరం మార్గశిర మాసం చివరి ఆదివారం (ఈనెల 7న) వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణోత్సవం నిర్వహిస్తారు. తిరిగి మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని యాదవ సంప్రదాయం ప్రకారం మరో సారి స్వామివారి కల్యాణం (పెద్ద పట్నం) నిర్వహించనున్నారు.

యుద్ధం కన్న అనాథలు

ప్రపంచంలో ఎంతో మంది ఒక పూట తిండి కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మరెంతో మంది కన్న ప్రేమను కోల్పోయి తల్లడిల్లుతున్నారు.
- మదర్ థెరెసా

నాటి ప్రపంచ యుద్ధాల నుంచి నేటి రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం దాకా..

తమవారిని కోల్పోయి భవిష్యత్తు కానరాక తల్లడిల్లుతున్న పిల్లలు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలై దాదాపు రెండేళ్లు. ఇరువైపులా ఎంతో మంది మరణించారు. రష్యా దాడులు తట్టుకోలేక ఉక్రెయిన్ నుంచి లక్షలాది మంది వలసపోయారు. అటు పాలస్తీనాలో ఇజ్రాయెల్ దాడులతోనూ లక్షలాది జీవితాలు అతలాకుతలం అయ్యాయి. అంతా యుద్ధ నష్టం గురించి, ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడుకుంటుంటే.. అభంశుభం ఎరుగని ఎందరో చిన్నారులు యుద్ధం మిగిల్చిన అనాథలుగా భవిష్యత్తు ఏమిటో తెలియని దుస్థితిలో పడిపోయారు. జనవరి 6న (శనివారం) ప్రపంచ యుద్ధ సంక్షుభిత అనాథ పిల్లల దినోత్సవం (వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్) నేపథ్యంలో ఈ అంశంపై ప్రత్యేక కథనం..

నేను ఎందుకిలా అయ్యానో తెలియదు



ఈ చిత్రంలోని అమ్మాయి పేరు మసిక. వయసు పన్నెండేళ్లు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ)లో జరుగుతున్న అంతర్యుద్ధంలో తిరుగుబాటుదారులు ఆమె కళ్ల ముందే తల్లిదండ్రులను కాల్చి చంపేశారు. ఎవరూ దిక్కులేక తన స్నేహితురాలి తల్లితో కలసి జీవిస్తోంది. నాటి ఘటనను తలచుకుని కుమిలిపోతూ.. తినేందుకు తిండి, సరైన రక్షణ లేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. 'అసలు వాళ్లెవరో, ఎందుకోసం ఇలా చేస్తున్నారో, మా అమ్మానాన్నను ఎందుకు చంపేశారో, నేను ఎందుకిలా బతకాల్సి వస్తోందో నాకు తెలియదు..' అంటూ మసిక ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఏనాటి యుద్ధమైనా.. పిల్లలూ సమిధలే..

ఏ పిల్లలకైనా తల్లిదండ్రులే అన్నీ. చదువు కోసమో.. ఉద్యోగం కోసమో దూరంగా ఉంటున్నా.. తల్లడిల్లేది వారి గురించే. అమ్మ ఒడికి, నాన్న చెంతకు చేరితేనే సాంత్వన. అలాంటి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోతే.. కొన్నిసార్లు తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోతే.. ఆ బాధ వర్ణనాతీతం. అలాంటిది అస్తిత్వం కోసమో, అన్నం కోసమో, ఆక్రమణ కోసమో.. మానవ నాగరికత మొదలైన నాటి నుంచీ జరుగుతున్న యుద్ధాల్లో ఎందరో పిల్లలు అనాథలుగా మారుతున్నారు. తమ వారంటూ ఉన్న బంధువుల మధ్య పెరుగుతున్నవారు కొందరు.. ఏతోడూ లేకుండా కునారిల్లిపోతున్నవారు మరికొందరు. సరైనదారిలో పడ్డవారు మంచి జీవితం గడపగలిగితే.. 'దారి తప్పిన'వారి బతుకులు అగమ్యమైపోతున్నాయి.

ప్రపంచ యుద్ధాలతో ముమ్మరమై..

రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అనాథ చిన్నారులను మిగిల్చాయి. అధికారిక అంచనాల ప్రకారమే.. అప్పట్లో పోలాండ్‌లో 3 లక్షలు, యుగోస్లావియాలో 2 లక్షల మంది పిల్లలు అనాథలయ్యారు.

'యూనిసెఫ్ (ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధి)' గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా సంక్షుభిత ప్రాంతాల్లో 25 కోట్ల మందికిపైగా చిన్నారులు కనీస అవసరాలైన ఆహారం, మంచినీరు, నిలువనీడ లేక అవస్థ పడుతున్నారు. ఇందులో సుమారు 14 కోట్ల మంది తండ్రినిగానీ, తల్లిదండ్రులు ఇద్దరినీగానీ కోల్పోయి అనాథలుగా బతుకీడుస్తున్నారు.

అనాథలుగా మారినవారిలో సుమారు 6 కోట్ల మంది ఆసియా దేశాల్లో, 5 కోట్లకుపైగా ఆఫ్రికా, మరో కోటిన్నర మందికిపైగా లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంత దేశాల్లో ఉన్నారు.

యుద్ధాలు, తిరుగుబాట్లతో అట్టుడుకుతున్న మధ్య ప్రాచ్యం, ఆసియా, దక్షిణ అమెరికా దేశాల్లో.. ముఖ్యంగా సిరియా, ఇరాక్, అఫ్గానిస్తాన్ వంటి దేశాల్లో.. ఆఫ్రికా ఖండంలోని సూడాన్, కాంగో, ఉగాండా, సోమాలియా వంటి దేశాల్లో అనాథ పిల్లల సమస్య పెరుగుతోంది. ఇలాంటి చోట్ల చాలా మంది చిన్నారులు తిరుగుబాటు దళాల్లో సైనికులుగా తుపాకులు చేతబట్టాల్సి వస్తోంది.

ఇటీవల ఇజ్రాయెల్‌పై పాలస్తీనాకు చెందిన హమాస్ దాడికి ప్రతిగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడటంతో.. వేల మంది మరణించారు. లక్షలాది మంది వలసపోయారు. ఈ యుద్ధంలో నూ పెద్ద సంఖ్యలో చిన్నారులు అనాథలయ్యారు.

ఫ్రెంచ్ ఆర్గనైజేషన్ చొరవతో.. ప్రత్యేక రోజుగా..

ఫ్రాన్స్‌కు చెందిన 'ఎస్‌ఓఎస్ ఎన్‌ఫాంట్స్ ఎన్ డెట్రెసెస్' స్వచ్ఛంద సంస్థ చొరవతో యూనిసెఫ్ ఏటా జనవరి 6న 'వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్ డే'గా నిర్వహిస్తోంది. యుద్ధాలు, తిరుగుబాట్ల కారణంగా అనాథలుగా మారుతున్న చిన్నారులు.. వారు శారీరకంగా, మానసికంగా తీవ్ర దుస్థితిని ఎదుర్కొంటున్న అంశంపై అవగాహన కల్పించడం, వారిని ఆదుకోవడం లక్ష్యంగా చర్యలు చేపట్టడమే దీని లక్ష్యం. అనాథలను ఆశ్రమాల్లో చేర్పడంతోపాటు చదువుకోవడానికి, సాధారణ జీవితం గడపడానికి తోడ్పడాలని స్వచ్ఛంద సంస్థలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

– సాక్షి సెంట్రల్ డెస్క్

అమ్మానాన్నను కోల్పోయి..



ఈ చిన్నారి పేరు కరీనా. వయసు ఏడేళ్లు. ఉక్రెయిన్‌లోని చెర్నిగివ్ ప్రాంతంలోని ఓ గ్రామం. రష్యా యుద్ధం మొదలుపెట్టాక తమ ఊరిని విడిచిపోతున్న సమయంలో.. జరిగిన బాంబు దాడిలో కరీనా తల్లిదండ్రులు చనిపోయారు. ఇప్పుడు ఉక్రెయిన్‌లోని కీవ్ నగరంలో తమ బంధువుల ఇంట్లో ఉంటోంది. తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటూ, బాంబు దాడిలో అయిన గాయాలతో బాధపడుతూ గడుపుతోంది.

ఉక్రెయిన్‌లో రెండేళ్లుగా పిల్లల గోస

రష్యా-ఉక్రెయిన్ ఒకప్పుడు ఒకే సోవియట్ యూనియన్‌లో భాగం. అందుకే ఇరు దేశాల మధ్య రాకపోకలూ, సంబంధ బాంధవ్యాలూ సాధారణమే. కానీ ఇరు దేశాల మధ్య పొరపొచ్చాలు, యుద్ధంతో ఇరువైపులా ఉండిపోయిన మరోదేశపు కుటుంబాలు అగమ్యమైపోయాయి. మరణించిన, వలస వెళ్లినవారి పిల్లలు, సైనికులు బలవంతంగా తల్లిదండ్రుల నుంచి విడదీసినవారు.. ఇలా ఎందరో చిన్నారులు అనాథలుగా మారారు. ఈ నేపథ్యంలోనే అమెరికాకు చెందిన 'కిడ్‌సేవ్' అనే స్వచ్ఛంద సంస్థ తమ ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేసింది. ఉక్రెయిన్‌కు మిలటరీ సాయమేకాదు.. యుద్ధంతో అనాథలైన చిన్నారులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరింది.

బలవంతపు క్యాంపులకు చిన్నారులు

2022 ఫిబ్రవరి చివరివారం నాటికి ఉక్రెయిన్‌లో అనాథ పిల్లల సంఖ్య లక్ష వరకు ఉండగా.. ఆ తర్వాత ఈ సంఖ్య మరింతగా పెరిగింది. కానీ సంక్షుభిత పరిస్థితుల్లో లెక్కలు తేల్చేదెలాగని, వేల మంది చిన్నారులు క్యాంపుల్లో మగ్గుతున్నారని అమెరికాకు చెందిన కాన్‌ఫ్లిక్ట్ అబ్జర్వేటరీ సంస్థ గతంలోనే పేర్కొంది. మరోవైపు రష్యా తమ దేశంలోని సుమారు 14వేల ఉక్రెయిన్ కుటుంబాల పిల్లలను తల్లిదండ్రుల నుంచి బలవంతంగా విడదీసి క్యాంపులకు తరలించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో సత్తా చాటిన ఏపీ

- జీవీఎంసీ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలకు అవార్డులు
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు



సాక్షి, అమరావతి: స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయ పురస్కారాలు పొంది ఆంధ్రప్రదేశ్ మరోసారి సత్తా చాటిందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద పారిశుద్ధ్య సర్వేలో దేశంలోనే అత్యుత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలు 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకున్నాయన్నారు. పులివెందుల పురపాలక సంఘం రాష్ట్రస్థాయి అవార్డును కైవసం చేసుకుందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ 2021, 2022, 2023 సంవత్సరాలలో వరుసగా ఇండియా క్లీనెస్ట్ సిటీ, క్లీన్ స్టేట్ క్యాపిటల్, జాతీయ అవార్డులను పొందిందన్నారు. గ్రేటర్ విశాఖ 2021 నుంచి 2023 వరకు వరుసగా బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్లీన్ బిగ్ సిటీ, జాతీయ అవార్డు సాధించిందన్నారు. తిరుపతి నగరం బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ (2021), సఫాయి మిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022), జాతీయ అవార్డు (2023) దక్కించుకుందన్నారు. పుంగనూరు పురపాలక సంఘం 2021, 2022 సంవత్సరాలలో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డులను, పులివెందుల 2022 సంవత్సరంలో ఇన్నోవేషన్, బెస్ట్ ప్రాక్టీస్ అవార్డును, 2023లో స్టేట్ అవార్డును దక్కించుకుందని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం, విప్లవాత్మక నిర్ణయాల వల్లే గత మూడేళ్లలో మంచి ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణలో పట్టణాభివృద్ధి శాఖ అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నదని సీఎం వైఎస్ జగన్ సైతం ప్రశంసించారన్నారు. పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సహకారం, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి నిరంతర పర్యవేక్షణ, సమీక్షలు, మార్గదర్శకత్వం అవార్డుల సాధనకు ఎంతగానో ఉపకరించాయన్నారు.

పరబ్రహ్మను తెలుసుకొన్న వ్యక్తి అనుభవంలో సర్వభూతాలూ ఏకైక ఆత్మ (పరమాత్మ) స్వరూపాలుగా వ్యక్తమయ్యే స్థితిలో ఉంటాడు. ఏకమాత్ర పరమాత్మను (ఏకత్వాన్ని) దర్శించే జ్ఞానికి మోహం, శోకం ఎందుకుంటాయి?

– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 6 జనవరి 2024

హసీనాకు అగ్నిపరీక్ష!

మెరిసేదంతా మేలిమి అని ప్రజానీకాన్ని నమ్మిస్తే ఓట్ల వర్షం కురవొచ్చు. ఒకటికి రెండుసార్లు ఆ చిట్కా పనిచేసి అధికారం వచ్చినా రావొచ్చు. కానీ ఎల్లకాలం అదే మంత్రం ఫలించదని బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ నాలుగో దఫా నెగ్గేందుకు పడుతున్న అవస్థలను గమనిస్తే అర్థమవుతుంది. ఆదివారం బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు జరగబోతు న్నాయి. ఆ ఎన్నికలు సవ్యంగా సాగుతాయనీ, ప్రజలంతా తన పక్షమేననీ హసీనా ఇప్పటికీ నమ్మ బలుకుతున్నారు. పోలింగ్ కేంద్రాల ముందు బారులుతీరి ఓటు హక్కు వినియోగించుకోవటం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం బతికేవుందని చాటాలంటూ పౌరులకు ఆమె విన్నపాలు చేస్తున్నారు. అటు విపక్షం హసీనా నయవంచనను బట్టబయలు చేయాలని ప్రజలను కోరింది. ఈ ఎన్నికలను బహిష్కరించి, శని ఆదివారాల్లో దేశవ్యాప్త హర్తాళ్ పాటించాలని పిలుపునిచ్చింది. బంగ్లాలో అటు ఎన్నికల తంతు, ఇటు బహిష్కరణ పిలుపు రెండూ సాధారణ ప్రజలకు విసుగు తెప్పిస్తున్నాయి. 2014 ఎన్నికలను విపక్ష బంగ్లా నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) బహిష్కరించింది. తదనంతర ఎన్నికల్లో పోటీలో దిగి, చివరి నిమిషంలో ఆ పార్టీ ముఖం చాటేసింది. 2014లో 39 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకోగా, 2019 నాటికి అది ఒక్కసారిగా 80 శాతానికి ఎగబాకింది. గత ఎన్నికల్లో అవామీ పార్టీ నేతృత్వంలోని కూటమికి 300 స్థానాల్లో ఏకంగా 96 శాతం స్థానాలు... అంటే 288 రాగా, బీఎన్‌పీ కూటమికి ఏడంటే ఏడే వచ్చాయి. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ అధికార పక్షంపై రిగ్గింగ్ ఆరోపణలు రివాజు. అయితే గత ఎన్నికలకూ, ఇప్పటికీ తేడా కొట్టొచ్చినట్టు కనబడు తోంది. అప్పట్లో హసీనా గెలుపుపై ఎవరికీ సంశయాలు లేవు. మెజారిటీ విషయంలోనే భిన్న స్వరాలు వినిపించాయి. ఈసారి అలాకాదు. ఏం చేసైనా నెగ్గి తీరాలన్న సంకల్పంతో అన్ని రకాల మాయోపాయాలకూ సిద్ధపడుతున్నారని విపక్షంతోపాటు పౌరసమాజ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

యాభై రెండేళ్ల క్రితం హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ నేతృత్వంలో పాకిస్తాన్ పాలకులపై పోరాడి బంగ్లా విముక్తి సాధించింది. ఆ వెంటనే ముజిబుర్ రెహమాన్‌ను కూలదోసి సైన్యం అధికా రాన్ని ఆక్రమించింది. ఆయన్ను దారుణంగా కాల్చిచంపింది. వెంటవెంటనే జరిగిన మార్పుల్లో జన రల్ జియావుర్ రెహమాన్ అధికారం చేజిక్కించుకుని అనంతర కాలంలో దేశాధ్యక్షుడయ్యారు. బీఎన్‌పీ ఆయన నేతృత్వంలోని పార్టీయే. మరో సైనిక పాలకుడు హెచ్‌ఎం ఎర్షాద్ సైతం జాతీయ పార్టీని ఏర్పాటుచేశారు. మొత్తానికి మూడు సైనిక తిరుగుబాట్లు, దాదాపు 20 వరకూ విఫల తిరుగు బాట్లతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సైనిక పాలకులు ఎన్నికలు లేకుండా చేసి, పౌరుల ఓటుహక్కుకు ఎగనామం పెడితే... ప్రజాస్వామ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన పార్టీలు దొంగ ఓట్లతో, హింసతో దాన్ని మరింత నీరుగార్చాయి. తనకు మెజారిటీ ప్రజల మద్దతున్నదని చెప్పే హసీనా తొలి, మలి దఫాలకు మించి మూడోసారి పూర్తి స్థాయి నియంతగా మారారని, అసమ్మతి స్వరాలను అణిచేశారని ఆమె వ్యతిరేకులు ఆరోపిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ కేసుల్లో ఇరుక్కుని 22,000 మంది విపక్ష నేతలు, కార్యకర్తలు జైళ్లలో మగ్గుతున్నారు. అధిక ధరలు తగ్గిం చాలని, ఉపాధి కల్పించాలని ఉద్యమించినవారిని హసీనా సర్కారు శత్రువులుగా చూస్తోంది.

హసీనా తొలిసారి అధికారంలోకొచ్చిన రోజులతో పోలిస్తే ఇప్పుడు కరెంటు కోతలు లేవు. దేశం పచ్చగా కనబడుతోంది. అడిగిందే తడవుగా విదేశీ మదుపుదారులు ఉదారంగా అప్పులిచ్చారు. ఆర్థిక రంగం పుంజుకోవటంతో నగరాలు మెరిసిపోతున్నాయి. ఆకాశాన్నంటే భవంతులు, ఎక్స్‌ప్రెస్ వేలు, వంతెనలు, భారీ దుకాణ సముదాయాలు, దిగుమతి చేసుకున్న వినియోగ వస్తువులు విస్మయ పరుస్తున్నాయి. కానీ ఇప్పుడిప్పుడే ఇదంతా తిరబడుతున్న దాఖలాలు కనబడుతున్నాయి. అందాల పరదాల మాటున పాతరేసినవన్నీ పైపైకి తోసుకొచ్చి నిలదీస్తున్నాయి. బ్యాంకులు వేల కోట్లలో ఇచ్చిన అప్పులన్నీ పారు బాకీలుగా మారి బావురుమన్నాయి. ఖజానాలో కరెన్సీ మాయమై, ద్రవ్యో ల్బణం ఆకాశాన్నంటి దేశ ఆర్థిక వ్యవస్థ బిత్తరచూపులు చూసింది. విదేశీ పెట్టుబడులతో మొదలు పెట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం సరైన పర్యవేక్షణ కొరవడి నత్తనడకన సాగింది. వ్యయం అనేక రెట్లు పెరిగింది. పల్లెటూళ్లు తెల్లముఖం వేశాయి. ఉపాధి కరువై గ్రామీణులు నగరా లకు, పట్టణాలకు వలసలు కట్టారు. కరెంట్ అకౌంట్ సంక్షోభం పీల్చి పిప్పి చేస్తుండగా ఒకనాడు పైపై మెరుగులు చూసి ఎగబడి పొగిడిన అంతర్జాతీయ మీడియా వరస కుంభకోణాల వైనాన్ని వెల్లడిస్తున్నకొద్దీ దేశంలో అశాంతి ప్రబలింది. ఉద్యమాలు వెల్లువెత్తాయి. వాటి అణచివేత తప్ప హసీనా దగ్గర మరే ప్రత్యామ్నాయం లేకపోవటం విషాదాల్లోకెల్లా విషాదం.

దేశాన్ని దక్షిణాసియాలోనే 'ఎకనామిక్ టైగర్'గా రూపొందించానని ఒకనాడు సగర్వంగా చాటు కున్న హసీనా సంక్షోభంపై సరైన సంజాయిషీ ఇవ్వలేకపోతున్నారు. మానవ హక్కుల ఉల్లంఘన లపై ఇంటా బయటా ఆరోపణలు పెరుగుతున్నాయి. ఈ ఉల్లంఘనల బాధ్యులకు తమ దేశంలో ప్రవేశం ఉండబోదని అమెరికా ప్రకటించింది. వైఫల్యాలకు పాలక విపక్షాలు రెండూ బాధ్యత వహిం చాలని ప్రజలు భావిస్తున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. అయితే ఇతర నేతలతో పోలిస్తే హసీనాయే ఉన్నంతలో మెరుగని మెజారిటీ పౌరులు విశ్వసిస్తుండటం విశేషం. ఏకపక్షంగా సాగే తాజా ఎన్నికల తంతులో విజయం మాటెలావున్నా హసీనాకు మున్ముందు గడ్డు పరిస్థితులు తప్పవు. ఆమె విఫల నేతగా మిగులుతారా, తప్పులు దిద్దుకుని దేశాన్ని గట్టెక్కిస్తారా అన్నది చూడాల్సివుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.దశమి రా.8.54 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** స్వాతి సా.6.22 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.12.14 నుండి 1.54 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.31 నుండి 8.04 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.56 నుండి 10.34 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అమెరికాలో తగ్గని ట్రంప్ హవా?

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్ ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడంపై చాలామందికి సందేహాలు ఉండవచ్చు. కానీ, ఆయనకు దేశంలో మద్దతుదారులు పెరుగుతున్నారనే చెప్పాలి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ట్రంప్‌కు రెండు రకాల ఇమేజ్‌లు ఉండటం. ఒకవైపేమో చట్టాలను కఠినంగా అమలు చేసే వ్యక్తిగా, సుస్థిర ఆర్థిక వ్యవస్థను అందించగలిగేవాడిగా, యుద్ధాలకు దూరంగా ఉండేవాడిగా చూస్తూంటే... ఇంకోవైపేమో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపేవాడిగా, వ్యవస్థలపై దాడి చేసేవాడిగా, దేశ ప్రాథమ్యాలను మార్చేసే వ్యక్తిగా చూస్తున్నారు. ఏమైనా ట్రంప్‌కు ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ మాత్రం సర్వేలను నమ్మొద్దనీ, తానే మళ్లీ అధికారంలోకి రానున్నాననీ ధీమాగా చెబుతున్నారు.

అమెరికాలోని ఈశాన్య కారిడార్‌లో ఇటీవల జరిగిన పలు సంభాషణలు డోనాల్డ్ ట్రంప్‌కు ఆదరణ పెరిగిన విషయాన్ని నిరూపిస్తాయి. కేంబ్రిడ్జ్‌లోని మసాచూ సెట్స్‌లో తొలితరం అమెరికన్, హైతీ సంతతి మహిళ తన రోజువారీ కష్టాలను వెళ్లగక్కుతోంది. రెండ్రెండు ఉద్యోగాలు చేస్తున్నా తన ముగ్గురు పిల్లలతో జీవనం దుర్భరమవుతోందని ఆమె వాపోయింది. అంతేకాదు... ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలకు అమెరికా మద్దతుగా నిలవడాన్ని కూడా ప్రశ్నిస్తోంది. డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నా మంటూ ఆక్షేపిస్తోంది. అదే సమయంలో దేశంలో అక్రమ చొరబాటు దారులు పెరిగిపోతూండటం కూడా ఆమెకు రుచించడం లేదు. చట్ట బద్ధంగా దేశంలోకి వస్తున్న వాళ్లు పౌరసత్వం పొందేందుకు ఏళ్ల తరబడి తంటాలు పడుతూంటే, అక్రమ వలసదారులు మాత్రం ఎంచక్కా మంచి జీవితాన్ని అనుభవిస్తున్నారన్నది ఆమె ఆరోపణ. ఈ ఆర్థిక, వలసల సమస్యలకు బాధ్యుడు జో బైడెన్ అని ఆమె నిశ్చితా భిప్రాయం. అందుకే తాను ఈసారి ట్రంప్‌కు ఓటేస్తానని చెబుతోంది. ట్రంప్‌పై క్రిమినల్ కేసులున్న విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదు. వ్యవస్థ తమలాంటి ప్రజల మాదిరే ట్రంప్‌ను కూడా హింసిస్తోం దని అంటోంది.

న్యూయార్క్‌లోని ఓ యువ ఉబర్ డ్రైవర్ ఏమంటున్నాడో చూడండి. డొమినికన్ రిపబ్లిక్ నుంచి వలస వచ్చిన ఈ యువకుడు 2016లో ట్రంప్‌కు ఓటేయవద్దని తన మిత్రులందరికీ చెప్పాడు. ఇప్పుడు మాత్రం తన ఆలోచనలు మారిపోయాయని అంటున్నాడు. బైడెన్‌ఏలుబడిలో నేరాలు పెరిగిపోయాయని అతడి ఆరోపణ (నిజా నికి తగ్గాయి). అమెరికా యుద్ధాల్లో చిక్కుకుపోవడం కూడా ఇతడికి ఇష్టం లేదు. బైడెన్ వృద్ధుడు అయ్యాడని ఈ యువకుడి నమ్మకం (బైడెన్‌కు 81 ఏళ్లు. ట్రంప్‌కు 77). జనవరి 6 (2021) ఘటన (క్యాపి టల్‌పై ట్రంప్ అనుచరుల దాడి) మీద భిన్నాభిప్రాయాలు ఉన్నప్ప టికీ, వలసదారుల సమస్య అతడిని పీడిస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకూ న్యూయార్క్ నగరం దాదాపు 16,000 కాందిశీకుల నివాసానికి అనుమతులు జారీ చేసింది. ఇప్పటికే పనిభారంతో ఉన్న నగర పరి పాలన వ్యవస్థ మరో 68,000 మంది బాగోగులు చూసుకుంటోంది. ఈ చర్యలు కాస్తా అక్రమ వలసల విషయంలో ప్రజల్లోని వ్యతిరేక భావనలను మరింత పెంచుతున్నాయి. ఈ వ్యతిరేకత అటు డెమొక్రా ట్లతోపాటు ఇటు రిపబ్లికన్లలోనూ కొనసాగుతూండటం గమనార్హం.

వాషింగ్టన్ డీసీలో ఉంటున్న సియెర్రా లియోన్ జాతీయుడి ఆలో చనలు ఎలా ఉన్నాయో చూడండి. 2008లో వలస వచ్చిన ఈ వ్యక్తి ఇప్పుడు అమెరికన్ పౌరుడు. ట్రంప్‌కు ఓటేసేందుకు ఎదురు చూస్తు న్నాడు. ఉక్రెయిన్, ఇజ్రాయెల్‌లకు అమెరికా ఎందుకు మద్దతిస్తోందో ఇతడికి అర్థం కావడం లేదు. బైడెన్ చాలా యుద్ధాలు చేస్తున్నాడం టాడు. ట్రంప్ అధికారంలోకి వస్తే ఇజ్రాయెల్‌కు మద్దతు మరింత



పెరుగుతుందన్న వాదనను తిప్పికొడుతున్నాడు. బైడెన్ ఏలుబడిలో రోజువారి వెచ్చాల ధరలు, అద్దెలు పెరిగిపోయాయనీ, ఆఫ్రికా దేశపు వ్యక్తిగా, ముస్లింగా జాతి వివక్ష విషయంలో డెమొక్రాట్లు, రిపబ్లికన్లలో తేడా ఏమీ లేదంటాడు.

రిపబ్లికన్ల వైపు అనూహ్య మొగ్గు

ఎక్కడైనా సరే, రాజకీయ వాతావరణం ఎలా ఉందో తెలుసు కోవాలంటే ఆయా పార్టీల మూలభూతమైన మద్దతుదారులు నమ్మ కంగా ఉన్నారా, లేదా? అన్నది ఒక ప్రామాణికమవుతుంది. తన ప్రాబ ల్యాన్ని విస్తరించుకోవడం ఇంకో కొలమానం. ఇప్పటివరకూ చెప్పు కున్న సంభాషణలన్నింటినీ ఒకసారి పరిశీలిస్తే ట్రంప్‌కు ప్రాథమిక స్థాయిలో ఉన్న ఆదరణ తగ్గలేదు సరికదా... ఎంతో కొంత పెరిగిందని స్పష్టమవుతుంది. హైతి, డొమినికన్ రిపబ్లిక్, సియెర్రా లియోన్‌లకు చెందిన అమెరికన్ పౌరులు ట్రంప్ మద్దతుదారులుగా మారతారని ఎవరూ ఊహించరు. అయితే సర్వేలు, ఇతర అంశాలను పరిశీలిస్తే స్పానిష్, నల్లజాతీయుల్లో ఒక వర్గం కూడా నెమ్మదిగానైనా డెమొక్రాట్ల నుంచి రిపబ్లికన్ల వైపునకు మొగ్గుతున్నట్లు తెలుస్తుంది.

జాతి ఆధారిత సమూహాలను కాసేపు పక్కనబెడితే... మిగిలిన వర్గాల్లో మాత్రం ట్రంప్ మాటలు బలమైన ముద్రే వేశాయని చెప్పాలి. కొంత తప్పుడు సమాచారం, ఎన్నికల సంవత్సరంలో జోబైడెన్ ప్రభుత్వ పోకడలపై నెలకొన్న అసంతృప్తి వీటికి ఆజ్యం పోస్తున్నాయి. వేర్వేరు వర్గాలు ట్రంప్ నుంచి వేర్వేరు రకాల సందేశాలు అందుకుం టున్నాయి. ఒక్కటైతే వాస్తవం. ట్రంప్ ఆదరణ పైపైకి పోతోంది. కాక పోతే ఇందుకు భిన్నమైన పార్శ్వాలు ఉన్నాయి.

బాగున్న బైడెన్ రికార్డ్

మొదటిది... ప్రస్తుతమున్న ప్రజల మూడ్ ఈ క్షణానికి సంబం ధించింది మాత్రమే. ప్రచారం చేసేవారికి ఫీడ్‌బ్యాక్ లూప్‌గా ఉపయో గపడుతుంది కానీ విలువ తక్కువ. 2024 నవంబరులో ఏమవు తుందో ఎవరికీ తెలియదు. ట్రంప్ మళ్లీ ఈ స్థాయిలో పుంజుకుంటా డని గత ఏడాది ఎవరు ఊహించారు?

రెండు... ట్రంప్ ఎదుర్కొంటున్న కేసులు పెద్ద సవాళ్లే విసర నున్నాయి. కొలరాడో, మైన్‌లలో నమోదైన కేసుల్లో ఓటుపై నిషేధం పడటం ట్రంప్‌కు లాభిస్తోంది. బాధితుడిగా ప్రచారం చేసుకుంటు న్నారు. సుప్రీంకోర్టు ఈ తీర్పులను రద్దు చేయవచ్చు. కానీ ఓ పార్టీ తరఫున అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న వ్యక్తి నాలుగు క్రిమినల్ శిక్షలు ఎదుర్కొంటున్నాడన్నా, పోలింగ్ రోజుకు ముందు మరిన్ని కేసులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నా దాని ప్రభావం ఓటింగ్‌పై కచ్చితంగా ఉంటుంది.

మూడు... బైడెన్ స్థానిక ఎన్నికల ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అయినప్పటికీ 1973లో తొలిసారి సెనేటర్‌గా ఎన్నికై అంచ లంచెలుగా ఎదిగిన బైడెన్ ఇలాంటి స్థితి నుంచి బయటపడటం చాలా సార్లు చూశాము. పాలన విషయంలో ఆయనపై ఎలాంటి మచ్చ లేకపోవడం, కోవిడ్ నుంచి సమర్థంగా బయటపడటం, ద్రవ్యో ల్బణం, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి వంటి అంశాల్లో చక్కటి సమ తౌల్యం కనిపిస్తూండటం బైడెన్‌కు కలిసివచ్చే అంశాలు. ఈ చర్య లన్నింటి ఫలితం కూడా వడ్డీరేట్లు, ధరలు తగ్గడంలో ప్రతిఫలిస్తోంది. అదే సమయంలో మార్కెట్ కూడా పుంజుకుంటూండటం గమనార్హం. మౌలిక సదుపాయాలు, వాతావరణం, తయారీ రంగాలకు సంబం ధించి బైడెన్ ఇప్పటికే విప్లవాత్మకమైన కొన్ని చట్టాలను ఆమోదింప జేసుకున్నారు.

బైడెన్‌కు ఇంకో రెండు సానుకూల అంశాలున్నాయి. అబార్షన్‌పై వచ్చిన తీర్పు విషయంలో రిపబ్లికన్లపై బోలెడంత వ్యతిరేకత ఉంది. ట్రంప్ ఒంటెత్తు పోకడలపై కూడా ప్రజల్లో అభ్యంతరాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ యుద్ధం కొంతమంది వామపక్ష, ముస్లింల ఉత్సాహాన్ని దెబ్బకొట్టినప్పటికీ, యూదుల మద్దతు బైడెన్‌కు లభించేలా చేసింది. అందుకేనేమో బైడెన్ చైనా అధ్యక్షుడికి సైతం సర్వేలను నమ్మొద్దనీ, తానే మళ్లీ అధికారంలోకి రానున్నాననీ ధీమాగా చెప్పారు.

చివరగా... అమెరికాలోని రెండు పార్టీలకూ దాదాపుగా సమ స్థాయిలో మద్దతు ఉంది. అందుకే అమెరికాను 47 శాతం– 47 శాతం దేశమంటారు. రాష్ట్రాలకు రాష్ట్రాలు అటు ఇటో మొగ్గి ఉంటాయి. అన్ని అధ్యక్ష ఎన్నికల ఫలితాలు అటు ఇటూ మారిపోయే ఆరు లేదా ఏడు స్వింగ్ స్టేట్స్‌పై ఆధారపడి ఉంటాయి. అరిజోనా, నెవడా, మిషిగన్ , విస్కాన్సిన్ , జార్జియా, పెన్సెల్వేనియాల్లోని కొన్ని వేల మంది ఓటర్లు ఎటు మొగ్గు చూపుతారన్న అంశంపై అధ్యక్షుడి ఎన్నిక ఆధారపడి ఉంటుంది. కాకపోతే ప్రస్తుతానికి మాత్రం పరిస్థితి డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా ఉందని చెప్పకతప్పదు.

వ్యాసకర్త వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

చివరకు మిగిలేది



ఎవరూ నీ వాస్తవ స్నేహితులు కారు. నువ్వు ఈ ప్రపంచంలోకి ఒంటరిగా వస్తావు. ఒంటరిగా పోతావు. ఈ ప్రయాణంలో కొన్ని అనుభవాలు ఉంటాయి. కానీ, ఉండి పోయేదల్లా నీ ఆత్మతో నీ సంధానం.

– కామ్యా బుచ్, డిజిటల్ నోమడ్

రెండూ కావాలంటే...



చాలామంది ఐఏఎస్ అధికారులు అవినీతిపరులు. నిజాయితీగా ఉన్నవారిలో నేమో చాలామందికి అత్యంత పొగరు. అవినీతికి పాల్పడకపోతే ఇక వారికి దేవుడి హోదా వస్తుందని అనుకుంటారు. నేను వందలాది మంది 'బాబు'లను కలిసివుంటాను. బహుశా ఇద్దరు మాత్రమే నీతిపరులు, నిరాడంబరులు.

– రామ్‌ప్రసాద్ సి., ఆంట్రప్రెన్యూర్

ఆలయమే ఆధారం



అయోధ్యలోని రామాలయం ఇంకా నిర్మాణంలోనే ఉంది. పూర్తికావడానికి ఇంకో 2–3 ఏళ్లు పట్టేట్టుంది. జనవరి 22న 'ప్రాణ ప్రతిష్ఠ' చేయడం రాజకీయోద్యమం తప్ప మరొకటి కాదు. నిజంగా రాముడితో, మతంతో ఏ నిమిత్తమూ లేదు. ఉండివుంటే నిర్మాణం పూర్తయ్యేదాకా ప్రస్తుత ప్రభుత్వం ఆగివుండేది. కానీ తమ రిపోర్ట్ కార్డులో చూపించుకోవడానికి ఏమీలేదని బీజేపీకి తెలుసు.

– రోహిత్ రోహన్, వ్యాఖ్యాత

గొంతు పెగలదా?



తమ దేవుడి జన్మస్థలం మీద బలవంతంగా నిర్మించారని ఇండియాలో లక్షలాది మంది నమ్మడం వల్ల బాబ్రీ మసీదు నేలమట్టమైంది. కానీ చైనాలో ఎన్నో మసీదులను కూలగొడుతున్నారు. ఎందుకంటే చైనా ఇస్లాంను సహించదు. అయినా ఎవరూ మాట్లాడరు. ముస్లిం బ్రదర్‌హుడ్ ఎక్కడ?

– యానా మీర్, జర్నలిస్ట్

క్లినిక్ హ్యూమర్



పేషెంట్ భార్య అతడి గురకను రికార్డ్ చేసింది. అది ఎంత బిగ్గరగా ఉందో అతడు అంగీకరించడం లేదు. పేషెంట్: డాక్టర్, ఒకప్పుడు ఈమె నా ఛాతీ మీద పడుకొని, నా గుండె కొట్టుకునే శబ్దాన్ని వినేది. పేషెంట్ భార్య: ఒకప్పుడు నువ్వు 70 కిలోలు ఉండేవాడివి, ఇప్పుడు 130 అయ్యావు. నీ గుండె శబ్దమే వినబడటం లేదు.

– జోయితా, ఫిజీషియన్

ద్వీపాలను బతకనివ్వండి!



మాల్దీవుల విస్తీర్ణం 298 చదరపు కిలోమీటర్లు. లక్షద్వీప్‌ది కేవలం 32 చ.కి.మీ. లక్షద్వీప్ లోని పగడపు దిబ్బలు ఇప్పటికే వెలిసిపోతున్నాయి లేదా చనిపోతున్నాయి. కాబట్టి దయచేసి వాటిని తర్వాతి మాల్దీవుల పేరుతో ప్రచారం చేసేముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించండి. కొన్ని ప్రదేశాలను వాటి మానాన వాటిని వదలడమే మంచిది. అంతగా కావాలంటే, 6,000 చ.కి.మీ. ఉన్న అండమాన్ దీవులను దృష్టిలో ఉంచుకోవచ్చు.

– లవ్‌లీనా అరుణ్, ట్రావెలర్

ఏమైనా అంటారు!



పెళ్లికి, పార్లమెంటుకు, ప్రధాని లేదా రాష్ట్రపతితో సమావేశానికి మీకు నచ్చిన బట్టలు ధరించ వచ్చు, మీ పిల్లలకు మీకు నచ్చిన పేరు పెట్టు కోవచ్చు, అది పూర్తిగా ఇతరులకు అన్యా క్రాంతం చేయలేని మీ హక్కు. కానీ వాటినే మీరు పబ్లిక్‌లో పెడితే, జనానికి కూడా వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

తొలి ముస్లిం మహిళా విద్యావేత్త

ఆధునిక భారత మొదటి ముస్లిం మహిళా విద్యావేత్త ఫాతిమా షేక్. సావిత్రీబాయి పూలేతో కలిసి అణగారిన వర్గాల మహిళలు, పిల్లలకు అక్షరజ్ఞానం ప్రసాదించిన విద్యాదాత. ఆధునిక భారత విద్యారంగానికి మార్గదర్శకురాలు. మనువాద, అగ్రవర్ణ సంప్రదాయవాదులు సంప్రదాయం పేరుతో శూద్రులకు విద్యను నిరాకరించినప్పుడు, దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాల మహిళలు, పిల్లల విద్యాహక్కు కోసం గళమెత్తిన ధీరవనిత. సావిత్రీబాయి, జ్యోతిరావు పూలేలతో కలిసి విద్యాభివృద్ధికి పాటుపడిన త్యాగమయి. జ్యోతిరావ్ పూలే నేతృత్వంలోని 'సత్యశోధక్' (సత్యాన్వేషణ) ఉద్యమంలో అగ్ర భాగస్వామి.

1848లో దళిత పిల్లలు, మహిళల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడానికి ప్రయత్నించి నప్పుడు, 'మత వ్యతిరేక చర్య'గా పేర్కొంటూ జ్యోతిరావు, సావిత్రీబాయి పూలేలను కుటుంబ సభ్యులూ, గ్రామస్థులూ ఇంటినుండేగాక, గ్రామం నుండి కూడా బహి ష్కరించినప్పుడు, ఫాతిమా షేక్, ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ వారికి సహాయం చేసి ఆదుకున్నారు. పూలే దంపతులు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే ఉంటూ, అదే ఇంట్లో పాఠశాల నడిపే వారు. పూలే ఆలోచనల నుండి ప్రేరణ పొందిన ఉస్మాన్ తన సోదరిని సావిత్రీబాయితోపాటు, ఉపాధ్యాయురాలిగా శిక్షణ ఇప్పించాడు. సావిత్రీబాయితో పాటు, ఫాతిమా కూడా నాటి అగ్రవర్ణ, ఆధిపత్య వర్గాల నుండి సామాజికపరంగా అనేక అవమా నాలను, కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. 'ఫాతిమా నాకు ఎంతగానో సహకరించింది. ఆమె సహకారంతోనే నేను ఇన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అని రాశారు సావిత్రి. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుసేన్, అబ్దుల్ కలామ్‌లతోపాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్నీ తమ రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో పొందుపరిచింది. 2021లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కూడా ఎనిమిదవ తరగతి పాఠ్య పుస్తకంలో ఫాతిమా షేక్‌పై పాఠాన్ని ప్రవేశపెట్టి ఆమె సేవలకు తగిన గుర్తింపును కలిగించింది.



ఫాతిమా షేక్

– మదీహా అర్జుమంద్ I 93476 05557

కొత్త ఆలోచన కార్యరూపం దాల్చాలి!

అభిప్రాయం



ఆచార్య అయ్యగారి సీతారత్నం

సమాజంలో మేధావులు కొత్త ఆలోచన చేస్తూనే ఉంటారు. ఆ ఆలోచనల వల్లనే మానవ సమాజం అభివృద్ధి చెందుతుంది. అయితే ఏ కొత్త ఆలోచనైనా కరుడుగట్టిన ఆలోచనలతో ఉన్న సమాజంలోని కొందరు తిరస్కరిస్తారు, వ్యతిరేకిస్తారు. భూమి గుండ్రంగా ఉందని చెప్పినందుకు కోపర్నికస్‌ని ఉరి తీసిన ప్రపంచం ఇది! నాయకులు, మేధావులు ఎంతో శ్రమకు వోర్చి నూతన ఆలోచనను ఆచరణలో పెడితే అనంతర కాలంలో సంస్కృతిలో భాగమై అందరూ అనుస రిస్తారు.

అలాగే ప్రస్తుతం విశిష్ట నాయకుడైన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 'మూడు రాజ ధాను'లనే నూతన ఆలోచన తీసుకువ చ్చింది. దీనివల్ల ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి. అంబేడ్కర్ లాంటి మహామేధావి రాజ్యాంగంలోని 14, 15 ఆర్టికల్స్ ప్రకారం కుల, మత, లింగ, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ సమా నత్వం ప్రతిపాదిం చారు. ఈ ఆర్టికల్స్ బట్టే దళితులకు, స్త్రీలకు, థర్డ్ జెండర్‌కు ప్రత్యేక చట్టాలు, రిజర్వేషన్లు కల్పించారు. దీన్నిబట్టి రాజ్యాంగ నైతికతను అనుసరించి ప్రాంతీయ అసమా నత్వాలను పోగొట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. అం దుకే జగన్ ప్రాంతీయ అసమానత్వాలను పోగొట్టడానికి మూడు రాజ ధానుల ప్రతిపాదన చేశారు. అమరావతి, విశాఖ, కర్నూలులను వరుసగా శాసన, పరిపాలక (ఎగ్జిక్యూటివ్), న్యాయ రాజధానులుగా చేయాలనే ఆయన ఆలోచనను ఆచరణలోకి రాకుండా కోర్టులకు వెళ్లి కూడా అడ్డుకుంటున్న విషయం మనకు తెలుసు. నిజానికి కోర్టులు అది ఎంత మంచి ఆలోచన అయినా తమంతట తాము వాటిని ఆహ్వానించ లేవు. ఆ ఆలోచన అంతకు ముందు చేసిన చట్ట పరిధిలో ఉన్నదా లేదా అన్నదే వాటికి కావాలి. అంటే కొత్త ఆలోచనను చట్ట రూపంలోకి తీసుకు రావడమో లేదా ఉన్న చట్టాల్లో మార్పుచేస్తేనో తప్ప కోర్టులు అంగీకరిం చవన్నమాట. అయితే చట్టాన్ని మార్చే శక్తి, చేసే అధికారం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందనేది ఎవరూ కాదనలేరు.

మూడు రాజధానులు అనగానే కొంతమంది 'ఎక్కడైనా ఉందా, ఏమిటీ పద్ధతి' అని వేళాకోళం చేయనారంభించారు. దీనికి కారణం ప్రాంతీయాధిపత్యం నిలుపుకోవాలని అనుకోవడమే. ప్రాంతీయ, సాంస్కృతిక ఆధిపత్యాలను రావిశాస్త్రి లాంటి సాహితీవేత్తలు ఎప్పుడో గుర్తించి తమ రచనల ద్వారా ఎత్తి చూపారు. ప్రాంతీయ అసమానతల్ని పోగొట్టడానికి మూడు రాజధానుల ఆలోచన అమలు పరచడం అత్యంత అవసరం.




కొంతమంది చాలా తెలివిగా మూడు రాజధానులను ఉత్తరాంధ్ర ప్రజలే అక్కర్లేదం టున్నారని వీరి తరఫున వారే వకాల్తా పుచ్చు కొని ప్రచారం చేయడం కూడా ఆధిపత్య ధోరణే. రాజకీయ పార్టీలు ఉత్తరాంధ్ర, రాయలసీమల వెనుకబాటుతనాన్ని గుర్తించి మూడు రాజధానులతో పాటు ఈ రెండు ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు తమ తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాలి.

ఒకప్పుడు కొన్ని ప్రభుత్వాలు మేని ఫెస్టోలోని అంశాలను అమలు పరిచే విషయం కోర్టు పరిధిలో లేదు కాబట్టి వాటిని అమలు చేయాలని అనుకునేవి కావు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వారికి నచ్చిన విధంగా వారు పాలించేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మేనిఫెస్టోని ప్రజలకు గుర్తు చేస్తూ ప్రతి అంశాన్నీ అమలు చేసే ఒక మంచి సంప్రదాయాన్ని తీసుకు వచ్చింది. ఇకమీదట ఏ రాజకీయ పార్టీ అయినా మేనిఫెస్టోలోని అంశాలు అమలు చేయవలసిం దే. ప్రజలకు రాజకీయ పార్టీలు అమలు చేస్తున్న అంశాలు గుర్తించే స్థాయి వచ్చింది.

వ్యాసకర్త ఆంధ్రా యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్
మొబైల్: 98851 44879

ఇక్కడ ఏదీ సొంతం కాదు!



తోటిమనిషికి ద్రోహం చేయకుండా ఉండడం, ఎల్లప్పుడూ నిజమునే మాట్లా డడం, సమస్త ప్రాణులకూ వాటి భాగాన్ని వాటికి పంచి ఇవ్వడం, అందరి యందు దయాభావం కలిగిఉండడం, మనస్సును, మిగతా ఇంద్రియాలను చాపల్యానికి లోనుకాకుండా చూసుకోవడం, యుక్త వయసులో పెళ్ళి చేసుకుని గృహస్థుడై సంతానాన్ని పొందడం, మనసు మృదుభావంతో నిండివుండేలా చూసుకోవడం, లజ్జితుడుగా ఉండడం, చంచలత్వానికి లోనుకాకుండా ఉండడం వంటి మంచి గుణాలను తనవిగా చేసుకోవడం అన్నది ధర్మా లలోకెల్ల శ్రేష్ఠమైన ధర్మంగా స్వాయంభువ మనువు కాలం నాటికే చెప్పబడింది. ఏ వ్యక్తి తాను ఇతరుల నుండి భయాన్ని పొందడో, తన నుండి ఇతరులకు భయాన్ని కలుగజేయడో, ఆ వ్యక్తి రాగద్వేషాలను జయించినవాడౌ తాడు. అందులోనే అతడికి ఆత్మస్వరూప సాక్షాత్కారం సిద్ధిస్తుంది. పూర్వ కాలంలో మిథిలను పాలించిన జనక మహారాజు మోక్ష స్వరూపాన్ని, పరమాత్మ తత్వాన్ని గురించిన పూర్తి జ్ఞానాన్ని సాక్షాత్కరించు కున్నవాడుగా చెబుతారు. ఆ మహారాజుకు సంబంధించినదిగా ప్రసిద్ధమైన ఒక గాథ ఈ విధంగా చెబుతుంది:

అనన్తం బత మే విత్తం యస్య మే నాస్తి కిఞ్చన,
మిథిలాయాం ప్రదీప్తాయాం న మే దహ్యతి కిఞ్చన.

(వ్యాసుని మహాభారతం, శాంతిపర్వం, 17వ అధ్యాయం, 19వ శ్లోకం)

'చూసేవాళ్ళకు నా వద్ద రాసులకొలదిగా సంపద ఉన్నట్లుగా కనబడు తుంది. అయితే అందులో ఏ ఒక్కటి కూడా నాకు చెందినదిగా నేను భావిం చను. అందుచేతనే అగ్నికి ఆహుతై మిథిలా నగరం మొత్తం దహనమైనప్ప టికీ, అందులో నాదంటూ ఏదీ కాలి బూడిద కాదు!' అని పై గాథ భావం. సొంత భావన, విషయ లాలస అనేవి లేని మనసు చేసే ఆలోచన ఏ విధంగా ఉంటుందో ఈ గాథ స్పష్టం చేస్తుంది.

ఈ సమస్త భూమండలాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలే మహాసామ్రాట్టుకు కూడా, ఆహారంగా తీసుకున్నది అరిగించుకోవడానికి ఉండేది ఒక్క ఉద రమే! వాస్తవం అదైనప్పుడు, రాజ్యాధికారము, రాజభోగము గురించి గొప్పగా చెప్పుకోవడంలో అర్థం ఏముంటుంది?– అన్నది ఎప్పటినుంచో విజ్ఞులు చెబుతున్న ఆలోచించవలసిన మాట!

– భట్టు వెంకట రావు

క్లుప్తంగా...

ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం కేసు ఫిబ్రవరికి వాయిదా


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యస్వామి

తిరుపతి లీగల్: ఆంధ్రజ్యోతి పత్రికపై టీటీడీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా కేసును ఫిబ్రవరి 5కి వాయిదా వేసినట్లు మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు. శుక్రవారం ఈ కేసుపై విచారణ ఉండడంతో ఆయన తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు హాజరయ్యారు. కోర్టు సముదాయపు ప్రధాన ద్వారం వద్ద మీడియాతో మాట్లాడారు. టీటీడీ తరఫున సుబ్రహ్మణ్యస్వామి వాదించడానికి అర్హుడు కాదని, అతడికి టీటీడీ తరఫున వాదించడానికి ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రజ్యోతి ఎడిటర్ తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పిటిషన్ వేయగా..దాన్ని 2022 ఆగస్టులో కోర్టు కొట్టివేసింది. దీనిపై ఆంధ్రజ్యోతి ఎడిటర్ ఏపీ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా దాన్ని కూడా హైకోర్టు కొట్టివేసిందని సుబ్రహ్మణ్యస్వామి చెప్పారు. టీటీడీ తరఫున వాదించడానికి తనకు అర్హత ఉందని స్పష్టం చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛను లబ్ధిదారులు, నేతలు


చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): ప్రభుత్వం సామాజిక పింఛన్లను రూ.3వేలకు పెంచిన సందర్భంగా చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం ఏ.కొత్తకోటలో శుక్రవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. స్థానిక నేతలు, లబ్ధిదారులు పాల్గొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు, పింఛనుదారులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 100శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రశంసించారు. సీఎం వైఎస్ జగన్ ప్రతి ఇంటికి పెద్దకొడుకులా అవ్వతాతల సంక్షేమం కోరుతూ ఒకటో తేదీన పింఛను అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, ధర్మవరం పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిల చిత్రపటాలకు కూడా క్షీరాభిషేకం చేశారు. ఏ.కొత్తకోట సర్పంచ్ రిజ్వానా, ఉప సర్పంచ్ వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ నాగరత్న, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'సురక్ష'తో ఆరోగ్యం


సిబ్బందితో మాట్లాడుతున్న సీఈవో బాలాజీ

పూతలపట్టు: 'జగనన్న ఆరోగ్య సురక్ష'క్యాంపులతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర ఆరోగ్యశ్రీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలాజీ అన్నారు. శుక్రవారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం గొడుగుచింత పంచాయతీ పరిధిలోని 'జగనన్న ఆరోగ్య సురక్ష 'క్యాంప్‌ను ఆయన తనిఖీ చేశారు. క్యాంప్ జరుగుతున్నట్లు ముందుగానే ప్రజలకు సమాచారాన్ని తెలియజేయాలని తద్వారా చికిత్స పొందే రోగుల సంఖ్య పెరుగుతుందని వైద్యాధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'జగనన్న ఆరోగ్య సురక్ష 'క్యాంప్‌ను తప్పనిసరిగా కేటాయించిన తేదీల్లో నిర్వహించాలన్నారు. అర్హత పొందిన ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ కార్డును అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్‌లు రాజశేఖర్, సుదర్శన్, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాడె మోసిన కుమార్తెలు


తల్లి పాడెను మోస్తున్న కుమార్తెలు

రాజుపాళెం: నవమాసాలు మోసి తమను పెంచి పెద్దచేసి చితికేగిన తల్లి పాడె మోసి కుమార్తెలు రుణం తీర్చుకున్నారు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని గోపాయపల్లెలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన గంగిరెడ్డి వెంకటలక్షుమ్మ (75)కు ఐదుగురు కుమార్తెలు. వీరందరూ పెళ్లి చేసుకుని వేర్వేరు చోట్ల ఉంటున్నారు. వెంకటలక్షుమ్మ భర్త 35 ఏళ్ల క్రితమే మరణించాడు. వెంకటలక్షుమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించింది. ఓ కుమార్తె కుండతో ముందు నడవగా, మిగిలిన వారు పాడె మోసుకుంటూ శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

మన్యంలో 'అభిలాష'

- ఉద్యోగ పరీక్షలకు ఉపకరించే పుస్తకాలతో సచివాలయాల్లో లైబ్రరీలు
- పార్వతీపురం కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు



'అభిలాష' లైబ్రరీ మోడల్‌ను ఆవిష్కరిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గ్రూప్–1, గ్రూప్–2 తదితర ఉద్యోగాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్లు ఇచ్చింది. మరోవైపు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగమనే కలను నెరవేర్చుకోవాలంటే అందుకు తగ్గ పుస్తకాలు చదవాల్సిన అవసరం చాలా ఉంటుంది. ఎక్కడో మారుమూల గ్రామాల్లో, గిరిజన ఆవాసాల్లో ఉండే వారికి వాటిని సమకూర్చుకోవడం వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారం. ఈ అడ్డంకి వారికి ఉండకూడదనే ఉద్దేశంతో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ 'అభిలాష' (యాక్సెసబుల్ బుక్స్ ఇనీషియేటివ్ ఫర్ లెర్నింగ్ అండ్ సోషల్ అడ్వాన్స్‌మెంట్) పేరుతో కొత్త ప్రాజెక్టును సిద్ధం చేశారు.

నీతి ఆయోగ్ బహుమతి సద్వినియోగం

పార్వతీపురం మన్యం జిల్లాకు నీతిఆయోగ్ బహుమతిగా ఇచ్చిన రూ.5 కోట్ల నిధులు యువతకు ఉపయోగించేలా 'అభిలాష' ప్రాజెక్టుకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ రూపకల్పన చేశారు. మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన సచివాలయ భవనాల్లో రూ.2 కోట్లతో పోటీ పరీక్షలకు ఉపయోగపడే ప్రత్యేక పుస్తకాలతో 200 లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో రెండేసి సెట్ల చొప్పున 66 రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నారు. మొత్తం 132 పుస్తకాల భద్రతకు గోద్రెజ్ అల్మరాను సమకూరుస్తున్నారు. ఇప్పటివరకూ 97 సచివాలయాల్లో 12,804 పుస్తకాలతో లైబ్రరీలు సిద్ధమయ్యాయి. ఈ నెలాఖరుకల్లా మరో 28 లైబ్రరీలు అందుబాటులోకి వస్తాయి. మిగతా 75 ఫిబ్రవరి నాటికి ఏర్పాటవుతాయి. మిగిలిన రూ.3 కోట్లతో పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

పోటీపరీక్షల మెటీరియల్ అందుబాటులోకి..

ఇంజినీరింగ్ (జేఈఈ), మెడికల్ (నీట్) తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీపీఎస్సీ గ్రూప్స్, యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, బ్యాంకు పీవో, క్లర్క్స్ తదితర ఉద్యోగాల సాధనకు ఉపయోగపడే పుస్తకాలను 'అభిలాష' లైబ్రరీల్లో ఉంచారు. ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, ఇంటర్వ్యూలకు సన్నద్ధమయ్యేందుకు సూచనలున్న పుస్తకాలు, విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు కూడా వీటిలో అందుబాటులో ఉంచుతున్నారు.

అందరికీ అందుబాటులో విజ్ఞానం

'అభిలాష' లైబ్రరీలను ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. సచివాలయంలో ఉండే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే కావాల్సిన పుస్తకాలను వాటిపైనున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఇస్తారు. లైబ్రరీ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నాం. ఏ పుస్తకాలు ఎవరు తీసుకున్నారో, ఎన్ని తిరిగి ఇచ్చారో, వేటికి ఎక్కువ డిమాండ్ ఉందో దీనిద్వారా జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షిస్తాం. ఈ లైబ్రరీలను వారం రోజుల్లో సీనియర్ అధికారులు, ప్రజాప్రతినిధులతో లాంఛనంగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే సివిల్స్, గ్రూప్స్ విజేతలై ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన వారెవరైనా తమ వద్ద గల పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్ డొనేట్ చేయవచ్చు.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

ఫిబ్రవరి 3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు

- 5వ తేదీ వరకూ నిర్వహణ
- 22న అయోధ్యకు లక్ష శ్రీవారి లడ్డూలు


విరాళం అందజేస్తున్న దాతల ప్రతినిధి

తిరుమల: సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు తిరుమలలో దేశంలోని ప్రముఖ పీఠాధిపతులు, మఠాధిపతులు, ధార్మిక సంస్థలతో సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవోలో ఆయన ప్రసంగించారు. అయోధ్యలో 22వ తేదీ రామచంద్రులవారి విగ్రహ ప్రతిష్ఠ, శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా భక్తులకు 25 గ్రాముల బరువుగల లక్ష లడ్డూలను శ్రీవారి ప్రసాదంగా అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. జనవరి 16వ తేదీన శ్రీవారి పార్వేట ఉత్సవం, 25న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.40 లక్షలు విరాళంగా అందింది. ఈ మేరకు దాతల ప్రతినిధులు విరాళం డీడీలను తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గత ఏడాది డిసెంబర్ 12వ తేదీ నుంచి 25 రోజుల పాటు జరిగిన అధ్యయనోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని వేంచేపు చేసి దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించారు.

ఘనంగా తన్నీరముదు ఉత్సవం

శ్రీవేంకటేశ్వరుని సేవలో తన జీవితాన్ని అర్పించిన మహనీయుడైన శ్రీ తిరుమలనంబి స్మృత్యర్థం ఏటా నిర్వహించే తన్నీరముదు ఉత్సవం తిరుమలలో శుక్రవారం ఘనంగా జరిగింది. సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధి ఆలయ ప్రదక్షిణముగా వాహన మండపానికి వేంచేశారు. ఈ సందర్భంగా తిరుమలనంబి రచించిన ''తిరుమొళి పాశురాలను'' పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఏపీలోనే పారిశుధ్య కార్మికులకు ఎక్కువ జీతాలు

- జీతాల పెంపు డిమాండ్‌పై వారికే స్పష్టత లేదు..
- గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆనందరావు


మాట్లాడుతున్న ఆనందరావు

దాబగార్డెన్స్ (విశాఖ దక్షిణ): పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెపై గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మహాదేవ్ ఆనందరావు స్పందించారు. కార్మికులకు ఏ రీతిన జీతాలు పెంచాలో సమాధానమే వారి వద్ద లేదన్నారు. గతంలో రూ.12 వేలు జీతం తీసుకున్న పారిశుధ్య కార్మికుడికి జగన్ ప్రభుత్వం వచ్చాక రూ.21 వేలు అందుకుంటున్నారని చెప్పారు. అయినా ఇంకేం న్యాయం చేయాలో వారికే తెలియడం లేదని, దీనికి సీఐటీయూ వంత పాడడంలో ఆంతర్యమేంటో అర్థం కావడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలన్న దురుద్దేశంతో సీఐటీయూ ఉందన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమ్మె ప్రారంభమై దాదాపు 12 రోజులు కావస్తోందని, సమ్మెకు సంబంధించి మూడు సార్లు చర్చలు జరిగాయన్నారు. ఈ నెల 3న హైలెవెల్ కమిటీ(సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్) సమావేశమైందని, జీతాలు ఏ బేస్‌పై పెంచమంటున్నారో పారిశుధ్య కార్మికుల వద్ద సమాధానమే లేదని ఆ చర్చల్లో తేలిందన్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోనే గాక కమ్యూనిస్టులు పాలిస్తున్న రాష్ట్రాల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న జీతాలు లేవన్నారు. సమ్మె మంచిది కాదని, ప్రజారోగ్యం దెబ్బతింటే దానికి పారిశుధ్య కార్మికులు కారకులు కాకూడదన్నదే జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ కోరుకుంటుందన్నారు. జీవో 30 ప్రకారం ఇంజినీరింగ్, మలేరియా, వాటర్ సప్లై డ్రైవర్లు, డాగ్ క్యాచర్స్ ఇలా సుమారు 1,500 మంది కార్మికులకు అన్యాయం జరిగిందని, వారందరికీ న్యాయం చేయడానికి ప్రభుత్వం చూస్తోందని, వారి సమస్య పరిష్కారం అయిన వెంటనే మిగిలిన కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందిస్తుందని ఆనందరావు చెప్పారు.

దళిత మహిళా ఎంపీటీసీపై జేసీ దాడి

- జగనన్న కాలనీకి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, టిప్పర్‌ల టైర్లలో గాలి తీయించిన జేసీ ప్రభాకర్
- ప్రశ్నించిన దళిత మహిళా ఎంపీటీసీ, ఆమె భర్తపై రాడ్లతో దాడి
- మరోసారి ఇసుక తరలిస్తే అంతుచూస్తామని బెదిరింపులు
- తాడిపత్రిలో దళిత సంఘాల ఆందోళన


ఆందోళన చేస్తున్న మేరీ, దళిత సంఘాల నాయకులు

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి మరోసారి రెచ్చిపోయారు. దళిత ఎంపీటీసీ సభ్యురాలితోపాటు ఆమె భర్తపై తన అనుచరులతో కలిసి దాడి చేశారు. బాధితుల కథనం మేరకు... జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఉదయం తాడిపత్రి నుంచి గుత్తి పట్టణానికి చుక్కలూరు గ్రామం మీదుగా వెళుతున్నారు. చుక్కలూరులో జగనన్న హౌసింగ్ కాలనీకి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఆయనకు కనిపించింది. వెంటనే తన అనుచరులతో కలసి ట్రాక్టర్‌ను ఆపారు. డ్రైవర్‌ను బెదిరించడంతోపాటు అనుచరులతో దగ్గరుండి ట్రాక్టర్ టైర్లలో గాలి తీసేయించాడు. అక్కడికి సమీపంలోనే ఉన్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు ఎర్రగుడి మేరి వచ్చి ట్రాక్టరు టైర్లకు గాలి ఎందుకు తీసేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు రెచ్చిపోయి మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా నిర్దాక్షిణ్యంగా ఆమెను నెట్టివేశారు. వెంటనే ఆమె తన భర్త భాస్కర్‌కు జరిగిన విషయం చెప్పగా... ఆయన అక్కడికి వచ్చాడు. భాస్కర్ వచ్చిన వెంటనే జేసీ అనుచరులు రాడ్లతో దాడిచేశారు. ఇకపై ఇసుక తరలిస్తే అంతుచూస్తామని జేసీ బెదిరించి కారు ఎక్కి వెళ్లిపోయారు. మేరి, ఆమె భర్తపై దాడి విషయం తెలుసుకున్న దళిత సంఘాల నేతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్కలూరు గ్రామానికి చేరుకుని తాడిపత్రి–గుత్తి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటన్నర పాటు రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తాడిపత్రి రూరల్ పోలీసులు తెలిపారు.

రాయలచెరువులో సైతం..


చుక్కలూరులో ట్రాక్టర్ టైర్లకు గాలి తీసిన అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి గుత్తికి వెళుతూ మార్గమధ్యంలోని రాయలచెరువు వద్ద ఇసుకను తీసుకెళుతున్న రెండు టిప్పర్లకు సైతం గాలి తీసివేయించారు. దీంతో వాటి డ్రైవర్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు యాడికి పోలీసులు తెలిపారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు

ఈ దాడి ఘటనకు సంబంధించి జేసీ ప్రభాకర్‌రెడ్డితో పాటు అనుచరులపై తాడిపత్రి రూరల్, యాడికి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చుక్కలూరు ఘటనలో బాధితుడు యర్రగుడి భాస్కర్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు జేసీ ప్రభాకర్‌రెడ్డితో పాటు మరి కొందరిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

బీసీలపై బాబుది కపట ప్రేమ

బీసీల పక్షపాతి సీఎం జగన్: ఎమ్మెల్యే కొడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని. పక్కన జెడ్పీ చైర్మన్ హారిక

గుడ్లవల్లేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు అన్ని విధాలా బీసీలను అణగదొక్కారని, ఇప్పుడు వారిపై కపట ప్రేమను ఒలకబోస్తున్నారని విమర్శించారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో శుక్రవారం పైపులైన్ల పనులను ప్రారంభించేందుకు వచ్చిన నాని మీడియాతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్‌ను వెనక పెట్టుకుని బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నానని చంద్రబాబు చెప్పుకుంటే ఎలా? అని ప్రశ్నించారు. అత్యధిక శాతం ఉన్న బీసీలను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చంద్రబాబు ఇప్పటికీ చేస్తున్నారని విమర్శించారు. పవన్‌ను భుజాన వేసుకుని బాబు బీసీలను గాలికొదిలేశాడన్నారు. 85 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు.. పవన్‌తో కలిస్తే ఏదో భూమి బద్దలైపోద్ది అన్నట్టుగా బాబు సొంత డబ్బా కొట్టుకుంటున్నాడని విమర్శించారు. ఏ వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాడో బాబుకు ఆయా వర్గాలు తప్పకుండా 2024 ఎన్నికల్లో బుద్ధి చెబుతాయన్నారు. బాబు అధికారంలో ఉండగా రాజకీయంగా గానీ, సంక్షేమపరంగా గానీ బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఎన్టీఆర్ బీసీలకు చేసిన సంక్షేమాన్ని తన ఖాతాలో వేసుకుని చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటున్నాడని ఎద్దేవా చేశారు.

ఓసీ అయితే.. బాబు హయాంలో కమ్మ, జగన్ హయాంలో బీసీ

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా కృష్ణా జిల్లాలో బీసీ అయిన కొలుసు పార్థసారథికే మంత్రిగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. తాను, పేర్ని నాని జిల్లా మంత్రుల అనంతరం బీసీ సామాజిక వర్గం నుంచి జోగి రమేష్‌కు సీఎం జగన్ అవకాశం ఇచ్చారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ పదవి ఓసీ రిజర్వేషన్ అయితే.. చంద్రబాబు ఆనాడు కమ్మ సామాజిక వర్గానికి చెందిన గద్దె అనురాధకు అవకాశం ఇచ్చారని, జిల్లాకు ఓసీ రిజర్వేషన్ వచ్చినా బీసీ అయిన ఉప్పాల హారికను మహిళా చైర్‌పర్సన్‌గా చేయడం బీసీల పట్ల జగన్‌కు ఉన్న అంకిత భావానికి నిదర్శనమన్నారు. విజయవాడ మేయర్ ఓసీ రిజర్వేషన్ వస్తే కమ్మ సామాజిక వర్గం నుంచి కోనేరు శ్రీధర్‌ను చంద్రబాబు పెడితే, ఇప్పుడు మాత్రం ఓసీ రిజర్వేషన్ అయినా బీసీ మహిళను మేయర్‌ను చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 17 ఎమ్మెల్సీలు వస్తే జగన్ మొత్తం బీసీలకే పట్టం గట్టారని, 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆ చైర్మన్లను బీసీలకు ఇచ్చిన బీసీ పక్షపాతి జగన్ అని కొనియాడారు. రాజ్యసభ పదవులు నాలుగు వస్తే వాటిని కూడా సీఎం జగన్ బీసీలకే ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉండగా 40 రాజ్యసభ పదవులు రాగా, ఒక్కటి కూడా బీసీకి ఇవ్వలేదని దుయ్యబట్టారు. జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, పార్టీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

రామోజీ ఫిల్మ్‌సిటీలో రాజవంశీకుల భూములు

అసైన్డ్, రహదారి భూములు కూడా...

- గాలిబ్ జంగ్‌కు చెందిన 1,700 ఎకరాలు ఆక్రమించారు
- వైఎస్ హయాంలో ఇచ్చిన భూముల్లోకి లబ్ధిదారులను రానివ్వట్లేదు
- ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టాలి
- ఈ అంశంపై మల్లికార్జున్ ఖర్గే, సోనియా, రాహుల్‌ను కలుస్తా
- ఢిల్లీలో మీడియాతో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: రామోజీ ఫిల్మ్‌సిటీలో రాజవంశీకులకు చెందిన భూములతో పాటు అసైన్డ్, రహదారి భూములున్నాయని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రామోజీ ఫిల్మ్ సిటీలో భూఆక్రమణలపై మీడియాతో ఆయన మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీకి చెందిన 3 వేల ఎకరాల్లో 1,700 ఎకరాలు గాలిబ్ జంగ్‌కు చెందిన భూములున్నాయని... ప్రజారహదారులు, హరిజనుల భూములు, భూదాన్ భూములను సైతం కబ్జా చేశారని చెప్పారు. కార్మికుల చట్టాలను కూడా ఉల్లంఘించారని, గతంలో ఈనాడులో పనిచేసిన వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. అనాజ్‌పూర్–ఇబ్రహీంపట్నం రహదారిని మూసేసి, కబ్జా చేశారని... దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గోనె పేర్కొన్నారు. దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో 682 మందికి 200 గజాల చొప్పున పట్టాలు ఇవ్వగా లబ్ధిదారులను వారి స్థలాల్లోకి రానివ్వట్లేదని గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. ఈ ఆస్తులను ప్రభుత్వం వెంటనే అధీనంలోకి తీసుకొని రామోజీరావుకు నోటీసులు జారీ చేయాలన్నారు. 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'చట్టం ప్రకారం నోటీసులపై రామోజీరావు కోర్టుకు వెళ్లడానికి వీల్లేదని... ఇది చాలా పటిష్టమైన చట్టమని చెప్పారు.

న్యాయ పోరాటం క్లైమాక్స్‌కు...

బ్రిటిష్ పాలకులు 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'అనే చట్టం తీసుకొచ్చారని, అందులో దేశవ్యాప్తంగా వివిధ రాజవంశాలకు చెందిన 560 మందిని చేర్చారని గోనె ప్రకాశ్‌రావు తెలిపారు. నిజాం స్టేట్‌లో మార్వాడీ, ముస్లింలు తదితర 8 కుటుంబాలు ఉన్నాయన్నారు. అయితే ఈ రాజవంశీకులకు చెందిన రూ. లక్షల కోట్ల విలువైన ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయని.. ఈ విషయంలో తాను చేస్తున్న పోరాటం క్లైమాక్స్‌కు వచ్చిందన్నారు. 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'చట్టం ప్రకారం రాజవంశీకుల మరణానంతరం వారి వారసులు మైనర్లయితే పరిశ్రమలు, ఆస్తులు, భూములను ప్రభుత్వం అధీనంలోకి తీసుకుంటుందని... వారసులు మేజర్లు అయ్యాక ఆ ఆస్తులను వారికి తిరిగి అప్పగిస్తుందని ఆయన చెప్పారు. అయితే తెలంగాణలో ఆ ఆస్తులు, భూములు అన్యాక్రాంతమయ్యాయని, రూ. లక్షల కోట్ల విలువైన 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'కిందకు వచ్చే ఆస్తులు ఒక పత్రికాధిపతి (రామోజీరావు), తెలుగు రాష్ట్రాల్లోనే నెంబర్ వన్ బిల్డర్‌గా ఉన్న రామేశ్వరరావు అధీనంలో ఉన్నాయని గోనె ఆరోపించారు. వాటిలో పెద్దపెద్ద భవనాలు కట్టారని తెలిపారు. రాష్ట్రంతోపాటు అమెరికాలో పెద్ద పారిశ్రామికవేత్త, ఎయిర్‌పోర్టులు నిర్మించిన ఆయనకు స్టార్ హోటళ్లు కూడా ఉన్నాయని వాటిని తాజ్ గ్రూప్‌నకు ఇచ్చారని, అవి కూడా 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్'భూములే అన్నారు.

సీఎంలు రేవంత్, సిద్ధరామయ్య విచారణ జరిపించాలి..

రాజవంశానికి చెందిన వారందరినీ కలుపుకొని ఈ విషయంలో న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిసి ఆధారాలు అందిస్తానని గోనె ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ తరహా వ్యవహారాలు కర్ణాటకలోనూ ఉన్నందున చర్యలు తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఒక కమిటీ వేసి విచారణ జరిపించాలని కోరారు. రాజవంశీకుల భూములను ఆక్రమణల చెర నుంచి విడిపించేలా అడ్వొకేట్ జనరల్, చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీలు కోర్ట్ ఆఫ్ వార్డ్స్ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత పత్రాలు, సమాచారం కోసం హైదరాబాద్‌లోని రాజ్యాభిలేఖ కార్యాలయానికి దరఖాస్తు చేశానన్నారు. 2008లో పాయిగా వంశానికి చెందిన 140 ఎకరాలు (రూ. 20వేల కోట్ల విలువైన) రిలీజ్ అయ్యాయని తెలిపారు. ఈ విషయంపై రాయ్‌చూర్‌లోని ఆ కుటుంబంతో మాట్లాడానని తెలిపారు. ఈ వ్యవహారంలో విజయం సాధిస్తామా లేదన్నది కోర్టులు తేలుస్తాయని గోనె అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు హామీలిచ్చిన పథకాల అమలుకు ఆ ఆస్తులను వినియోగించాలని కోరతామని చెప్పారు. తెలంగాణ వచ్చాక లక్ష నాగళ్లతో (రామోజీ ఫిల్మ్‌సిటీని) దున్నిస్తానని చెప్పిన కేసీఆర్... ముఖ్యమంత్రి అయ్యాక కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని త్వరలో కలిసి ఈ వ్యవహారాన్ని వివరిస్తానని చెప్పారు. ఆర్థిక చిక్కుల్లో నుంచి రాష్ట్రం బయటపడేందుకు తాను చెబుతున్న విషయం ఒక ఫార్ములా అని అన్నారు. ఈ సందర్భంగా గతంలో రామోజీరావు ఆక్రమణలపై 2010లో 'ఇండియా టుడే'ప్రచురించిన కథనాలను, సంబంధిత పత్రాలను గోనె ప్రకాశ్‌రావు మీడియాకు చూపించారు.

తల్లిని చంపిన మతిస్థిమితంలేని కొడుకు

రేగొండ: మతిస్థిమితంలేని ఓ కుమారుడు కన్నతల్లిని రోకలిబండతో కొట్టి చంపాడు. అడ్డువచ్చిన మరో మహిళపై దాడి చేయడంతో ఆమె ప్రాణాపాయస్థితిలో ఉంది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తిరుమలగిరికి చెందిన కంచరకుంట్ల హైమావతి(60) కుమారుడు రాజిరెడ్డి కొన్నాళ్లుగా మతిస్థిమితంలేక వింతగా ప్రవర్తిస్తూ కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతడి ప్రవర్తనకు తట్టుకోలేక తల్లి హైమావతి, భార్య సరిత పక్కింట్లో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గురువారంరాత్రి కూడా పక్కింట్లో నిద్రించిన తల్లి, భార్యను ఇంటికి రావాలని ఒత్తిడి చేశాడు. దీంతో వారు ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో హైమావతి తలపై రాజిరెడ్డి రోకలిబండతో మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటన చూసిన రాజిరెడ్డి భార్య సరిత కేకలు వేయడంతో సమీపబంధువైన ఊకంటి తిరుపతమ్మ అక్కడికి రాగా, ఆమెపై కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ తిరుపతమ్మను గ్రామస్తులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. రాజిరెడ్డి శుక్రవారం గోరికొత్తపల్లి మండలం చిన్నకోడెపాకలో అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో దొంగగా భావించిన గ్రామస్తులు చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లిని హత్య చేసి పారిపోయిన వ్యక్తిగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ రాములు, సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఏసీబీ వలలో కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిష్టయ్య శుక్రవారం ఏసీబీ వలకు చిక్కారు. శుక్రవారం పాలవ్యాపారి వద్ద రూ.50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. వివరాలు... నగరంలోని కాశీబుగ్గకు చెందిన పాలవ్యాపారి పెండెం రాజేందర్ నాలుగేళ్లుగా యూనివర్సిటీలోని నాలుగు హాస్టళ్ల మెస్‌లకు పాలు సరఫరా చేస్తున్నారు. ఇందుకుగాను రూ.19 లక్షల మేర పాలబిల్లు హాస్టల్ ఆఫీస్ నుంచి రావాల్సి ఉంది. ఆడిట్ ఆఫీస్, హాస్టల్ ఆఫీస్‌లోనూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కిష్టయ్య బిల్లు పాస్ చేసేందుకు రూ.75 వేల లంచం ఇవ్వాలని పాలవ్యాపారిని డిమాండ్ చేశారు. చివరికి రూ.50 వేలు ఇచ్చేందుకు వ్యాపారి ఒప్పుకోవడంతో గత నెల 31న రూ.14 లక్షల బిల్లు పాస్ చేశారు. అయితే తనకు ఇస్తానన్న రూ.50 వేల కోసం కిష్టయ్య తరచూ అడుగుతుండగా, లంచం ఇవ్వడం ఇష్టంలేని రాజేందర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. తాజాగా వర్సిటీలోని ఆడిట్ ఆఫీస్‌లో ఉన్న కిష్టయ్య పాలవ్యాపారి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారి సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. ఆయనను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

ఆస్తికోసం తండ్రిని చంపిన తనయుడు

గూడూరు: ఆస్తికోసం తండ్రిని ఓ కొడుకు కొట్టిచంపాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణి గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. తీగలవేణికి చెందిన కందాలం లింగాచారి(70) దేవేంద్రమ్మకు ముగ్గురు కొడుకులు సంతానం. వారికి పెళ్లిళ్లు అయి వేరుగా ఉంటున్నారు. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో లింగాచారి పూజారిగా పని చేస్తున్నాడు. చిన్నకొడుకు రమేశ్ మద్యానికి బానిసై తిరుగుతుండగా, కోడలు గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యంమత్తులోనే తిరుగుతున్న రమేశ్ ఆలయం వద్ద ఉన్న తండ్రి వద్దకు గురువారంరాత్రి వెళ్లాడు. తనకు మరికొంత ఆస్తి కావాలని, భార్యను కాపురానికి తీసుకురావాలని తండ్రితో గొడవపడ్డాడు. తండ్రి వినకపోవడంతో దారుణంగా కొట్టి కత్తితో పొడిచి చంపి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి పది దాటినా లింగాచారి ఇంటికి రాకపోవడంతో దేవేంద్రమ్మ రెండో కుమారుడిని ఆలయం వద్దకు వెళ్లి తీసుకురమ్మని చెప్పింది. అతను వెళ్లి చూసేసరికి తండ్రి రక్తపుమడుగులో పడి ఉండటంతో వెంటనే కుటుంబసభ్యులకు తెలిపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

క్లుప్తంగా...

సార్వత్రిక ఎన్నికలను వాయిదా వేయాలి

పాక్ సెనేట్ తీర్మానం

ఇస్లామాబాద్: ఫిబ్రవరి 8వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగాల్సిన పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితి మరింత ముదురుతోంది. అతి శీతల వాతావరణ పరిస్థితులు, ఖైబర్ ఫంక్తున్వా వంటి ప్రావిన్సుల్లో భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో ఫిబ్రవరి 8వ తేదీన జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ సెనేట్ తీర్మానం ఆమోదించింది. స్వతంత్ర సభ్యుడు దిలావర్ ఖాన్ చేసిన ప్రతిపాదనకు ఊహించని మద్దతు లభించింది. అయితే, పాకిస్తాన్ ఎన్నికల సంఘం(ఈసీపీ) సెనేట్ తీర్మానాన్ని తోసిపుచ్చింది. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వు ద్వారా మాత్రమే ఎన్నికల షెడ్యూల్ మారుతుందని పేర్కొంది.

దావూద్ కుటుంబీకుల ఆస్తులకు రూ.2 కోట్లకు పైగా ధర

ముంబై: 1993 ముంబై పేలుళ్ల కేసు సూత్రధారి, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం కుటుంబసభ్యులకు చెందిన రెండు స్థిరాస్తులు వేలంలో రూ.2 కోట్లకు పైగా ధర పలికినట్లు అధికారులు తెలిపారు. స్మగ్లర్లు, ఫారిన్ ఎక్స్ఛేంజి మానిప్యులేటర్స్ చట్టం కింద శుక్రవారం ముంబైలోని ఆయకార్ భవనంలో వేలం చేపట్టామన్నారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా ఖేడ్ తహశీల్ ముంబాకే గ్రామంలోని నాలుగు చోట్ల ఉన్న భూములను వేలానికి ఉంచినట్లు చెప్పారు. వీటిలో సుమారు 171 చదరపు మీటర్ల భూమి ధర వేలంలో అత్యధికంగా రూ.2.01 కోట్లు, మరో 1,730 చదరపు మీటర్ల స్థలం రూ.3.28 కోట్లు పలికిందని చెప్పారు. ఈ రెండింటిని ఢిల్లీకి చెందిన లాయర్ కొనుగోలు చేశారని వివరించారు. మిగతా రెండు ప్లాట్లకు ఎవరూ టెండర్లు వేయలేదని వివరించారు.

619కి చేరిన జేఎన్.1 కేసులు

న్యూఢిల్లీ: దేశంలోని 12 రాష్ట్రాల్లో జనవరి 4వ తేదీ వరకు కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 619 నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో కర్ణాటకలో అత్యధికంగా 199 కేసులు నమోదయ్యాయన్నారు. ఆ తర్వాత కేరళలో 148, మహారాష్ట్రలో 110, గోవాలో 47, గుజరాత్‌లో 36, ఏపీలో 30, తమిళనాడులో 26, ఢిల్లీలో 15, రాజస్తాన్‌లో 4, తెలంగాణలో 2, ఒడిశా, హరియాణాల్లో ఒక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి.

జైలు శిక్షపైనా అప్పీలు!

నేవీ అధికారుల కేసులో పురోగతి

న్యూఢిల్లీ: ఖతర్‌లో గూఢచర్య ఆరోపణలపై జైల్లో ఉన్న 8 మంది భారత మాజీ నేవీ అధికారులకు మరింత ఊరట. వారికి విధించిన మరణశిక్షను అక్కడి న్యాయస్థానం ఇటీవలే జైలు శిక్షగా మార్చడం తెలిసిందే. దానిపై కూడా ఖతార్ సుప్రీంకోర్టులో అప్పీలుకు వీలు కల్పించడంతో పాటు అందుకు 60 రోజుల గడువిచ్చినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. 8 మంది మాజీ అధికారుల్లో ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా జైలు శిక్ష విధించినట్టు చెబుతున్నారు. వాటి వివరాలను ఖతార్, భారత్ గోప్యంగా ఉంచుతున్నాయి.

ఇక్బాల్ అన్సారీకి అయోధ్య ఆహ్వాన లేఖ

అయోధ్య: రామజన్మభూమి–బాబ్రీ మసీదు కేసులో కక్షిదారు అయిన ఇక్బాల్ అన్సారీ రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమ ఆహ్వానం అందుకున్నారు. అయోధ్యలోని రామ్ పథ్ సమీపంలో కొటియా పంజిటొలా వద్ద ఉన్న తమ నివాసానికి శుక్రవారం ఉదయం ఆహ్వాన లేఖ వచ్చినట్లు అన్సారీ కుమార్తె షామా పర్వీన్ పీటీఐకి చెప్పారు. ఆహ్వాన లేఖను తన తండ్రి స్వయంగా అందుకున్నారని ఆమె తెలిపారు.

ఫిన్లాండ్, స్వీడన్‌లో రికార్డు స్థాయి చలి

స్టాక్‌హోమ్: నార్డిక్ దేశాలైన నార్వే, స్వీడన్, ఫిన్లాండ్‌లను చలి వణికిస్తోంది. 25 ఏళ్ల తర్వాత స్వీడన్, ఫిన్లాండ్ దేశాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా మైనస్ 40 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఎముకలు కొరికే చలికి తోడు దట్టమైన మంచు కురుస్తుండటంతో మూడు దేశాల్లోనూ రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. స్వీడన్‌లోని ఉత్తరప్రాంతంలో ఉష్ణోగ్రతలు 1999 తర్వాత –43.6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడం ఇదే మొదటిసారని వాతావరణ శాఖ తెలిపింది. 1951లో, తిరిగి 1999లోనూ –49 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు గుర్తు చేసింది. పొరుగునే ఉన్న ఫిన్లాండ్‌లోని వైలివియెస్కాలో ఉష్ణోగ్రత మంగళవారం –37.8 డిగ్రీలుగా నమోదైంది.

హైకోర్టు జడ్జీలుగా ఐదుగురు

న్యూఢిల్లీ: నాలుగు హైకోర్టుల్లో నియామకానికిగాను సుప్రీంకోర్టు కొలీజియం అయిదుగురు జడ్జీల పేర్లను ప్రతిపాదించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో భేటీ అయిన కొలీజియం ఈ మేరకు కేంద్రానికి సిఫారసులను పంపించింది. కొలీజియంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా ఉన్నారు. జమ్మూ కశ్మీర్ అండ్ లద్దాఖ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ రాహుల్ భారతి, జస్టిస్ మోక్షా ఖజూరియా కజ్మిలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం కోరింది. బాంబే హైకోర్టులో అదనపు జడ్జి అభయ్ అహుజాను శాశ్వత న్యాయమూర్తిగా, కోల్‌కతా హైకోర్టు న్యాయాధికారి చైతలి చటర్జీ(దాస్)ను అదే హైకోర్టులో న్యాయమూర్తిగా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయాధికారి అరవింద్ కుమార్ వర్మను అదే హైకోర్టులో జడ్జిగా నియమించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.

ఎన్నికల ఏడాది

చరిత్రలో తొలిసారిగా 50కి పైగా దేశాల్లో ఒకే ఏడాది ఎన్నికలు

2024ను ఎన్నికల ఏడాదిగా పిలవాలేమో. ఎందుకంటే ఈ ఏడాది ఏకంగా 50కి పైగా దేశాల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి! ఒక్క ఏడాదిలో ఇన్ని దేశాల్లో ఎన్నికలు జరగడం చరిత్రలో ఇదే తొలిసారి. అలా 2024 రికార్డులకెక్కబోతోంది. పైగా అత్యధిక జనాభా ఉన్న టాప్ 10 దేశాల్లో ఏకంగా ఏడు ఈసారి ఎన్నికల పోరుకు సిద్ధమవుతుండటం విశేషం. ఆ లెక్కన ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది ఈ ఏడు ఓటు హక్కును వినియోగించుకోనుండటం ఇంకో విశేషం! ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న భారత్ మొదలుకుని అగ్ర రాజ్యం అమెరికా దాకా ఈ జాబితాలో ఉన్న ముఖ్యమైన దేశాలను ఓసారి చూద్దాం...

– సాక్షి, నేషనల్ డెస్క్

జనాభాలో టాప్–10 దేశాల్లో ఏడింట్లో బ్యాలెట్ పోరు



బంగ్లాదేశ్

17 కోట్ల జనాభా ఉన్న బంగ్లాదేశ్ ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న తొలి దేశం. జనవరి 7న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. అయితే విపక్షాలన్నింటినీ నిర్వీర్యం చేసి ఏకపక్ష ఎన్నికల ప్రహసనానికి తెర తీశారంటూ ప్రధాని షేక్ హసీనా ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అణచివేతను తట్టుకోలేక పలువురు విపక్ష నేతలు ప్రవాసంలో గడుపుతున్నారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీతో పాటు విపక్షాలన్నీ బాయ్‌కాట్ చేసిన ఈ ఎన్నికల్లో హసీనా మరోసారి నెగ్గడం, వరుసగా ఐదోసారి అధికారంలోకి రావడం లాంఛనమే కానుంది. ప్రజాస్వామ్యానికి చెల్లుచీటీ పాడి చైనా మాదిరిగా దేశంలో హసీనా ఏక పార్టీ వ్యవస్థను నెలకొల్పేలా ఉన్నారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

తైవాన్

చైనా పడగ నీడన తన స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్న తైవాన్‌లో జనవరి 13న అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. అధికార డీపీపీ తరఫున ప్రస్తుత అధ్యక్షుడు సై ఇంగ్ వెన్‌కు బదులుగా లై చింగ్ టే బరిలో ఉన్నారు. ఆయనకు వెన్‌కు మించిన స్వాతంత్ర్య ప్రియునిగా పేరుంది. ఉదారవాద క్యోమింటాంగ్ నేత హో యూ యీ, తైవాన్ పీపుల్స్ పార్టీ తరఫున కో వెన్ జే ఆయనను సవాలు చేస్తున్నారు. డీపీపీ 2016 నుంచీ అధికారంలో కొనసాగుతోంది. ఈసారి కూడా అది అధికారంలోకి వస్తే యుద్ధానికి దిగైనా తైవాన్‌ను విలీనం చేసుకుంటానంటూ చైనా ఇప్పటికే బెదిరిస్తోంది. దాంతో ఈ ఎన్నికలు తైవాన్‌కు ఒకరకంగా జీవన్మరణ సమస్యగా పరిణమించాయి.

పాకిస్తాన్

24 కోట్ల జనాభా ఉన్న పాక్ అనిశ్చితికి మారుపేరు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 8న సార్వత్రిక ఎన్నికలు జరగాలి. కానీ అవి వాయిదా పడే సూచనలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. సైన్యాన్ని ఎదిరించి ప్రధాని పదవి కోల్పోయి అవినీతి కేసుల్లో జైలు పాలైన పీటీఐ చీఫ్ ఇమ్రాన్‌ఖాన్ పోటీకి దారులు మూసుకుపోయినట్టు కన్పిస్తున్నాయి. ఆయన నామినేషన్లు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయి. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగడం అనుమానంగా మారింది. సైన్యం దన్నుతో పాకిస్తాన్ ముస్లిం లీగ్ (పీఎంఎల్) విజయం, ప్రవాసం నుంచి తిరిగొచ్చిన ఆ పార్టీ నేత నవాజ్ షరీఫ్ మరోసారి ప్రధాని కావడం లాంఛనమేనని అక్కడి రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

ఇండోనేసియా

27 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న ఇండోనేసియాలో కూడా ఫిబ్రవరిలో ఎన్నికలున్నాయి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షునితో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ పార్లమెంటు సభ్యులకు ఫిబ్రవరి 14న ఒకే రోజున ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రెండు టర్ములు పూర్తి చేసుకున్న అధ్యక్షుడు జోకో విడొడొ స్థానంలో రక్షణ మంత్రి 72 ఏళ్ల ప్రాబొవో సుబియంటో బరిలో ఉన్నారు. గంజర్ ప్రనోవో, అనీస్ బస్వేదన్ గట్టి పోటీ ఇస్తున్నారు.

భారత్

140 కోట్లకు పైగా జనాభా, 90 కోట్ల పై చిలుకు ఓటర్లతో ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్యంగా అలరారుతున్న భారత్ ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతోంది. ఇన్ని కోట్ల మంది ఓటర్లు అత్యంత శాంతియుతంగా, ప్రజాస్వామికంగా ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ప్రపంచమంతా అబ్బురపాటుతో వీక్షించడం పరిపాటిగా మారింది. ఈ ఎన్నికల్లో ప్రధానిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ ఖాయమని అత్యధిక రాజకీయ అంచనాలు చెబుతున్నాయి. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిని 2014లో ఆయన ఒంటి చేత్తో అధికారంలోకి తేవడం తెలిసిందే. 2019లోనూ మోదీ మేజిక్ రిపీటైంది. ఈసారి దానికి ఎలాగైనా అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ సారథ్యంలో 28 విపక్ష పార్టీలతో కూడిన విపక్ష ఇండియా కూటమి ప్రయత్నిస్తోంది.

మెక్సికో

జూన్ 2న ఎన్నికలకు మెక్సికో సిద్ధమవుతోంది. 13 కోట్ల జనాభా ఉన్న ఈ దేశ చరిత్రలోనే తొలిసారిగా అధ్యక్ష పదవితో పాటు మొత్తం 32 రాష్ట్రాల గవర్నర్లు, జాతీయ కాంగ్రెస్, స్థానిక సంస్థల స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. క్లాడియా షేన్‌బామ్ రూపంలో ఈసారి తొలిసారిగా ఓ మహిళ అధ్యక్ష పదవి చేపట్టే ఆస్కారం కనిపిస్తుండటంతో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. సైంటిస్టు, మెక్సికో సిటీ మాజీ మేయర్ అయిన ఆమె అధికార మొరేనా పార్టీ తరఫున బరిలో దిగుతున్నారు.

యూరోపియన్ యూనియన్

యూరోపియన్ యూనియన్‌లోని మొత్తం 27 దేశాల ప్రజలూ కీలకమైన ప్రతి ఐదేళ్లకోసారి యూరప్ పార్లమెంటులో తమ ప్రతినిధులను ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకుంటారు. విద్య, వైద్యం మొదలుకుని ఉపాధి దాకా ఆ దేశాలను తీవ్రంగా ప్రభావితం చేసే పలు కీలక రంగాలకు సంబంధించి నిర్ణాయక చట్టాలు చేయడంలో పార్లమెంటుదే కీలక పాత్ర. దాంతో జూన్ 6 నుంచి 9 దాకా జరగనున్న ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మొత్తం 720 మంది పార్లమెంటు సభ్యులు ఎన్నికవుతారు.

దక్షిణాఫ్రికా

6 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న ఈ దేశంలో మే–ఆగస్టు మధ్య సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. 1994లో దేశంలో వర్ణ వివక్ష అంతమయ్యాక జరుగుతున్న ఏడో ఎన్నికలివి. అప్పటినుంచీ అధికారంలో కొనసాగుతున్న ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్సీ) ఈసారి విజయానికి కావాల్సిన 50 శాతం మార్కును దాటడం కష్టకాలమేనంటున్నారు. గత అక్టోబర్‌లో జరిగిన సర్వేలో ఆ పార్టీకి మద్దతు 45 శాతానికి పడిపోయింది. అవినీతి మకిలి అధ్యక్షుడు సిరిల్ రామాఫోసాకు ఈసారి ప్రధాన అడ్డంకిగా మారేలా కన్పిస్తోంది. అధికారంలోకి వస్తూనే పూర్వ అధ్యక్షుడు జాకబ్ జుమా అవినీతిని క్షమించడం తీవ్ర వ్యతిరేకతకు దారి తీసింది. అధికారుల్లో పెచ్చరిల్లిన అవినీతి పరిస్థితిని ఏఎన్సీకి మరింత ప్రతికూలంగా మార్చిందంటున్నారు. విపక్ష డెమొక్రటిక్ అలయెన్స్ దానికి గట్టిపోటీ ఇచ్చేలా కన్పిస్తోంది.

అమెరికా

33 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న అగ్ర రాజ్యంలో అధ్యక్ష ఎన్నికలు ఎప్పుడూ ప్రపంచాన్ని ఆకర్షించేవే. అధ్యక్షున్ని ఎన్నుకోవడంతో పాటు ప్రతినిధుల సభలో మొత్తం స్థానాలతో పాటు సెనేట్లో మూడో వంతు సీట్లకు కూడా పోలింగ్ జరుగుతుంది. అయితే ఈసారి నవంబర్ 5న జరగనున్న ఎన్నికలపై మరింత ఆసక్తి నెలకొనేలా ఉంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెంపరితనమే అందుకు ఏకైక కారణం! 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని ఒప్పుకునేందుకు ఆయన ససేమిరా అనడం, తననే విజేతగా ప్రకటించాలంటూ మొండికేయడం తెలిసిందే. డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌ను అధ్యక్షునిగా ప్రకటించకుండా అడ్డుకునేందుకు ఏకంగా క్యాపిటల్ భవనంపైకి తన మద్దతుదారులను దాడికి ఉసిగొల్పారు ట్రంప్. ఆ కేసులో ఆయన దోషిగా తేలడం, ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హునిగా మారే ప్రమాదంలో పడటం విశేషం! ఈ గండం గట్టెక్కితే ట్రంప్ మరోసారి బైడెన్‌తోనే తలపడతారు.

ఘనా

3 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో డిసెంబర్ 7న ఎన్నికలు జరగనున్నాయి. వరుసగా రెండోసారి అధ్యక్షునిగా కొనసాగుతున్న ననా అకుఫో అడో స్థానంలో కొత్త నేతను ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. అధికార న్యూ పేట్రియాటిక్ పార్టీ, విపక్ష నేషనల్ డెమొక్రటిక్ కాంగ్రెస్ మధ్య ఈసారి హోరాహోరీ ఖాయమంటున్నారు.

బెంగాల్‌లో ఈడీ అధికారులపై దాడి

టీఎంసీ నేత ఇంట్లో సోదాలు జరుపుతుండగా ఘటన

అధికారులకు గాయాలు, వాహనాలు ధ్వంసం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) మద్దతుదారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై విచక్షణ రహితంగా దాడికి దిగారు. ఘటనలో అధికారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ పరిణామంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశాయి. అరాచకానికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని గవర్నర్ సీవీ ఆనంద బోస్ పేర్కొన్నారు. రేషన్ పంపిణీ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఈడీ అధికారులు సందేశ్‌ఖలిలోని టీఎంసీ నేత షేక్ షాజహాన్ ఇంట్లో సోదాలు జరుపుతున్నారు. అదే సమయంలో ఒక్కసారిగా అక్కడికి చేరుకున్న షాజహాన్ మద్దతుదారులు రెచ్చిపోయి ఈడీ అధికారులపై దాడికి తెగబడ్డారు. దాడిలో అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. షాజహాన్ అనుచరులు అధికారుల వాహనాల్నీ వదల్లేదు. వాటిని ధ్వంసం చేశారు. రక్షణగా వచ్చిన కేంద్ర పారామిలటరీ బలగాలపైనా దాడికి దిగారు. సోదాలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా సిబ్బందిపైనా దాడి చేశారు. వారి వాహనాల్ని తుక్కు చేశారు. గాయపడిన ఈడీ అధికారులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో అక్కడి నుంచి బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు అధికారులకు ఆస్పత్రిలో చికిత్స చేయించనున్నారు. రాష్ట్రమంత్రి జ్యోతిప్రియో మాలిక్‌కు షాజహాన్ సన్నిహితుడు. రేషన్ కేసులోనే గత ఏడాది మాలిక్ అరెస్టయ్యారు. షేక్ షాజహాన్‌పై ఢిల్లీలోని కేంద్ర కార్యాలయానికి నివేదిక పంపినట్లు ఈడీ అధికారి ఒకరు పీటీఐకి చెప్పారు. ఘటనతో సంబంధమున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రాష్ట్ర పోలీసులు చెప్పారు.



దాడిలో గాయపడిన ఈడీ అధికారి, దెబ్బతిన్న వాహనం

సందేశ్‌ఖలి ఘటనను రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తీవ్రంగా ఖండించారు. ఈడీ అధికారులపై దాడిని నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అనాగరిక చర్యను, విధ్వంసాన్ని ఆపాలని కోరారు. రాజ్యాంగానికి లోబడి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కేంద్ర అధికారులపై దాడి సమాఖ్య వ్యవస్థపై జరిగిన దాడిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రామాణిక్ పేర్కొన్నారు. ఘటనపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించి, రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ కోరారు.

తోకముడిచిన సొమాలియా పైరేట్లు

వాణిజ్య నౌక హైజాక్ యత్నాన్ని అడ్డుకున్న నేవీ కమాండోలు

న్యూఢిల్లీ: భారతీయ సిబ్బందితో కూడిన లైబీరియా సరుకు నౌకను హైజాక్ చేసేందుకు సొమాలియా సముద్రపు దొంగలు చేసిన ప్రయత్నాన్ని భారత నేవీ కమాండోలు చాకచక్యంగా తిప్పికొట్టారు. అందులోని 15 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 21 మందిని కాపాడారు. ఎంవీ లిలా నార్‌ఫోక్ అనే ఓడను ఈ నెల 4వ తేదీన అరేబియా సముద్ర జలాల్లో ఉండగా సాయుధ దుండగులు హస్తగతం చేసుకున్నారు. ఆపదలో ఉన్నామని, ఆదుకోవాలంటూ ఓడ సిబ్బంది యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైం ట్రేడ్ ఆపరేషన్స్(యూకేఎంటీవో) పోర్టల్‌కు సమాచారం అందించారు. అందులో 15 మంది వరకు భారతీయ సిబ్బంది ఉన్నట్లు తెలియడంతో భారత నేవీ అప్రమత్తమైంది. ఆ ప్రాంతానికి ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకకు హుటాహుటిన పంపించింది. పైరేట్లను లొంగిపోవాలని హెచ్చరికలు చేస్తూ ఎంవీ లిలా నార్‌ఫోక్‌ను శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఐఎన్ఎస్ చెన్నై అడ్డగించింది. సుశిక్షితులైన కమాండోలతో కూడిన అత్యాధునిక గస్తీ హెలికాప్టర్ పి–81ను సైతం అధికారులు సిద్ధంగా ఉంచారు. నౌకలోని పరిస్థితులను దగ్గర్నుంచి అంచనా వేసేందుకు అత్యాధునిక ఎంక్యూ9బీ ప్రిడేటర్ డ్రోన్‌ను రంగంలోకి దించారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పైఅధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ అందగానే కమాండోలు ఎంవీ లిలా నార్‌ఫోక్‌లోకి మెరుపు వేగంతో ప్రవేశించారు. వారిని చూసి పైరేట్లు తోకముడిచారు. గస్తీ సిబ్బంది ఇచ్చిన గట్టి హెచ్చరికలతోనే వారు భయపడి, నౌకను హైజాక్ చేసే ప్రయత్నాన్ని విరమించుకుని, పలాయన మంత్రం పఠించారని నేవీ ప్రతినిధి కమాండర్ వివేక్ మధ్వాల్ చెప్పారు. నౌకలో విద్యుత్ వ్యవస్థను, చోదక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. అన్ని పూర్తయ్యాక నౌక ప్రయాణాన్ని మళ్లీ కొనసాగించనుందన్నారు. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకల స్వేచ్ఛా యానానికి అనువైన వాతావరణం కల్పించేందుకు ఇతర దేశాల భాగస్వామ్యంతో పనిచేసేందుకు నేవీ కట్టుబడి ఉంటుందని వివరించారు. సముద్ర దొంగల బారి నుంచి తమ నౌకను రక్షించిన భారత నేవీకి లిలా గ్లోబల్ సీఈవో స్టీవ్ కుంజెర్ ధన్యవాదాలు తెలిపారు. ఇలా ఉండగా, ఇజ్రాయెల్–హమాస్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రభావం నౌకా రవాణాపైనా పడింది. 21 మంది భారతీయ సిబ్బందితో కూడిన ఎంవీ చెమ్ ప్లుటో నౌకపై డిసెంబర్ 23న భారత పశ్చిమ తీరంలో డ్రోన్ దాడి జరిగింది. భారత్ వైపు వస్తున్న మరో నౌకపై ఎర్ర సముద్రంలో డ్రోన్ దాడి జరిగింది.

ఫ్యూయల్ సెల్ పరీక్ష సక్సెస్: ఇస్రో

బెంగళూరు/హైదరాబాద్: భవిష్యత్తులో అంతరిక్షంలో ఉపగ్రహాలు తదితరాలకు నిరంతర ఇంధన సరఫరాలో కీలకం కాగల ఫ్యూయల్ సెల్ పనితీరును విజయవంతంగా పరీక్షించినట్టు భారత అంతరిక్ష సంస్థ ఇస్రో పేర్కొంది. ''జనవరి 1న పీఎస్ఎల్వీ–సి58 ద్వారా భూ దిగువ కక్ష్యలోకి చేర్చిన ఫ్యూయల్ సెల్ ఆధారిత ఇంధన వ్యవస్థ (ఎఫ్‌సీపీఎస్)లోని పాలీమర్ ఎలక్ట్రోలైట్ మెంబ్రేన్ పరీక్ష విజయవంతమైంది. దీనిద్వారా కొద్ది సమయం పాటు 180 వాట్ల విద్యుదుత్పత్తి జరిగింది'' అని శుక్రవారం తెలిపింది. సంప్రదాయ బ్యాటరీ సెల్స్‌తో పోలిస్తే ఈ ఫ్యూయల్ సెల్స్‌కు చాలా తక్కువ ఖర్చవుతుంది. పైగా ఇవి అధిక సామర్థ్యంతో పని చేస్తాయి. పూర్తిగా పర్యావరణహితం కూడా. వీటిని అంతరిక్షంతో పాటు భూమిపై కూడా పలురకాలుగా వాడుకోవచ్చు'' అని వివరించింది. భావి అంతరిక్ష ప్రయోగాలకు అవసరమైన డిజైన్లపై అవగాహనకు వచ్చేందుకు తాజా పరీక్ష దోహదపడుతుందని చెప్పింది. కృష్ణబిలాలపై పరిశోధనల నిమిత్తం జనవరి 1న ప్రయోగించిన ఎక్స్‌పోశాట్ బాగా పని చేస్తోందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు.

అయోధ్య ఎయిర్‌పోర్టుకు మహర్షి వాల్మీకి పేరు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం, ప్రధాని మోదీ హర్షం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు–అయోధ్యధామ్' అని పేరుపెట్టాలన్న ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించాలని కూడా నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. రైల్వేలో 'సున్నా కర్బన ఉద్గారాల' లక్ష్యాన్ని సాధించడానికి అమెరికాతో ఒప్పందానికి అనుమతించింది. మారిషస్ భాగస్వామ్యంతో ఉమ్మడిగా బుల్లి ఉపగ్రహం అభివృద్ధికి అవగాహనా ఒప్పందానికి కూడా అంగీకరించింది.

'పృథ్వీ విజ్ఞాన్'కు ఆమోదం

ఎర్త్ సైన్సెస్ రంగంలో ఐదు వేర్వేరు పథకాల కింద పరిశోధనలకు, కేటాయించిన నిధుల వినియోగానికి ఉద్దేశించిన 'పృథ్వీ విజ్ఞాన్'కు కార్యక్రమానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని అమలుకు రూ.4,797 కోట్లు కేటాయించింది. ఇది ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది. వాతావరణం, సముద్రం, క్రయోస్ఫియర్, పోలార్ సైన్స్, సీస్మాలజీ, జియోసైన్సెస్ వంటి అంశాలపై పరిశోధనలు చేయనున్నారు. పృథ్వీ విజ్ఞాన్ కింద రీసెర్చ్ ప్రాజెక్టులను విదేశీ సంస్థలకు అప్పగించడానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. గయానా నుంచి ముడిచమురు కొనుగోలుతో పాటు హైడ్రో కార్బన్ రంగంలో పరస్పర సహకారానికి ఒప్పందం కుదుర్చుకునేందుకూ అంగీకరించింది. గయానాలో ముడి చమురు అన్వేషణ, ఉత్పత్తిలో భారతీయ కంపెనీలకు సైతం భాగస్వామ్యం కల్పిస్తారు.

ప్రపంచ దేశాలతో అయోధ్య అనుసంధానం: మోదీ

అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టాలన్న ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలపడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. దీన్ని వాల్మీకి మహర్షికి దేశ ప్రజల తరఫున ఘనమైన నివాళిగా అభివర్ణించారు. అయోధ్యను ప్రపంచ దేశాలతో అనుసంధానించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆప్ తరఫున రాజ్యసభకు మలివాల్

సంజయ్ సింగ్, ఎన్‌డీ గుప్తాలకు మళ్లీ అవకాశం

న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను రాజ్యసభకు నామినేట్ చేయనున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) ప్రకటించింది. అదేవిధంగా, పార్టీకే చెందిన రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్, ఎన్‌డీ గుప్తాలకు మరో విడత ఎగువసభ సభ్యులుగా కొనసాగించాలని నిర్ణయించింది. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఈ మేరకు ప్రకటించింది. హరియాణా రాజకీయాల్లో కీలకంగా ఉండాలన్న రాజ్యసభ ఎంపీ సుశీల్ కుమార్ గుప్తా అభిప్రాయం మేరకు ఆయన స్థానంలో స్వాతి మలివాల్‌కు మొదటిసారిగా అవకాశం కల్పిస్తున్నట్లు ఆప్ పేర్కొంది. ఆమె 2015లో ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. పార్టీ నిర్ణయం మేరకు శుక్రవారం సాయంత్రం డీసీడబ్ల్యూ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై ఆప్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయన వినతి మేరకు శుక్రవారం ప్రత్యేక కోర్టు..ఈ నెల 19న జరిగే రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు సంజయ్ సింగ్‌కు వెసులుబాటు కల్పించాలని జైలు అధికారులకు ఆదేశాలిచ్చింది.

కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు

ఉభయ కొరియా దేశాల మధ్య పరస్పరం కవ్వింపు చర్యలు

సియోల్: కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయ కొరియా దేశాలు పరస్పరం కవ్వింపు చర్యలకు దిగాయి. వివాదాస్పద సముద్ర సరిహద్దు వద్ద శుక్రవారం ఉదయం ఇరు దేశాల సైన్యాలు సముద్రంలోకి పెద్ద సంఖ్యలో ఆర్టిలరీ షెల్స్‌ను ప్రయోగించాయి. 2018లో కుదిరిన ఇంటర్–కొరియన్ మిలటరీ ఒప్పందాన్ని ఉత్తర కొరియా, దక్షిణ కొరియా ఉల్లంఘించాయి. తమ పశ్చిమ సరిహద్దు వద్ద ఉత్తర కొరియా దాదాపు 200 ఆర్టిలరీ షెల్స్ ప్రయోగించిందని దక్షిణ కొరియా సైనికాధికారులు వెల్లడించారు. ఉత్తర కొరియా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని, శాంతికి విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. గత ఏడాది కాలంలో కిమ్ జోంగ్ ఉన్ సైన్యం ఈ స్థాయిలో ఫైరింగ్‌కు పాల్పడడం ఇదే మొదటిసారి. ఉత్తర కొరియాకు దక్షిణ కొరియా సైన్యం సైతం ధీటుగా బదులిచ్చింది. ఆర్టిలరీ షెల్స్ ప్రయోగించింది. తాజా ఘటనతో రెండు దేశాల నడుమ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదం కనిపిస్తోంది. ఆయుధ పరీక్షలను ఉత్తర కొరియా మరింత ఉధృతం చేసే అవకాశం ఉందంటున్నారు. కొరియా ద్వీపకల్ప పశ్చిమ తీరంలో సముద్ర సరిహద్దును పూర్తిగా నిర్ధారించలేదు. ఇక్కడ ఘర్షణలు జరగడం పరిపాటిగా మారింది. 1999, 2002, 2009, 2010లో రెండు దేశాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి.

ఎన్‌కౌంటర్‌లో లష్కరే ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది హతమయ్యాడు. శుక్రవారం వేకువజామున దక్షిణ కశ్మీర్‌లోని చోటిగామ్ గ్రామంలో ముష్కరుల సంచారం ఉందన్న నిఘా సమాచారం మేరకు బలగాలు కార్డన్ సెర్చ్ చేపట్టాయి. దాక్కున్న ఉగ్రవాది ఒక్కసారిగా కాల్పులకు దిగాడు. ప్రతిగా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో హతమైన ఉగ్రవాదిని బిలాల్ అహ్మద్ భట్‌గా గుర్తించారు. చెక్ చొలాన్ ప్రాంతానికి చెందిన భట్ లష్కరే తోయిబాలో సభ్యుడు. ఘటనా స్థలి నుంచి ఏకే రైఫిల్‌తోపాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కుల్గామ్‌లోని సుద్సన్‌కు చెందిన ఫయాజ్(22) రాజ్‌పుటానా రైఫిల్స్ జవానుగా ఉండేవారు. బంధువు ఇంటికి పెళ్లికని వచ్చిన ఫయాజ్‌ను ఉగ్రవాదులు నిర్బంధించి 2017 మేలో కాల్చి చంపారు. ఈ ఘటనలో భట్ ప్రమేయం ఉన్నట్లు అప్పట్లో కేసు కూడా నమోదైనట్లు షోపియాన్ సీనియర్ ఎస్పీ తనుశ్రీ తెలిపారు. గ్రెనేడ్ విసిరి ఇద్దరు స్థానికేతర కార్మికులను చంపిన ఘటనలో భట్ హస్తముందని చెప్పారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శనివారం, 6, జనవరి, 2024



బెంగళూరు కంఠీరవ ఇండోర్ స్టేడియంలో 13వ రాష్ట్రస్థాయి పోస్టు కార్డుల బృహత్ ప్రదర్శన- కర్నాపెక్స్-2024 తపాల పండుగ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పురాతన కాలం నాటి స్టాంపుల ప్రదర్శనను చూడటానికి వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులు.

న్యూస్‌రీల్

కేఐఏలో రూ.1.29 కోట్ల బంగారు పట్టివేత



పట్టుబడ్డ బంగారం

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు అక్రమంగా విదేశాల నుంచి తరలిస్తున్న రూ.1.29 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 2 కేజీల 86 గ్రాముల బంగారం సీజ్ చేశారు. ఈనెల 4న మస్కట్ నుంచి కెంపేగౌడ ఎయిర్ పోర్టుకు వచ్చిన 11 మంది మహిళలు ఒక పురుషుడి నుంచి ఈ బంగారం మొత్తం స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద ఉన్న బంగారానికి తగిన ఆధారాలు లేకపోవడం, పన్ను చెల్లించక పోవడం వల్ల బంగారం సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. 12 మందిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

వన్యజీవుల వేటగాళ్ల అరెస్ట్



పట్టుబడ్డ నిందితులతో అటవీశాఖ అధికారులు

దొడ్డబళ్లాపురం: జింకలను వేటాడుతున్న కనకపుర తాలూకా అరళాలు గ్రామానికి చెందిన గోవిందయ్య(71), చిక్కోళయ్య(61)ను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. శివనహళ్లి మెగా డెయిరీ వెనుక అటవీ ప్రదేశంలో నిందితులు నాటు తుపాకీతో జింకలను వేటాడారు. గస్తీలో ఉన్న అటవీశాఖ అధికారులు గమనించి నిందితులను పట్టుకున్నారు. జింక చర్మాలు, జింకల మాంసం, టార్పల్, నాటు తుపాకీ, వెయిట్ స్కేల్ స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్ర ప్రజలకు త్వరలో కరెంట్ షాక్ ?

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విద్యుత్ చార్జీలు పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. యూనిట్‌కు 50-60 పైసలు పెంపునకు ఎస్కాంలు కేఈఆర్‌సీ ముందు ప్రతిపాదన పెట్టింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశం ఉంది. యూనిట్‌కు 49 పైసలు పెంచాలని డిసెంబరు చివరి వారంలో బెస్కాం ప్రతిపాదన చేసింది. దీని ప్రకారం ఉత్పత్తి, ఖర్చు, వ్యయం, నిర్వహణ నష్ట నివారణకు చార్జీలు పెంచాలని కేఈఆర్‌సీ నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి విద్యుత్ చార్జీలు పెంపు అమలు చేసే అవకాశం ఉంది. నాలుగు ఎస్కాంల నుంచి 50-60 పైసలు పెంచాలని ప్రతిపాదన అందించింది.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

- హెచ్‌ఎం సస్పెండ్

మైసూరు: విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన ఆరోపణలపై మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా దాసనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ నియోజకవర్గం దాసనూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రకాశ్ అనే ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇతను పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం తెలుసుకున్న హెచ్‌ఎం పరారయ్యారు. విద్యాశాఖ అధికారి శివలింగయ్య పాఠశాలకు వచ్చి విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి హెచ్‌ఎంపై చర్యలకు సిఫార్సు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

డీకే శివకుమార్‌పై విచారణకు అనుమతివ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ

బనశంకరి: డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారణ చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. వివరాలు.. డీకే శివకుమార్ అక్రమాస్తులు కలిగి ఉన్నట్లు ఆయన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసు నమోదైంది. దీనిపై అప్పటి బీజేపీ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న యడియూరప్ప సీబీఐ దర్యాప్తునకు ఆదేశించారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డీకే శివకుమార్ కేసును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. డీకే.శివకుమార్‌పై సీబీఐ విచారణ ఆదేశాలు వెనక్కి తీసుకున్న ప్రభుత్వ చర్యను ప్రశ్నిస్తూ బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడపాటిల్ యత్నాళ్ పిటిషన్ వేశారు. మరో వైపు డీకే శివకుమార్ కేసును విచారణ చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ కూడా హైకోర్టులో వేసిన పిటిషన్ దాఖలు చేసింది. కాగా ఈ విషయంపై స్పందించిన డీకే.శివకుమార్... సీబీఐకి పిటిషన్ వేసే హక్కు ఉంది. మేము కూడా కోర్టులో వాదనలు వినిపిస్తామని, తనకు కోర్టుపై గౌరవం ఉందన్నారు.

సిరిధాన్యాలకు ప్రాధాన్యత

- సీఎం సిద్దరామయ్య
- బెంగళూరు ప్యాలెస్‌లో ఘనంగా ప్రారంభమైన సిరిధాన్యాల మేళా



మేళాలో సిరిధాన్యాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన దృశ్యం



హాజరైన సిరిధాన్యాల సాగు రైతులు



సిరిధాన్యాలతో నమూనా రైతు దంపతుల ఒడి నింపుతున్న సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: ఆరోగ్య సముపార్జనకు ప్రతి ఒక్కరూ సిరిధాన్యాల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. నగరంలోని బెంగళూరు ప్యాలెస్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న 'సిరిధాన్యాల, సేంద్రియ -2024' అంతర్జాతీయ వాణిజ్య మేళాను శుక్రవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్య ఆహార పద్ధతిలో సిరిధాన్యాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎగుమతి స్థాయిని పెంచే లక్ష్యం నేపథ్యంలో వ్యవసాయ శాఖ, రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల సంస్కరణ, ఎగుమతి మండలి సంస్థ సహకారంతో 'సిరిధాన్యాలు, సేంద్రియ -2024' అంతర్జాతీయ వాణిజ్య మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరిధాన్యం వినియోగం సుస్థిర ఆహార వ్యవస్థకు బాటలు వేస్తుందన్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే పని జరగాల్సి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి మాట్లాడుతూ సిరిధాన్యాల ఉత్పత్తి, ఎగుమతి కార్యకలాపాలను రెండు నుంచి మూడింతలు పెంచటం, ఆరోగ్య దృష్టితో ప్రజలకు సిరిధాన్యాల అవగాహన కల్పించటం మేళా ప్రధాన ఉద్దేశమన్నారు. 2022-23వ సంవత్సరంలో రాష్ట్రం నుంచి రూ.36 కోట్ల విలువచేసే 7,764 మెట్రిక్ టన్నుల సిరిధాన్యం ఎగుమతి చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 15.61 లక్షల హెక్టార్లలో సిరిధాన్యాలు సాగులో ఉన్నాయన్నారు.

కుర్చీ లేక ఇబ్బంది పడిన రోహిణి సింధూరి

సిరిధాన్యాల అంతర్జాతీయ వాణిజ్య మేళాలో ఆహార సంస్కరణ, సాంకేతిక పరిజ్ఞాన శాఖ ప్రత్యేక కార్యదర్శి రోహిణి సింధూరికి వేదికపై కుర్చీ లభించక ఇబ్బందికి గురయ్యారు. ఆరంభంలో ముఖ్యమంత్రి కూర్చొన్న వరుసలో ఆమెకు సీటు కేటాయించారు. ఈ సమయంలో సీఎం కార్యాలయం సిబ్బందితో మాట్లాడేందుకు వెనుక సీటుకు వెళ్లినపుడు ఎమ్మెల్యే ఎస్.హెచ్.కోనరెడ్డి ఖాళీగా ఉన్న సింధూరి కుర్చీలో కూర్చున్నారు. ఆ తరువాత కార్యక్రమ వేదికపై నిలబడిన దృశ్యం కనిపించింది.

కరువు రైతులకు శోభాకరంద్లాజె భరోసా..

రాష్ట్రంలో తలెత్తిన కరువు పరిహారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహార నిధులు విడుదల చేయిస్తానని కేంద్ర వ్యవసాయ రాష్ట్ర శాఖ మంత్రి శోభా కరంద్లాజె భరోసానిచ్చారు. సిరిధాన్యాల వాణిజ్య మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు వినయ్ కులకర్ణి మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితి నెలకొన్నదని, కేంద్రం నుంచి నిధులు విడుదలకు డిమాండ్ చేయగా, మంత్రి ఈ భరోసానిచ్చారు.

యువకుడి అవయవదానం

- రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బ్రెయిన్‌డెడ్
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు
- గుండె, కాలేయం, మూత్రపిండాలు గ్రీన్ కారిడార్ ద్వారా తరలింపు

హుబ్లీ: ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన నాలుగు అవయవాల్లో మూడింటిని గ్రీన్ కారిడార్ ద్వారా గురువారం బెళగావి, హుబ్లీ ప్రైవేటు ఆస్పత్రులకు ఏకకాలంలో తరలించారు. స్థానిక ఎస్‌సీజేకేఎల్‌ఈ శుచిరాయి ఆస్పత్రి వైద్యుల బృందం ఈ సాధన చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లప్ప ఉద్దార అనే వ్యక్తి గత నెల 26న హుబ్లీ శుచిరాయి ఆస్పత్రిలో చేరాడు. అయితే చికిత్స ఫలించక ఈనెల 2న బ్రెయిన్‌డెడ్ అయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు మల్లప్ప అవయవాలను దానం చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు శుచిరాయి ఆస్పత్రిలో గుండె, కాలేయం, మూత్రపిండాలతో పాటు నాలుగు ప్రముఖ అవయవాలను తొలగించి వాటిలో మూడింటిని గ్రీన్ కారిడార్ ద్వారా బెళగావి, హుబ్లీలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు నిర్ణీత సమయంలోగా అందజేశారు. శుచిరాయి ఆస్పత్రిలో మూత్రనిపుణులు, అవయవ ఆపరేషన్ నిపుణులు డాక్టర్ భువనేష్ ఎన్ ఆరాధి, కన్సల్టెన్సీ నెఫ్రాలజిస్ట్, అవయవ మార్పిడి వైద్యుడు డాక్టర్ చేతన్ ముద్రబెట్టు ఈ సాధనలో పాల్గొన్నారు. బెళగావి, హుబ్లీలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు అవయవాలను తరలించేందుకు ఎలాంటి ట్రాఫిక్ లేకుండా నిర్ణీత సమయానికి అవయవాలను చేరవేశారు.

కామాంధ తండ్రి

- డీఎన్‌ఏ పరీక్షల నివేదికలో వెల్లడి

యశవంతపుర: బుద్ధిమాంద్యురాలైన కుమార్తెపై తండ్రి లైంగిక దాడికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చి బిడ్డకు జన్మ ఇచ్చింది. పోలీసులు ఆ ముగ్గురికి డీఎన్‌ఏ పరీక్షలు చేయగా ఆ కామాంధుడి ఘాతుకం నిజమని తేలింది. ఈ ఘటన బెళగావి జిల్లా బెళవట్టిలో వెలుగులోకి వచ్చింది. బుద్ధిమాంద్యురాలైన యువతి శరీరంలో మార్పులు రావడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు ఆశా కార్యకర్త ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆమె గర్భిణి అని తేలడంతో 2023 ఫిబ్రవరిలో బెళగావికి చెందిన స్వచ్ఛంద సంస్థ బెళగావి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతిని ఆశ్రయ కేంద్రంలో ఉంచగా శిశువుకు జన్మ ఇచ్చింది. బుద్ధమాంద్య యువతితో పాటు, ఆమె తండ్రి, శిశువుకు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించారు. ఆ నివేదిక పోలీసులకు అందింది. యువతి నాన్నే శిశువుకు తండ్రిగా బయట పడినట్లు బెళగావి నగర పోలీస్ కమిషనర్ సిద్దరామప్ప తెలిపారు.

కర సేవకుడి అరెస్ట్‌పై బీజేపీ ఆగ్రహజ్వాల

- ప్రతిపక్ష నేత అశోక్ నేతృత్వంలో ధర్నా

శివాజీనగర: కర సేవకుడు శ్రీకాంత్ పూజారి అరెస్ట్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష బీజేపీ పోరాటాన్ని తీవ్రతరం చేస్తోంది. తాను కరసేవకుడిని తనను కూడా అరెస్ట్ చేయాలనే అభియాన్‌ను రాష్ట్రమంతటా మరింత స్పీడు పెంచింది. శుక్రవారం బెంగళూరులోని కబ్బన్ పార్కులో శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ నేతృత్వంలో ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్బన్ పార్కు పోలీస్ స్టేషన్ ముందు చేరుకొన్న వందలాది మంది కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాన్ని అనుసరిస్తున్నదని మండిపడ్డారు. కార్యకర్తలు చేతిలో తాను కరసేవకుడిని, తనను కూడా అరెస్ట్ చేయాలనే నినాదంతో ప్లకార్డులు పట్టుకుని ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాలో ఎంపీ పీ.సీ మోహన్‌తో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు. మరోచోట మల్లేశ్వరం పోలీస్ స్టేషన్ ముంద భాగంలో ఎమ్మెల్యే సురేశ్ కుమార్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. తాను కూడా కరసేవలో పాల్గొన్నానని, తనను కూడా అరెస్ట్ చేయాలని, కర సేవకుడు శ్రీకాంత్ పూజారిని తక్షణమే విడుదల చేయాలని సురేశ్ కుమార్ డిమాండ్ చేశారు.

బీజేపీ ఆందోళనపై కాంగ్రెస్ ఎదురు దాడి

- సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య పోస్టర్లు విడుదల

శివాజీనగర: హిందూ కర సేవకుల అరెస్ట్‌ను ఖండిస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనలపై కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. తాను ఆర్‌టీజీఎస్ ద్వారా లంచం తీసుకున్నా. రూ.40 వేల కోట్ల అక్రమంలో భాగస్వామినయ్యా అయ్యా.. తనను కూడా అరెస్ట్ చేయండి అంటూ విజయేంద్ర ప్లకార్డు ప్రదర్శిస్తున్నట్లు పోస్టర్‌ను సోషల్ మీడియాలో కాంగ్రెస్ విడుదల చేసింది. బెంగళూరుతో పాటుగా రాష్ట్రమంతటా వివిధ పోలీస్ స్టేషన్ల ఎదుట ధర్నా చేపట్టిన బీజేపీ నాయకుల ఫొటోలను కాంగ్రెస్ నాయకులు పై విధంగా ఎడిట్ చేసి ఎక్స్ ఖాతాలో విడుదల చేశారు. అదేవిధంగా బీజేపీ నేత సీ.టీ.రవి ఫోటోను ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. నేను కారు డ్రైవ్ చేసి ఇద్దరిని హత్య చేశా. తనను కూడా అరెస్ట్ చేయండి అంటూ సీటీ రవి అంటున్నట్లు పోస్టర్‌ను కాంగ్రెస్ విడుదల చేసింది. సీ.టీ.రవిని అరెస్ట్ చేయాలంటే ఇవి కారణాలు కాదా అంటూ కాంగ్రెస్ ప్రశ్నించింది. అదేవిధంగా కే.ఎస్.ఈశ్వరప్ప ఫోటోను కూడా కాంగ్రెస్ ఎడిట్ చేసింది. తాను 40 శాతం కమిషన్ తీసుకొని కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ మృతికి కారకుడయ్యాను. తనను కూడా అరెస్ట్ చేయండి అంటూ రూపొందించిన ఫొటోను కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో విడుదల చేసింది. అదేవిధంగా లోక్‌సభలో పొగబాంబు వేసినవారికి పాస్‌లు ఇచ్చి సహకరించా అని ఎంపీ ప్రతాప్‌సింహ పేరుతో కాంగ్రెస్ పార్టీ మరో పోస్టర్‌ను విడుదల చేసింది. అదేవిధంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సిమెంట్ దొంగ అంటూ పోస్టర్ విడుదల చేసింది.

లంచం అడిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- డీసీఎం డీకే శివకుమార్

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ధైర్యంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. బెంగళూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ భవనంలో శుక్రవారం యలహంక, బ్యాటరాయనపుర, దాసరహళ్లి నియోజకవర్గాల ప్రజల నుండి ఫిర్యాదులు, విన్నపాలు స్వీకరించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇక్కడకు అధికారులు అందరూ వచ్చారని ప్రజలు తమ పనులు చేయించుకోవాలని, ప్రజల రుణం తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇంటి ముంగిటకు ప్రభుత్వం, సేవకు కావాలి సహకారం పేరున ఈ కార్యక్రమం అందుకే చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు అర్హులందరికీ చేరాలనేది తమ ఉద్దేశమని, అయితే మొబైల్ నంబర్, పలు టెక్నికల్ సమస్యల కారణంగా సుమారు 5 లక్షల మంది మహిళలకు గృహలక్ష్మి పథకం అందడంలేదన్నారు. రెవెన్యూశాఖ మంత్రి క్రిష్ణబైరేగౌడ మాట్లాడుతూ...అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యలు పరిష్కరించి, పథకాలు మారుమూల చివరి వ్యక్తి వరకూ అందాలనే సదుద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

గౌరవానికి భంగం కలగకుండా విధులు నిర్వర్తించాలి



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమిషనర్ దయానంద్

బనశంకరి: పోలీసు స్టేషన్లు, కోర్టులు ఆలయాల వంటివని, వాటి గౌరవానికి భంగం కలగకుండా పోలీసులు నిధులు నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. శుక్రవారం దణిసంద్ర సీఏఆర్ మైదానంలో నెలవారి కవాతులో దయానంద్ గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగర పోలీసు శాఖ 61వ వార్షికోత్సవంలోకి అడుగు పెట్టిందని, ఎటువంటి అసాంఘిక ఘటనలు చోటుచేసుకోకుండా 2023 శాసనసభ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించి ప్రశంసలు పొందారని, అదే విధంగా లోక్‌సభ ఎన్నికలను కూడా శాంతియుతంగా జరపాలన్నారు.

బెంగళూరు పోలీసులు స్ఫూర్తి..

రాష్ట్రంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, మహిళలు, పిల్లలు రక్షణ తదితర విషయాలపై పోలీస్ స్టేషన్లలో ఫైళ్ల నిర్వహణ, సమయస్ఫూర్తిగా వ్యవహరించి బెంగళూరు నగర పోలీసులు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా డిసెంబరులో ఉత్తమ విధులు నిర్వహించిన వివిధ స్థాయి పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆ భూమిని తిరిగి అప్పగించాలి

శివాజీనగర: బెంగళూరు-మైసూరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ (బీఎంఐసీ) కోసం స్వాధీనం చేసుకొన్న అదనపు భూమిని తిరిగి రైతులకు ఇవ్వాలని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్.డీ.దేవెగౌడ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సుమారు 7 వేల కోట్ల విలువ చేసే 13 వేల ఎకరాలకు పైగా భూమి తిరిగి రైతులకు ఇవ్వాలని అక్టోబరు 19న ముఖ్యమంత్రికి లేఖ రాశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న టీ.బీ.జయచంద్ర అధ్యక్షతన అసెంబ్లీ కమిటీలో బీఎంఐసీ పథకం అక్రమాల విషయాన్ని ప్రస్తావించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అయినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయడంలో సీఎంకు ఎందుకు కష్టంగా ఉందో తెలియడం లేదన్నారు. తాను పేదల పక్షమని నిత్యం మాట్లాడే సిద్దరామయ్య బీఎంఐసీ విషయంలో చర్యలు తీసుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు.

కరసేవకుడు శ్రీకాంత్ పూజారి విడుదల



హుబ్లీ: రాష్ట్రంలో కలకలం రేపిన హుబ్లీ నగరానికి చెందిన కరసేవకుడు శ్రీకాంత్ పూజారి అరెస్టుపై ఉవ్వెత్తున నిరసనలు వ్యక్తం కావడంతో ఎట్టకేలకు శుక్రవారం ఆయనను జామీనుపై విడుదల చేశారు. 31 ఏళ్ల క్రితం అయోధ్యలో జరిగిన ఘటనకు సంబంధించి నగరంలో చెలరేగిన ఘర్షణల్లో ఆయన్ను అరెస్టు చేశారు. ఆయనపై దాదాపు 16 కేసులున్నట్లు కూడా పోలీసు వర్గాలు వెల్లడించాయి. అయితే కక్షసాధింపు రాజకీయాల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకాంత్ పూజారిని అరెస్ట్ చేయించిందని ఆరోపిస్తూ బీజేపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. వివిధ కేసుల్లో అరెస్టు అయిన శ్రీకాంత్ పూజారిని విడుదల చేయాలని హుబ్లీ న్యాయస్థానంలో ఆయన తరపున న్యాయవాది వాదించారు. దీంతో ఆయనకు జామీను లభించడంతో విడుదలయ్యారు.

సంక్రాంతికి ఏపీఎస్ ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

బనశంకరి: బెంగళూరు నగరంలో నివసించే ప్రవాసాంధ్రుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూర్లకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని బెంగళూరు ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని ముఖ్య పట్టణాలైన విజయవాడ, నెల్లూరు, కడప, కర్నూలు, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, మదనపల్లితో పాటు ముఖ్యమైన పట్టణాలకు సాధారణ చార్జీలతో 11వ తేదీ నుంచి 13 తేదీ వరకు స్పెషల్ సర్వీసులు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు. అదేవిధంగా బెంగళూరు నగరంలో నివసించేవారికి కార్గో (లాజిస్టిక్) పార్శిల్ బుకింగ్ ఏజెన్సీ కోసం ఏపీఎస్‌ఆర్‌టీసీ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఎం ఈ-9731216688, ఏఎంటీ -9880540141, ఏటీఎం-9880540140 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సిఉంది.

క్లుప్తంగా

పుస్తకం ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న బిహార్ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్

బనశంకరి: కర్ణాటక , గోవా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టీఎస్.ధ్రువకుమార్ రాసిన దిబబల్స్ ఆఫ్ మెమోరి అనే పుస్తకాన్ని శుక్రవారం బెంగళూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బిహార్ గవర్నర్ రాజేంద్రఅర్లేకర్, విధానపరిషత్ సభాపతి బసవరాజహొరట్టి, పుస్తక రచయిత టీఎస్.ధ్రువకుమార్ విడుదల చేశారు.

సిద్ధరామేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించాలి



పాల్గొన్న అధికారులు

చింతామణి: శివయోగి సిద్ధరామేశ్వర జయంతి నిర్వహణపై టీపీ ఈఓ ఆనంద అధ్యక్షతన తాలూకా కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరసభ కమిషనర్ చలపతి మాట్లాడుతూ ఈ నెల 15న సిద్ధరామేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా భోవి సంఘం అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ సముదాయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పలుమార్లు కోరినా స్పందన లేదని ఆరోపిస్తూ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు.

వేటకొడవలితో భార్య హత్య

- పరాయి వ్యక్తితో ఫోన్లో మాట్లాడిందని కిరాతకం

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకాలో దారుణం చోటుచేసుకుంది. భార్య మరో వ్యక్తితో మొబైల్ ఫోన్‌లో మాట్లాడిందని భర్త ఆమెను వేటకొడవలితో కిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటన తాలూకాలోని రాంపురంలో జరిగింది. ప్రకాశ్ నిందితుడు. భార్య ప్రతి రోజు ఓ వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడటం గమనించాడు. ఆమెతో ఇదే విషయంపై తరచూ గొడవపడేవాడు. శుక్రవారం కూడా గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రకాశ్ వేటకొడవలి తీసుకుని భార్యపై దాడి చేశాడు. మెడ, చేయిపై నరికాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు విషయం గుర్తించి ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

తోటలో గుర్తు తెలియని శవం



వ్యక్తి మృతదేహం

చింతామణి: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. మాడికెరె క్రాస్, దొడ్డగంజూరు గ్రామ సమీపంలోని తన తోటలో శవం గుర్తించిన రైతు నారాయణస్వామి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. శవంపై గాయాలు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముంబై పోలీసుల పేరుతో టోకరా

మైసూరు: ముంబై పోలీసుల పేరుతో దుండగులు ఓ పరిశోధన విద్యార్థిని నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. మైసూరు సిద్దార్థనగరకు చెందిన అర్పిత బాధితురాలు. ఈమె మొబైల్‌కు ఫోన్ చేసిన దుండగులు తాము ముంబై పోలీసులమని చెప్పి, మీ ఆధార్‌కార్డు వినియోగించి వచ్చిన ఓ పార్సిల్ రిజెక్ట్ అయ్యిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని బెదిరించారు. విచారణ చేయాల్సి ఉంటుందని, రూ. లక్ష ఇస్తే ఇంటరాగేషన్ లేకుండా చేస్తామని బెదిరించారు. దీంతో బాధిత యువతి వారు చెప్పిన ఖాతాలకు రూ.98,887 నగదు పంపింది. అనంతరం మోసపోయినట్లు గుర్తించి సెస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పోస్టులు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ తనపై సామాజిక మాధ్యమాల్లో ఉంచిన పోస్టులను తొలగించాలని బీజేపీ నాయకుడు సీటీ రవి డిమాండ్ చేశారు. ఒక కారు ప్రమాదానికి సంబంధించి తనపై కాంగ్రెస్ పార్టీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారన్నారు. చిక్కమగళూరు–బెంగళూరు రహదారిలో ఉన్న అన్ని టోల్‌లో సీసీకెమెరాలను పోలీసులు పరిశీలించారని, కారును డ్రైవర్ నడపుతున్నట్లు గుర్తించారన్నారు. ఈ కారణంతోనే తనపై కేసు నమోదు కాలేదని తెలిపారు. ప్రస్తుతం తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తన పరువుకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టరని, వాటిని తొలగించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటానన్నారు.

కెనరా బ్యాంక్ డేటా అండ్ అనలిటిక్స్ సెంటర్ ఆవిష్కరణ



డేటా అండ్ అనలిస్టు సెంటర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు సీఎండీ సత్యనారాయణరాజు

సాక్షి బెంగళూరు: కెనరా బ్యాంక్ తన కొత్త డేటా అండ్ అనలిటిక్స్ సెంటర్‌ని బెంగళూరులో ప్రారంభించింది. సెంటర్, హబ్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్లాన్ చేయబడిన ఈ కేంద్రం ఇన్నోవేషన్ సహకారానికి మద్దతు ఇవ్వడానికి వీలుగా అత్యాధునిక సౌకర్యాలను అందించనుంది. ఈ సందర్భంగా బ్యాంకు సీఎండీ కె.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కలసి డేటా – అనలిటిక్స్ కేంద్రాన్ని ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. వినియోగదారుల సేవలను సులభతరం చేయడంతో పాటు భవిష్యత్తులో బ్యాంకింగ్ డేటా విషయంలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవడం తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. కృత్రిమ మేథస్సు (ఏఐ) మన జీవితాలను ఎన్నో విధాలుగా మెరుగుపరుస్తోందని, వ్యాపారాభివృద్ధి, డేటా సెక్యూరిటీ, గోప్యతలో కూడా ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డేటా లేక్‌హౌస్ అమలు, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ ప్లాట్‌ఫారమ్, క్లౌడ్‌లో డేటా లేక్‌ల భాగస్వామ్యంతో బ్యాంకు మార్పు ప్రయాణం మరో మైలురాయికి చేరుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఏఐ/ఎంఎల్ ద్వారా మంచి వినియోగదారుల అనుభవం, వ్యాపార ఉత్పత్తి, ఉద్యోగి నైపుణ్యం వంటి అంశాలలో అనేక విశ్లేషణలు కూడా చేయడం సాధ్యపడుతుందని తెలిపారు.

హ్యాకథాన్ ముగింపు..

బ్యాంక్ తన డేటా ఎనలిటిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేను కూడా నిర్వహించింది, ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న ఫైనలిస్టులు కస్టమర్ అనుభవం, మోసాల నివారణ, డిఫాల్ట్ ప్రిడిక్షన్ వంటి అంశాలపై పోటీ పడ్డారు. ఆయా గ్రూపులు వారి నమూనాలను ప్రదర్శించగా, వీటిని సాంకేతిక జ్యూరీ అంచనా వేసి, విజేతలకు ఆకర్షణీయమైన నగదు ప్రోత్సాహకాలు అందించింది. అక్టోబరు 20 నుంచి నవంబర్ 5 వరకు జరిగిన కెనరా బ్యాంక్ హ్యాకథాన్ ఈవెంట్‌లో 2,899 మంది పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో నుంచి 256 మంది సృజనాత్మక ఆలోచనలను తదుపరి దశకు వెళ్లేందుకు ఎంపిక చేశారు. నవంబర్ 13 నుంచి 30 వరకు, 24 నమూనాలు ప్రత్యేక పరిష్కారాలుగా ఉద్భవించాయి, తదుపరి ప్రదర్శనలకు మార్గం సుగమం చేసింది. డిసెంబర్ 5న, 11 ప్రోటోటైప్‌లు తమ సామర్థ్యాలను ప్రదర్శించాయి, అంతిమ షోడౌన్ కోసం 5 ఫైనలిస్టుల ఎంపికకు దారితీసింది. చివరగా, జనవరి 1, 2024న, ఈ టాప్ 5 పోటీదారులు ఫైనల్‌లో ఆకట్టుకునే ప్రెజెంటేషన్‌లను అందించారు.

రూ.5వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం



పరిశ్రమ ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎంబీ పాటిల్

యశవంతపుర: కర్ణాటక సోప్స్ పరిశ్రమ ఉత్పత్తులను 2030 నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్ చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు పరిశ్రమ అధ్యక్షుడు, భారీ పరిశ్రమల శాఖమంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. యశవంతపుర సమీపంలోని కర్ణాటక సోప్స్ పరిశ్రమలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, హెల్త్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మైసూరు మహరాజు, సర్ ఎం విశ్వేశ్వరయ్య స్థాపించిన కేఎస్‌డీఎల్ ఏటా రూ.12 వందల కోట్ల టర్నోవర్ సాధిస్తుందన్నారు. మైసూరు సోప్స్ ఉత్పత్తులను విదేశాల్లో విక్రయించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌ఎన్ వ్యాలీ నీరు రాలేదని ధర్నా



ట్రాక్టర్లలో వెళ్తున్న రైతులు

చిక్కబళ్లాపురం: హెచ్ఎన్ వ్యాలీ నీరు చెరువులకు రావడం లేదని జిల్లాలోని రైతు నాయకులు, రైతులు శుక్రవారం వందలాది ట్రాక్టర్లలో నగరంలోని మైనర్ ఇరిగేషన్ శాఖను ముట్టడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి భక్తరహళ్లి బైరేగౌడ మాట్లాడుతూ...హెచ్ఎన్ వ్యాలీ నీరు ప్రభుత్వం గుర్తించిన చెరువులకు రావడం లేదని, అనధికారికంగా పంపుసెట్లు ఏర్పాటు చేసుకుని నీరు వాడుకుంటున్నారని, దీంతో చెరువులకు నీరు రావడం లేదని మండిపడ్డారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం ఇరిగేషన్ శాఖలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు మునినంజప్ప, రామాంజినప్ప, మంజునాథ్ రమణరెడ్డి, మాళప్ప, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కర సేవకులపై ప్రభుత్వం దాడులు

- హెచ్‌డీ కుమారస్వామి

శివాజీనగర: కరసేవకులపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతున్నదని. ఇది సిగ్గుచేటైన విషయమని మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ కుమారస్వామి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుతం ఆయోధ్య ప్రారంభంపై దేశంలో చర్చ జరుగుతోంది. తమ రాష్ట్రంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నాం. రైతులు ఆత్మహత్య చేసుకొంటున్నారు. ప్రభుత్వానికి ఇలాంటిదానిపై ఆసక్తి లేదు. ఇటువంటి విషయాలను ముందుకు తీసుకొచ్చి విషయాన్ని డైవర్ట్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్రీకాంత్ పూజారి కేసు పెద్దది చేశారు. అన్ని కేసులు ముగిసిపోయాయని అన్నారు. ఈద్గా మైదానంలో గొడవలు జరిగినపుడు దేవెగౌడ ఎలా పరిష్కరించారనేది తెలుసు. ఈ ప్రభుత్వం వ్యతిరేకులపై దాడులు చేసే పని చేస్తున్నదని ఆరోపించారు. ప్రతాప్ సింహ సోదరులపై కేసు పెట్టి జైలుకు పంపారు. అధికార దుర్వినియోగం, తప్పుడు కేసుల ద్వారా కరసేవకుల అరెస్ట్ విషయమై సీఎం, హోం మంత్రి దానిని సమర్థించుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుణ్యం చేసిన వారు కర్ణాటకలో జన్మిస్తారు

శివాజీనగర: ఎవరు పుణ్యం చేస్తారో వారు కర్ణాటకలో జన్మిస్తారని, ఎవరు అధిక పుణ్యం చేస్తారో వారు కన్నడను మాతృభాషగా పొందుతారని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, నాడోజ డాక్టర్ మహేశ్ జోషి తెలిపారు. నగరంలోని కంఠీరవ క్రీడా మైదానంలో శుక్రవారం ఆరంభమైన నాలుగు రోజుల (జనవరి 5 నుండి 8 వరకు) 13వ రాష్ట్రస్థాయి పోస్ట్ కార్డుల మహా ప్రదర్శన, కర్నాపెక్స్–2024 తపాల చీటీల పండుగ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన ఆయన, కన్నడలో ధర్మప్రేమ, సౌభ్రాతృత్వం, సామరస్యత, మంచిది చెడ్డది ఉందన్నారు. ఇదే సమయంలో కర్ణాటక తపాలా శాఖ కర్ణాటక రత్న పునీత్ రాజ్‌కుమార్ పేరుతో తపాలా స్టాంప్‌ను విడుదల చేయటం ద్వారా తపాలా శాఖలో మొబైల్ యాప్ కూడా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీ పీ.సీ మోహన్, నిర్మాత అశ్విని పునీత్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

తుమకూరు: రాష్ట్రంలో మైనార్టీ విద్యార్థుల ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఇస్లామిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ఇండియా డిమాండ్ చేసింది. ఈ మేరకు సంస్థ సభ్యులు జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఇండియా అధ్యక్షుడు మహ్మద్ ఖలీల్ ఖాన్, కార్యదర్శి కార్యదర్శి మహ్మద్ ఖైఫ్, పదాధికారులు జిల్లా అధికారిని కలిసి ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

హోటల్ భోజనంలో బొద్దింక

బనశంకరి: బెంగళూరు నగరంలో పేరుపొందిన హోటల్లో వడ్డించిన ఒక వంటకంలో బొద్దింక వచ్చిన ఘటనపై నగరానికి చెందిన న్యాయవాది విధానసౌధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం రాజభవన్‌రోడ్డులో పేరుపొందిన హోటల్‌కు న్యాయవాది వచ్చి రోటీ, పన్నీర్ గ్రేవి ఆర్డర్ చేశాడు. కొంత తిన్న తరువాత గ్రేవిలో బొద్దింక అవశేషం బయటపడింది. హోటల్ సిబ్బందిపై న్యాయవాది ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది హోటల్ వంటగదిలోకి వెళ్లి వీడియో తీసి విధాన సౌధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేంద్ర విభాగ డీసీపీ హెచ్‌టీ శేఖర్ మాట్లాడుతూ... తిమ్మయ్య రోడ్డులోని హోటల్‌లో భోజనంలో బొద్దింక వచ్చిన ఘటనపై న్యాయవాది ఫిర్యాదు చేశారని, తాము సంబంధిత ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సమాచారం ఇచ్చామన్నారు. వీడియో తీస్తున్న సమయంలో హోటల్ సిబ్బంది దూషించారని, దీనిపై విచారణ చేస్తున్నామన్నారు.

ప్రజా సేవకు కట్టుబడి ఉన్నాం

బనశంకరి: ప్రజలే తమ పాలిట దేవుళ్లు, వారి సేవకు కట్టుబడి ఉంటామని డెప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. శుక్రవారం యలహంకలోని అంబేడ్కర్‌భవన్‌లో ఇంటి వద్దకే ప్రభుత్వం కార్యక్రమంలో డీకేశి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నేను ఒక్కడినే రాలేదని పోలీస్‌శాఖతో సుమారు 300 మంది అధికారులు మీ సేవలకు విచ్చేశారని, మీరు మాకు అధికారం ఇచ్చారని, మీరు రుణం తీర్చుకోవడానికి ఇక్కడికి వచ్చామని తెలిపారు. ప్రతినిత్యం ప్రజలు తమ సమస్యలు పరిష్కారం తమ ఇంటి వద్దకు వస్తున్నారని, దీనిని తప్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్, దాసరహళ్లి ఎమ్మెల్యే మునిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో క్రైస్ట్ విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

బొమ్మనహళ్లి : యలహంక సమీపంలో ఉన్న మణిపాల్ అకాడమి ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ తమ మొదటి ఎంఐక్యూ(బెంగళూరు ఇంటర్ స్కూల్ క్విజ్)ఫైనల్ పోటీలను శుక్రవారం గోవిందపురంలో ఉన్న బెంగళూరు క్యాంపస్‌లో నిర్వహించారు. వివిధ పాఠశాలలనుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. బెంగళూరు నగరంలోని క్రైస్ట్ అకాడమి విద్యార్థులు హ్యాన్సెల్ రిజు మ్యాథ్యూ, వరుణ్ గోయల్ విజేతలుగా నిలిచారు. వారికి ట్రోఫీతోపాటు 1,50,000 బహుమతి అందజేశారు. సిలిగురియ జిడి గోయెంకా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోనిత్ బోత్రా, కుశాగ్రాలు ద్వితీయ స్థానంలో నిలిచారు. మెమొంటో, రూ.లక్ష నగదు అందజేశారు. క్విజ్ మాస్టర్లుగా వెంకటేష్ వ్యవహరించారు. గ్రాండ్ ఫినాలెలో బెంగళూరు నగర, ఉత్తర, దక్షిణ, పశ్చిమతో పాటు ఉత్తర ప్రాంతాల నుంచి 24 మంది మధ్య తీవ్ర పోటీ జరిగింది.

మైసూరు వర్సిటీకి సిండికేట్ సభ్యుల నియామకం

మైసూరు: మైసూరు విశ్వవిద్యాలయ సిండికేట్‌కు ఆరుగురిని నామినేటెడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మైసూరులోని విజయనగర 3వ స్టేజ్‌కి చెందిన మహదేశు, మైసూరు తాలూకాలోని హంపాపుర సమీపంలోని క్యాతనహళ్లికి చెందిన నాగరాజు సి, ఇలావాల సమీపంలోని జెట్టిహుండి గ్రామానికి చెందిన డాక్టర్.బవసరాజు సి, మైసూరులోని బన్ని మండపం సీ లేఔట్‌కు చెందిన ప్రొఫెసర్ సి. షబ్బీర్ మహ్మద్ ముస్తఫా, మైసూరులోని మదువన లేఔట్ శ్రీరామపుర రెండవ స్టేజ్‌కు చెందిన డాక్టర్ శిల్ప జే, నంజనగూడు తాలూకా హారోపుర గ్రామానికి చెందిన నటరాజు హెచ్.ఎల్.లను సభ్యులుగా నియమించారు.

కేజీ బీన్స్ రూ.20కే విక్రయించిన రైతు

- దాడికి యత్నించిన వ్యాపారులు



వ్యాపారులకు సర్ది చెబుతున్న పోలీసులు

బాగేపల్లి : తన వ్యవసాయ ఉత్పత్తులను ఓ రైతు తక్కువ ధరకే విక్రయించడంతో వ్యాపారులు ఆయనపై దాడికి యత్నించారు. ఈఘటన చేళూరు కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం చోటు చెసుకుంది. బీన్స్‌కు మార్కెట్‌లో మంచి ధర ఉన్నా వ్యాపారులు రైతులనుంచి కిలో రూ.10 నుంచి రూ.15తో కొనుగోలు చేసి మార్కెట్‌లో రూ.60తో విక్రయిస్తున్నారు. వ్యాపారుల తీరుతో విసుగు చెందిన వెంకరమణ అనే రైతు తన బీన్స్ పంటను మార్కెట్‌కు తీసుకొచ్చి కేజీ రూ.20తో విక్రయించాడు. దీంతో వ్యాపారులు కన్నెర్ర చేసి రైతుపై దాడి చేసేందుకు యత్నించగా అక్కడే ఉన్న ఇతర రైతులు అడ్డుకున్నారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు.

పశుగ్రాసం, నీటి సమస్య రానీయొద్దు

మండ్య: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని అన్ని తాలూకాల్లో కరువు తీవ్రంగా ఉందని, తాగునీరు, పశువులకు గ్రాసం సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండ్య జిల్లా కలెక్టర్ కుమార్ అన్నారు. శుక్రవారం మండ్య నగరంలోని జిల్లా పంచాయతీ సమావేశం హాల్లో అధికారులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవిలో నీటి సమస్య రాకుండా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు.

'మలబార్' ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

సాక్షి బెంగళూరు: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేసింది. బెంగళూరులోని బసవనగుడి, కనకపుర, జయనగర, కగ్గలిపుర, బ్యాటరాయనపుర, అబ్బాస్ ఖాన్ పరిధుల్లోని డిగ్రీ కాలేజీలు, గవిపురంలోని 8 కళాశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను పంపిణీ చేసింది. మొత్తం 595 మంది విద్యార్థులకు రూ. 56.72 లక్షల ఉపకార వేతనాలను అందించింది. ఈ కార్యక్రమం బెంగళూరు గ్రామీణ పరిధిలోని కనకపుర పీయూ కాలేజీలో జరిగింది. ఎంపీ డీకే సురేశ్, రూరల్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు హెచ్‌కే శ్రీకాంత్, కనకపుర గ్రామీణ పీయూ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గదిగెప్ప హిత్తలమని తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: టీఏపీసీఎంఎస్ ఎన్నికల్లో పోటీ పడుతున్న జేడీఎస్, బీజేపీ మైత్రి అభ్యర్థులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం నగరంలోని కోలారమ్మ ఆలయంలో విశేష పూజలను జరిపారు. జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ తాలూకా రైతుల భవిష్యత్తును రూపొందించే టీఏపీసీఎంఎస్ ఎన్నిక ఈ నెల 7న ఆదివారం జరుగుతుంది. తాలూకాలోని సమాన మనస్కులు, జేడీఎస్, బీజేపీ సంయుక్తంగా పోటీ పడుతున్నాయి. 14 డైరెక్టర్ల స్థానాల్లో ఇప్పటికే 3 స్థానాలు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. మిగిలిన 11 స్థానాలకు సమర్థులను రైతులు ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ మైత్రి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. జేడీఎస్ నాయకుడు మల్లేష్‌బాబు, ఎస్ మునిరాజు, మునిస్వామి రెడ్డి, వీఎస్ రఘునాథ్, ఎల్ రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో సమస్యలకు చెక్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థులకు వ్యవసాయంపై సరైన అవగాహన కల్పించడానికి, అనేక సమస్యల పరిష్కారానికి క్షేత్ర పర్యటనలు ఎంతో ఉపయోగపడతాయని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సురేష్ తెలిపారు. ఆయన శుక్రవారం తిప్పేనహళ్లిలో ఏర్పాటు చేసిన వ్యవసాయ వస్తు ప్రదర్శనలో మాట్లాడారు. విద్యార్థులు రైతులతో కలిసి వ్యవసాయ కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. రైతులకు వ్యవసాయంలో అధిక దిగుబడి సాధనకు అనుసరించాల్సిన మార్గాల గురించి తెలియజేయాలన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డీడీ భవ్యరాణి, పట్టు పరిశ్రమ శాఖ డీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

లబ్ధిదారులకు రుణాల పంపిణీ



లబ్ధిదారులకు రుణాలు ఇస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ప్రభుత్వ పథకాల సక్రమ అమలుకు బ్యాంకు సిద్ధమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శిల్పారెడ్డి తెలిపారు. శుక్రవారం మావళ్లి జీపీలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసానికి సరైన దాఖలాలతో రుణాలు పొందవచ్చన్నారు. వ్యవసాయ అధికారి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి కృషి భాగ్య, ఫసల్ బీమా పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి నారాయణ స్వామి, ఉద్యాన శాఖ అధికారి సౌమ్య, లీడ్ బ్యాంకు అధికారిణి బీకే రేణుక తదితరులు పాల్గొన్నారు.

సంతేహళ్లి జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక



సంబరాల్లో పాల్గొన్న విజేతలు

మాలూరు: తాలూకాలోని సంతేహళ్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా మొటప్ప శెట్టి, ఉపాధ్యక్షుడిగా నిడఘట్ట గ్రామానికి చెందిన టీకే సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. సంతేహళ్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి మొటప్ప శెట్టి, శ్యామణ్ణ, ఉపాధ్యక్ష స్థానానికి వెంకటేశప్ప, టీకే సూర్యప్రకాష్ నామినేషన్ వేయగా మొటప్పశెట్టి అధ్యక్షుడిగాను, టీకే సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శివలింగయ్య వ్యవహరించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను పలువురు అభినందించారు.

స్వతంత్ర జీవితానికి వృత్తి కౌశల్యత పునాది



వస్తు ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈఓ కృష్ణమూర్తి

కోలారు: విద్యార్థులు వృత్తి కౌశల్యాలను పెంపొందించుకుని స్వతంత్ర జీవితానికి పునాదులు వేసుకోవాలని డీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం నగరంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వృత్తి విద్యా కలికోత్సవ వస్తు ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు వస్తు ప్రదర్శనల నిర్వహణ విద్యార్థుల స్వతంత్ర జీవితానికి ఎంతో ప్రేరణ అన్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు పాఠ్యేతర కార్యక్రమాలు కూడా సమగ్ర శిక్షలో భాగమన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఆసరా అయిన వృత్తి శిక్షణకు ప్రాధాన్యతనివ్వడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల పరిసర సంరక్షణలో ప్రముఖ పాత్ర వహించే వృత్తి శిక్షకుల పాత్ర విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో కీలకమన్నారు. ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మునియప్ప, ప్రధానోపాధ్యాయుడు విజయానంద్, నివృత్త ఉపాధ్యాయులు వెంకటేశప్ప, వృత్తి శిక్షకుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్కండేశ్వర్ పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించండి



మాట్లాడుతున్న నాగేంద్ర ప్రసాద్

కోలారు: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలను సాధించాలని టెన్త్ పరీక్షల నోడల్ అధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. శుక్రవారం తాలూకాలోని సుగటూరు సబరమతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మార్గదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదో తరగతిలో ప్రతి నిమిషం ఎంతో విలువైనదన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా నిరంతరం సాధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠ్యపుస్తకాలను చక్కగా చదివినప్పుడే అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలరన్నారు. చేతి వ్రాతను అభివృద్ధి చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఆశయాలు, ఉపాధ్యాయుల సూచనలకు అనుగుణంగా చదవాలని సలహా ఇచ్చారు. పాఠశాల పాలనాధికారి బి.వెంకటేష్, దొడ్డేగౌడ, ఉపాధ్యాయుడు రవి, నందిని, శాంతప్ప పాల్గొన్నారు.

దొంగ కోళ్లు కొన్నాడని గొడవ

- కత్తితో దాడికి దిగిన చికెన్‌షాప్ యజమాని



కత్తితో దాడి చేస్తున్న దృశ్యం

కోలారు: దొంగిలించిన కోళ్లను ఎందుకు కొన్నావని చికెన్ షాపు యజమానిని ప్రశ్నించినందుకు తనను ప్రశ్నించిన వ్యక్తిపై చికెన్ షాపు యజమాని కత్తితో దాడికి దిగిన ఘటన శుక్రవారం నగరంలోని అమ్మవారిపేటలో చోటు చేసుకుంది. నగరంలోని కొండరాజనహళ్లి జీపీలోని ఖాద్రిపురలో చాలా రోజులుగా భారీ సంఖ్యలో కోళ్ల దొంగతనం జరుగుతోంది. శుక్రవారం తెల్లవారు జామున యూ ట్యూబ్ ఛానల్ పాత్రికేయుడు కిరణ్ ఇంట్లోని కోళ్లు చోరీ అయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం కోళ్లు నగరంలోని అమ్మవారిపేటలోని తాజ్‌పీర్ మాంసం దుకాణంలో కోళ్లు కనిపించాయి. దీంతో కిరణ్ దుకాణం యజమాని తాజ్‌పీర్‌తో గొడవకు దిగాడు. తాజ్‌పీర్ వీటిని తనకు ఎవరు అమ్మారో తెలీదన్నాడు. ఇద్దరి మధ్య గొడవ పెరగగా తాజ్‌పీర్ ఏకంగా కిరణ్‌పై చికెన్ నరికే కత్తితో దాడికి దిగాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఎస్ఐ బాబు తాజ్‌పీర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

బనశంకరీదేవికి పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి, శాకంబరీదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమోహన్ ప్రత్యేక అర్చనలు, అభిషేకం నిర్వహించి బనశంకరీదేవి మూలవిరాట్ వివిధ పుష్పాలతో అలంకరణ, శాకంబరీదేవికి నిమ్మకాయలతో అలంకరణ చేపట్టి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

మంత్రికి టీటీడీ క్యాలెండర్ అందజేత



బొమ్మనహళ్లి: రాష్ట్ర రవాణా, దేవదాయ శాఖ మంత్రి రామలింగా రెడ్డిని శుక్రవారం ఉదయం నగరంలోని కోరమంగళలోని ఆయన కార్యాలయంలో బొమ్మనహళ్లి కాంగ్రెస్ నాయకులు కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరుమల శ్రీవారి క్యాలెండర్‌తో పాటు నూతన డైరీ, స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. వాసుదేవరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార సమితి సంయోజకులు వాసుదేవ తదితరులు ఉన్నారు.

సమస్యలపై చింతించొద్దు


శివశంకరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: సమాజంలో ప్రతి ఒక్కరికీ సమస్యలు ఉంటాయని, దీనిపై చింతించవద్దని మాజీ మంత్రి శివశంకరరెడ్డి అన్నారు. పట్టణంలోని సామర్థ్య సౌధలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి శుక్రవారం ఆయన సన్మానం స్వీకరించి ప్రసంగించారు. విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరమని తెలిపారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన 21 మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో జ్ఞానమందిర విద్యాసంస్థల ఆవులప్ప, ఆచార్య మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరత్నమ్మ, సిద్ద రాజు, గంగాధరప్ప,అధ్యక్షుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

7న శ్రీ లక్ష్మీ ఆదినారాయణ కల్యాణోత్సవం


వివరాలు వెల్లడిస్తున్న రమేష్

చిక్కబళ్లాపురం: శ్రీ గాయత్రి సేవాసమితి, శ్రీ గాయత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీదేవి కల్యాణమంటపంలో ఈనెల 7న శ్రీ లక్ష్మీ ఆదినారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీ గాయత్రి సేవా సమితి అధ్యక్షుడు ఎస్.ఎన్.రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. దాదాపు 3వేల మంది భక్తులు హాజరవుతారని, ఈమేరకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.లక్ష్మీ సహస్రనామం పూజల్లో పాల్గొనే భక్తులు రూ.వంద చెల్లిస్తే పూజ సామగ్రి అందజేస్తారన్నారు. సమావేశంలో అనిరుద్ విక్రం తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని అణచివేయండి


సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్న ఏడీజీపీ

శివమొగ్గ: జిల్లాలో రౌడీయిజాన్ని కఠినంగా అణచివేయాలని రాష్ట్ర ఏడీజీపీ హితేంద్ర శివమొగ్గ జిల్లా పోలీసులను ఆదేశించారు. శుక్రవారం శివమగ్గ నగరంలోని డీఏఆర్ మైదానంలో సేవా పరేడ్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి ఆయన మాట్లాడారు. నేరాలను నియంత్రించడంతో పాటు గూండాచట్టం అమలు చేయాలని, ప్రధానంగా మత్తు పదార్థాల రవాణా విక్రయాల లాంటి కేసులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన ఎస్పీ కార్యాలయం చేరుకుని కేసులు, నేరాల వివరాలను గురించి ఆరా తీశారు. అక్కడి నుంచి నగరంలో ఉన్న వినోభ నగర పోలీసు స్టేషన్‌కు చేరుకుని పరిశీలించారు.

అందాల హరితనగరి

- గార్డెన్ సిటీలో ఎన్నెన్నో విశేషాలు, ప్రత్యేకతలు
- విలక్షణ వాతావరణం, ప్రణాళిక నగరం

బనశంకరి: సిలికాన్‌సిటీ ఆఫ్ ఇండియాగా పేరు పొందిన బెంగళూరు నగరంలో టెక్నాలజీని మించిన విశేషాలు, ప్రత్యేకతలు ఎన్నో ఉన్నాయి. సాంస్కృతిక, చారిత్రక, కళాత్మక సహజ అందాలతో కూడిన ఎన్నో ప్రదేశాలు మీకు వినోదాన్ని అందించడంతో పాటు మీరు గడిపిన రోజుకు సంపూర్ణత చేకూరుస్తాయనడంతో ఎలాంటి సందేహంలేదు.

బెంగళూరు ప్యాలెస్...
మైసూరు మహారాజ వడయార్ 1878లో ఏర్పాటు చేసిన బెంగళూరు ప్యాలెస్ నగరంలోని అతిముఖ్యమైన పర్యాటక ప్రాంతంలో ఒకటిగా నిలిచింది. గోతిక్‌తరహా గాజు కిటికీలు, విక్టోరియన్ తరహా ఫర్నీచర్, అందంగా అలంకరించిన శిల్పాలు, పిట్టగోడలపై నిర్మించిన గోపురాలు, బలమైన టవర్లు, పచ్చదనంతో కూడిన లాన్‌లు ఇక్కడ పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటాయి.

టిప్పు సుల్తాన్ సమ్మర్ ప్యాలెస్..
మైసూరును గతంలో పాలించిన టిప్పుసుల్తాన్ వేసవి విడిదిగా ఈ భవనాన్ని వినియోగించేవారు. ఇక్కడ అద్భుతమైన కళారీతులను సందర్శించడం గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. 1971లో ఇండో ఇస్లామిక్ నిర్మాణశైలిలో రూపుదిద్దుకున్న ఈ భవనం నేటికీ చెక్కుచెదరకుండా మన కళ్ల ముందు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. టీక్‌వుడ్‌తో చేయబడిన నిర్మాణాలు, పైకప్పులు, స్తంభాలు, వాటిపై పూల ఆకృతులు భవనానికి మరింత అదనపు ఆకర్షణను కలిగిస్తాయి.

ఇస్కాన్ టెంపుల్
హరేకృష్ణ కొండపై ఉన్న ఈ ఆలయం శ్రీకృష్ణుడికి అంకితం చేయబడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇస్కాన్ ఆలయంలో ఇది ఒకటిగా చెప్పవచ్చు.


నగరంలోని అతి ముఖ్యమైన పర్యాటక ప్రాంతం బెంగళూరు ప్యాలెస్


బెంగళూరు మ్యూజియం

అందుకే ఈ ఆలయానికి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ ఆలయానికి నాలుగు గోపురాలు ఉండగా ఒక్కొక్క గోపురం గాజు పలకాలతో తీర్చిదిద్దారు. రాజగోపురం అని పిలువబడే ప్రధాన మందిరంలో రాధాకృష్ణుల విగ్రహాలు అందంగా అలంకరించబడి ఉంటాయి. మందిరం పై కప్పులపై అద్భుతమైన చిత్రాలు శ్రీకృష్ణుడి లీలలను వర్ణించారు. సందర్శకులకు ఎప్పుడూ స్వాగతం పలుకుతూ ప్రతిరోజు ప్రార్థనలు, సమావేశాలు నిర్వహిస్తారు.

లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్
బెంగళూరు నగరానికి మధ్యలో సహజమైన ప్రకృతి అందాలతో కూడిన ఒయాసిస్‌లా ఇది కనిపిస్తుంది. ప్రకృతిలో అనుసంధానం కావాలనుకునే వారికి లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్ సరైన గమ్యస్థానం. 19వ శతాబ్దం నాటి గ్లాస్‌హౌస్ ఈ ఉద్యానవనంలో ప్రధాన ఆకర్షణ. లండన్‌లో క్రిస్టల్ ప్యాలెస్ తరహాలో ఇది నిర్మించారు. లాల్‌బాగ్‌లో ఏడాదికి రెండుసార్లు ఫలపుష్ప ప్రదర్శనలు దేశవ్యాప్తంగా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్
చారిత్రక నేపథ్యం కలిగిన ఆధునిక కళలు నిధిగా అభివర్ణిస్తారు. 18వ శతాబ్దం నుంచి నేటి వరకు కళాత్మక చిత్రాలతో పాటు గొప్ప భారతీయ కళాకారులైన రవీంద్రనాథ్ ఠాగూర్, రాజారవివర్మ తదితర ప్రముఖులు గీసిన చిత్రాలను కూడా ఇక్కడ వీక్షించవచ్చు. ఇక్కడ నిరంతరం ఫిలిం స్క్రీనింగ్స్ జరుగుతుంటాయి.


కబ్బన్‌పార్కు
వాణిజ్య నగరమైన బెంగళూరుకు ప్రశాంతమైన వాతావరణం, పచ్చదనం ఆహ్లాదానికి చిరునామాగా కబ్బన్‌పార్కు నిలుస్తుంది. కబ్బన్‌పార్కు పచ్చనివాతావరణం మధ్య చక్కగా తీర్చిదిద్దబడిన రహదారులపై వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ చేసేందుకు అధికసంఖ్యలో విచ్చేస్తారు. వివిధ రకాల వృక్షాలు, అనేక రకాల పూలు, అక్వేరియం, చిన్నారుల ఆట స్థలాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.

బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం
ప్రకృతి అందాలు, జంతు ప్రదర్శనశాలతో పాటు దేశంలోని మొట్టమొదటి సీతాకోకచిలుకలు ఉద్యానవనాలను కలిగిన బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం. 104 కిలోమీటర్ల విస్తీర్ణంలో అద్వితీయమైన వృక్ష, జంతుజలాం కలిగిన ఈ ఉద్యానవనం ప్రకృతి ప్రేమికులకు ఒకస్వప్నంగా కనిపిస్తుంది. సీతాకోకచిలుకల ఉద్యానవనం, జంతు ప్రదర్శనశాల, పాములు ఉద్యానవనం, అక్వేరియం, పిల్లలు ఉద్యానవనం, మ్యూజియం, మొసలి ఉద్యానవనం, ఏనుగులు అభయారణ్యం, సఫారి పార్కులతో బెంగళూరులో పర్యాటక ప్రాంతంగా నిలిచింది.

హలసూరు చెరువు
నగర నడిబొడ్డున గల హలసూరు చెరువు బెంగళూరున గరంలో అతిపెద్ద సరస్సులో ఒకటి. 123.55 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ప్రశాంతమైన వాతావరణం మధ్య సెదతీరాలనుకునే వారికి ఇది సరైన గమ్యస్థానం. ఇక బెంగళూరు నగరంలో పురాతన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు కూడా ఉన్నాయి. గవిపుర గవిగంగాధరేశ్వరస్వామి దేవస్థానం, బసవనగుడి దొడ్డబసవణ్ణ, దొడ్డగణపతి, హలసూరు సుబ్రమణ్యేశ్వర తదితర వాటితో పాటు శివాజీనగర సెయింట్ బెసిలికాచర్చ్ ఎంతో ప్రసిద్ధి.


పురాతన దొడ్డబసవణ్ణ ఆలయం


ప్రపంచంలోని అతిపెద్ద ఇస్కాన్ ఆలయాల్లో ఇదొకటి


టిప్పు సుల్తాన్ సమ్మర్ ప్యాలెస్

నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్

- ప్రేమ పేరుతో యువతికి మోసం

మైసూరు: ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించి ఆమెపై అత్యాచారం చేసి నగ్న వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటన మైసూరు–బెంగళూరు రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ హోటల్లో చోటుచేసుకుంది. వివరాలు... హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న ప్రీతం పురాణిక్ అనే యువకుడు అక్కడే హోటల్లో పనిచేస్తున్న ఓ యువతి పట్ల స్నేహంగా ఉంటూ ప్రేమ పేరుతో నమ్మించాడు. ఆమెను గర్భవతిని చేశాడు. దీంతో ఆమె తనను పెళ్లి చేసుకోవాలని కోరింది. కొన్ని రోజుల తరువాత పెళ్లి చేసుకుంటానని చెప్పి అబార్షన్ చేయించాడు. బాధిత మహిళ నిలదీస్తుండటంతో ఆమె నగ్న వీడియోలు చూపి బెదిరింపులకు దిగాడు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడితో పాటు అతనికి సహకరించిన తండ్రిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఎన్ఆర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏనుగు దాడిలో రైతు మృతి

యశవంతపుర: ఏనుగు దాడిలో రైతు మృతి చెందిన ఘటన హాసన జిల్లా బేలూరు తాలూకా బిక్కోడు హోబళి కబ్బినమనెలో జరిగింది. బిక్కోడు హోబళిలో ఏనుగుల మంద సంచరిస్తున్నాయి. గురువారం రాత్రి 8 గంటల సమయంలో కబ్బినమనెలో నివాసం ఉంటున్న రైతు వసంతపై ఒంటి ఏనుగు దాడి చేయటంతో అతను అక్కడికక్కడే మృతి చెందారు. ఇక్కడ కాఫీతోటలో పని చేస్తున్న కార్మికులు, వాహనాల్లో వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని బేలూరు అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

బీజేపీ వ్యాఖ్యలపై హోం మంత్రి ఆగ్రహం

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకి అని బీజేపీ వ్యాఖ్యానించడాన్ని హోం మంత్రి పరమేశ్వర్ ఘాటుగా స్పందించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని ఎన్నుకున్న ఓటర్లలో అధికంగా హిందువులే ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎలా హిందూ వ్యతిరేకి ఎలా అవుతుందని ధ్వజమెత్తారు. దత్తపీఠం పోరాటకుల వ్యతిరేక కేసును రీఓపెన్ చేయడానికి యత్నిస్తున్నారనే ప్రశ్నకు అటువంటి ఏదీ లేదన్నారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న కేసులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమైతే రీఓపెన్ ఎలా అవుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

గౌరిబిదనూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం నగర సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు... నగరంలోని నాగప్ప బ్లాక్ సమీపంలోని ప్రశాంత్ నగరలో ఉంటున్న ఎస్ఎస్ శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం కారులో కదిరి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఇంటికి పది కిలోమీటర్ల దూరం ఉండగా బైకిస్టును తప్పించబోయి లక్ష్మీపురం గేట్ సమీపంలో సెంట్రింగ్ సామానులతో వస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో టాటాఏఎస్‌లో ఉన్న శివప్ప, గంగరత్నమ్మ, ప్రశాంత్ అనే వారికి స్వల్ప గాయాలయ్యాయి. కారులో వున్న ఎస్ఎస్ రెడ్డి భార్య లలితమ్మ (69) అక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ఎస్ఎస్ రెడ్డి (71)ని బెంగళూరు తరలించారు. కారు డ్రైవర్‌ను చిక్కబళ్లాపురం ఆస్పత్రిలో చేర్చారు. కారులో ఉన్న రఘునాథరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్ఎస్ రెడ్డి రెడ్‌క్రాస్ తాలూకా కోశాధికారిగా విధులు నిర్వహిస్తూ వున్నారు. సీఐ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


ప్రమాద దృశ్యం

వైభవంగా మహాలక్ష్మీదేవికి పూజలు

రొళ్ల: రొళ్ల మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని శుద్ధి చేసిన తర్వాత భక్తులు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు వడిబియ్యాన్ని అమ్మవారి కట్టి విశేష పూజలు చేశారు. ప్రత్యేక పూజ కావడంతో అమ్మవారిని కొలిచే చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు భక్తులు ఆలయ సమీపాన గల పాల బావిలో గంగ పూజను చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాన్ని అందించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూజ్యాయ రాఘవేంద్రాయ

బనశంకరి: శ్రీ గురురాఘవేంద్రస్వామి మఠంలో ప్రత్యేక పూజలు, అన్నదానం, నృత్యప్రదర్శన నిర్వహించారు. జయనగర ఐదోబ్లాక్‌లో వెలసిన శ్రీగురురాఘవేంద్రస్వామి మఠంలో మేనేజర్ ఆర్‌కే.వాదీంద్రాచార్య నేతృత్వంలో ప్రత్యేక పూజలు, మహామంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు గురురాయర సన్నిధికి దీప స్తంభాలను వితరణ చేశారు. సాయంత్రం ఉత్సవ కార్యక్రమంలో రథోత్సవం, పల్లకీ ఉత్సవం, గజరాజోత్సవం, తొట్టిల పూజ చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నివేదిత స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థుల నృత్య ప్రదర్శన కనువిందు చేసింది.


రాఘవేంద్రస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

పెళ్లి మండపంలో ప్రియురాలు ప్రత్యక్షం

- అప్పటికే మరొక యువతి మెడలో తాళి కట్టిన వరుడు
- కడుపు నొప్పి అంటూ వరుడు పరారీ

యశవంతపుర: వరుడు వధువు మెడలో తాళి కట్టే కార్యక్రమం పూర్తికాగానే పెళ్లి మండపంలోకి అతని ప్రియురాలు ప్రత్యక్షమైంది. ఈఘటన దక్షిణకన్నడ జిల్లా ఉళ్లాల తాలూకా బీరి గ్రామంలో జరిగింది. కేరళ కోజిక్కోడ్‌కు చెందిన అక్షయ్‌కు, మంగళూరుకు చెందిన యువతితో శుక్రవారం కర్ణాటక–కేరళ సరిహద్దు బీరిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వరుడు అక్షయ్ యువతి మెడలో తాళి కట్టాడు. అనంతరం పెద్ద హైడ్రామా చోటు చేసుకుంది. కల్యాణమండపంలోకి మాజీ ప్రియురాలు ప్రత్యక్షమైయింది. తనను ప్రేమించి మరొకరి మెడలో తాళి కడతావా అంటూ అక్షయ్‌ను నిలదీసింది. దీంతో అక్షయ్ హైడ్రామాకు తెరతీశాడు. తన కిడ్నీలో రాళ్లు ఉన్నాయని, నొప్పి మొదలైందని, తక్షణం ఆస్పత్రిలో చేర్చాలని హడావుడి చేశాడు. దీంతో బంధువులు అక్షయ్‌ను తమ వెంట తీసుకెళ్లారు.

కాగా ఏడాదిన్నర క్రితం ఓ పెళ్లి వెబ్‌సైట్ ద్వారా అక్షయ్‌కు మైసూరుకు చెందిన యువతి పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా ఒక్కటై అనంతరం ముఖం చాటేసినట్లు అక్షయ్‌పై ప్రియురాలు కేరళ పోలీసులకు డిసెంబర్ 26న ఫిర్యాదు చేశారు. అక్షయ్ బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా కోర్టు కొట్టేసింది. ఈవిషయాన్ని దాచిపెట్టిన అక్షయ్ జీరి గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకోవడం, అక్కడకు ప్రియురాలు రావడంతో వధువు, ఆమె తరపు బంధువులు నిశ్చేష్టులయ్యారు.

హోసూరు వార్తలు..

నిందితుడు లొంగుబాటు

క్రిష్ణగిరి: పెట్రోల్ బాంబ్ విసిరిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తిరుపత్తూరు జిల్లా వాణియంబాడికి చెందిన నిందితుడు మహమ్మద్‌సదాం శుక్రవారం కృష్ణగిరి కోర్టులో లొంగిపోయాడు. వివరాలు... వాణియంబాడి బస్టాండులో ఆంబూర్‌కు చెందిన తమిళ్‌అరవి బేకరీ నిర్వహిస్తున్నాడు. గత నెల 30న దుండగులు బేకరీపై పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. దీంతో బేకరీ కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. దుకాణాదారుడి ఫిర్యాదు మేరకు వాణియంబాడి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి మహమ్మద్‌వశీం, నర్మదన్‌ను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మహమ్మద్‌సదాం కోసం గాలిస్తుండగా అతను కోర్టులో లొంగిపోయాడు.

సేంద్రియ పద్ధతులు పాటించండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

కెలమంగలం: పంటల సాగులో రసాయన ఎరువులు, మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని కృషిమంగల్ స్వచ్చంద సంస్థ ప్రతినిధులు రైతులకు సూచించారు. డెంకణీకోట తాలూకా కెలమంగలం యూనియన్ జే.కారుపల్లి గ్రామంలో శుక్రవారం వ్యవసాయ నిపుణులు రైతులతో సమావేశమయ్యారు. రసాయన ఎరువులతో భూసారం తగ్గి భవిష్యత్‌లో పంటలు పండని పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఏటా భూసార పరీక్షలు నిర్వహించి అందుకు తగ్గట్టుగా ఎరువులు వినియోగించాలన్నారు. సంస్థ ద్వారా రాయితీ ధరలతో సేంద్రియ ఎరువులు అందజేస్తున్నామన్నారు. సంస్థ సీఈవో గవాస్కర్. ప్రీతి, రూపమనోజ్‌కుమార్, మోరహితశ్రీ, రాధాక్రిష్ణ, కేశవరెడ్డి, జే.కారుపల్లి, వెంకటాపురం, కామన పాళ్యం, శ్రీరామపురం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

అడవిలో ఏనుగుల హల్‌చల్



హోసూరు: హోసూరు, డెంకణీకోట అటవీ ప్రాంతాల్లో గత రెండు నెలలుగా ఏనుగులు సంచరిస్తూ అటవీ ప్రాంత ప్రజలను భయాందోళనలకు గురిచేస్తూ, రైతుల పంటపొలాలపై దాడులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల క్రితం డెంకణీకోట తాలూకా ఉడేదుర్గం అటవీ ప్రాంతం నుంచి శ్యానమావు అటవీ ప్రాంతానికి చేరుకొన్న 18 ఏనుగుల మంద ఆ ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఏనుగుల సంచారాన్ని అటవీ శాఖాధికార్లకు అందజేశారు. అటవీ శాఖ సిబ్బంది ఏనుగులను డెంకణీకోట వైపు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

గ్రంథాలయం ప్రారంభం

హోసూరు: తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాభివృద్ధి శాఖచే రూ. 1933 కోట్ల వ్యయంతో వివిధ పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అందులో భాగంగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పాతపేట బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన గ్రంథాలయం, హోసూరు కార్పొరేషన్ కామరాజ్‌కాలనీలో కొత్తగా నిర్మించిన గ్రంథాలయాన్ని శుక్రవారం ప్రారంభించి ప్రజల వినియోగానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరయు, ఎమ్మెల్యేలు వై.ప్రకాష్, మదియళగన్, హోసూరు మేయర్ ఎస్.ఏ సత్య, కమిషనర్ స్నేహ, ఉపమేయర్ ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు. హోసూరులో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి పారిశుధ్య కమిటీ అధ్యక్షులు ఎన్.ఎస్ మాదేశ్వరన్ అధ్యక్షత వహించి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నీరప్ప తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పిల్లలకు విషం ఇచ్చి చంపిన తండ్రి అరెస్ట్

క్రిష్ణగిరి: పిల్లలకు పురుగుల మందు పెట్టి చంపిన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకెళితే క్రిష్ణగిరి జిల్లా నాగరసంబట్టి సమీపంలోని తట్టకల్ గ్రామానికి చెందిన శివలింగం కొడుకు కడలరసుతో ధర్మపురి జిల్లా ఇలక్యంబట్టి గ్రామానికి చెందిన జననితో ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి కొడుకు దీవన్‌రాజ్, కూతురు నివంధిక ఆన్నారు. కొద్ది నెలలుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. దీంతో రెండు నెలల క్రితం జనని పుట్టింటికెళ్లిపోయింది. గ్రామపెద్దలు రాజీ చేయడంతో ఆమె తిరిగి కాపురానికి వెళ్లింది. అయితే డిసెంబర్ నెలలో కడలరసు తన భార్యా పిల్లలను సమీపంలోని కొండపై ఆలయానికి తీసుకెళ్లాడు. భార్యకు బలవంతంగా పురుగుల మందు ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆమె తప్పించుకొని కిందకు వచ్చింది. స్థానికులకు విషయం తెలియజేసి కొండపైకి చేరుకుంది. అప్పటికే కడలరసు తన ఇద్దరి పిల్లలకు పురుగుల మందు ఇచ్చి తాను కూడా తాగాడు. అస్వస్థతకు గురైన ముగ్గురినీ క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పిల్లలు ఇద్దరూ మృతి చెందారు. కడలరసు కోలుకోగా శుక్రవారం నాగరసంబట్టి పోలీసులు అరెస్ట్ చేశారు.

ఇంటిలో అగ్నిప్రమాదం

కెలమంగలం: తాలూకా కేంద్రం డెంకణీకోటలో ఓ ఇంటిలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన జగదీష్ (48) హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారంలో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఫ్రిడ్జ్, మంచం, బీరువా ఉన్న నగదు రూ. 15 లక్షల విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉచిత సైకిళ్ల పంపిణీ


విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న దృశ్యం

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సైకిళ్ల పథకంలో భాగంగా శుక్రవారం హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాల 303 మంది విద్యార్థులకు హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్.ఏ. సత్య శుక్రవారం సైకిళ్ల పంపిణీ చేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉపమేయర్ ఆనందయ్య, విద్యాకమిటీ అధ్యక్షుడు శ్రీధర్, కార్పొరేటర్లు అశోక్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్ర పర్యటన : బీఎస్‌వై

బనశంకరి: బీజేపీని మరింత బలోపేతం చేయడానికి త్వరలో రోజుకు రెండు జిల్లాల్లో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తానని మాజీ సీఎం యడియూరప్ప తెలిపారు. శుక్రవారం మల్లేశ్వరంలోని బీజేపీ కేంద్ర కార్యాలయం జగన్నాథభవన్‌లో బలవర్ధన కోసం బీమా సమావేశంలో యడియూరప్ప పాల్గొని మాట్లాడారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలోని అన్ని స్థానాలను గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రముఖులతో మాట్లాడామని విజయేంద్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత బీజేపీ నేతలు ఉత్సాహంతో పనిచేస్తున్నారని, లోకసభ ఎన్నికల్లో సత్తాచాటుతామన్నారు. సమావేశంలో ఎస్సీమోర్చా నూతన అధ్యక్షుడు ఎమ్మెల్యే సిమెంట్ మంజు, ఎంపీ మునిస్వామి, మాజీ కార్యదర్శి జగదీశ్ హిరేమని, అశ్వత్థ నారాయణ్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియంకు బాంబు బెదిరింపు

బనశంకరి: బెంగళూరు నగరంలోని విశ్వేశ్వరయ్య మ్యూజియంకు ఈ–మెయిల్ బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న నగర పోలీసులు విచారణ చేపట్టారు. బెదిరింపు మెయిల్ వచ్చిన వెంటనే మ్యూజియం మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో నగరంలో బాంబు బెదిరింపులు ఎక్కువయ్యాయి. కొద్ది రోజుల క్రితం ప్రైవేట్ పాఠశాలలకు బాంబు బెదిరింపు ఘటన మరవక ముందే మరోసారి బాంబు బెదిరింపు ఘటన జరగడంతో నగరంలో కలకలం రేపింది.



ఆకుకూరలు తినడం ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలుసు. అందుకే ఇంచుమించు అందరూ ఆకుకూరలు తింటారు. అయితే కొన్ని రకాల వ్యాధులకు గురి అయినపుడు కొన్ని రకాల ఆకుకూరలు తీసుకోవడం వల్ల కూడా శరీరానికి సమృద్ధిగా పోషకాలు సమకూరి రోగ నిరోధక శక్తి పెరిగి ఆ వ్యాధి నుంచి తేలికగా బయటపడొచ్చుననే విషయం మాత్రం అందరికీ తెలియదు. అందుకే ఏయే వ్యాధులకు ఏయే ఆకుకూరలు తినడం మంచిదో తెలుసుకుందాం.

ఆకు వైద్యం

కొన్ని రకాల అనారోగ్య లక్షణాలకు కొన్ని రకాల ఆకుకూరలు ఎంతో మేలు చేస్తాయి. అవేమిటో చూద్దాం...

అవిసె ఆకుకూర

• అవిసె ఆకులు రుచికి కారంగా... కొంచం చేదుగా ఉంటాయి. కడుపులోని నులిపురుగుల్ని హరించడంలో ఇవి అద్భుతంగా పనిచేస్తాయి • ఏకాదశి, శనివారం, శివరాత్రి వంటి ఉపవాసాల్లో ఉన్నవారు ఈ ఆకుకూరని తప్పకుండా తినాలి. దానివల్ల ఉపవాసం మూలంగా వచ్చిన నీరసాన్ని బాగా తగ్గించి, ఉత్సాహాన్నిస్తుంది. గాయాలకు, దెబ్బలకు ఇది మంచి మందు. దీని ఆకులు నూరి చర్మం మీద పట్టుగా వేస్తే తొందరగా తగ్గుతాయి. జలుబు, రొంప ఉన్నప్పుడు అవిసె ఆకుల రసాన్ని కొన్ని చుక్కలు ముక్కులో వేసుకుంటే రొంప, తలనొప్పి తగ్గుతాయి. చిన్నపిల్లలకు ఈ ఆకురసంలో తేనె కలిపి ఇస్తే మంచిది.

గంగపాయల కూర

• రుచికి పుల్లగా ఉండే ఈ ఆకు పాలకంటే, వెన్నకంటే మంచిది • దీనిలో ఎ, బి విటమినులు సమృద్ధిగా ఉన్నాయి. పాలకంటే, వెన్నకంటే కూడా జీవశక్తి అధికంగా ఉందని పరిశోధనలలో తేలింది. అదేవిధంగా రోగ నిరోధక శక్తి అధికం • ఈ కూరలో ఐరన్, కాల్షియం ఎక్కువగా ఉన్నాయి • రక్తహీనత ఉన్న వారు దీనిని తీసుకోవడం వలన చాలా మంచి ఫలితాలు ఉంటాయి • శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ అనే దుష్టపదార్థాలను తొలగించి బయటకి పంపడంలో దీనిని మించింది లేదు • ఎముకలు, దంతాల పెరుగుదలకు అది అత్యంత అవసరం • కుష్టు, మూత్రాశయంలో రాళ్లు వంటి సమస్యలతో బాధ పడేవారు ఈ కూరని ఆహారంలో భాగం చేసుకోవాలి • వెంట్రుకలకు బలాన్ని ఇస్తుంది.



కొత్తిమీర

• కొత్తిమీర కషాయంలో పాలు, పంచదార కలిపి సేవిస్తే రక్తంతో కూడిన మొలల వ్యాధి, అజీర్ణ విరేచనాలు, ఆకలి మందగించడం, కడుపులో గ్యాస్... వంటి సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది • కొత్తిమీర రసాన్ని చనుపాలతో కలిపి కళ్లలో వేస్తే నేత్రరోగాలు నయం అవుతాయి. కొత్తిమీరను వెచ్చచేసి కళ్ళకి వేసి కట్టినా సమస్య తీరుతుంది • కొత్తిమీర కషాయంలో పంచదార కలిపి పుచ్చుకుంటే బాగా ఆకలి పుట్టిస్తుంది • నోరు పూసినప్పుడు కొత్తిమీర రసంతో పుక్కిలిస్తే అద్భుతంగా పనిచేస్తుంది.

కరివేపాకు



• కరివేపాకును మన ఆహారంలో భాగం చేసుకోవడం వలన శరీరంలో కఫం, వాతం సమతుల్యంలో ఉంటాయి • విపరీతమైన జిగురుతో కూడిన విరేచనాలు కూడా కరివేపాకు తినడం వల్ల తగ్గుతాయి. కరివేపాకును ముద్దలా చేసి విషజంతువుల కాట్లకు, దద్దుర్లకు బ్యాండేజీలా కడితే సులువుగా తగ్గుతాయి • కరివేపాకు చెట్టు ఆకుల కషాయం కలరా వ్యాధిని నివారిస్తుంది.

చామాకు



• చామ ఆకు కూర చాలా మంచిది. జబ్బుపడి లేచి నీరసపడిన వారికి ఈ ఆకుకూర అద్భుతంగా పనిచేస్తుంది • పైల్స్‌తో బాధపడేవారు దీనిని తీసుకోవడం చాలా మంచిది • మూత్రవ్యాధులున్న వారికి మంచి మందు • నోటికి రుచి తెలియకపోవడం వంటి సమస్యని నివారిస్తుంది • ఆకలి పుట్టిస్తుంది • ఈ ఆకుని పైన వేసి కట్టు కడితే గాయాలు మానతాయి.

కామంచి ఆకు కూర




• చాలా చిన్న సైజులో అంటే కంది గింజంత సైజులో ఉండే కామంచి పళ్లని చాలామంది తింటారు. అయితే దీని ఆకులు నూరి ముద్దగా చేసి కట్టుకుంటే నొప్పులు తగ్గుతాయి. ఇదే ముద్దని చర్మం పైన రాసి నలుగు పెట్టుకుంటే చర్మసంబంధమైన సమస్యలు తగ్గుముఖం పడతాయి • శరీరం ఉబ్బుతో కూడి ఉన్న వ్యక్తులకు ఈ ఆకుకూర అద్భుతంగా పనిచేస్తుంది • కామంచి ఆకుల రసాన్ని చెవిలో పిండుతూ ఉంటే చెవిపోటు తగ్గి చీముని కూడా హరిస్తుంది.

గుంటగలగర



• జుట్టు సమస్యలకు వాడే మందుగా మాత్రమే ఇది అందరికీ తెలుసు కానీ, దీనిని లోపలికి తీసుకోవడం వల్ల శరీరంలోని వాత, కఫాలను పోగొడుతుంది • దంతాలకు, చర్మానికి చాలా మంచిది • తలనొప్పి, వాపు, దురదలని నివారిస్తుంది • హెర్నియా, ఆయాసం, పొట్టలోని క్రిములు రుమాటిజం, భయంకరమైన రక్తక్షీణత , గుండెజబ్బు, చర్మరోగం వంటి వాటికి బాగా పని చేస్తుంది • గుంటగలగర నేత్రాలకు చలువచేస్తుంది. ఈ ఆకుపసరు సాయంతో తయారైన కాటుక పెట్టుకోవడం వలన కంటిజబ్బులు నయం అవుతాయి • చెవిపోటుగా ఉన్నప్పుడు ఈ ఆకుపసరు ఒకటి రెండు చుక్కలు చెవిలో వేస్తారు. • గుంటగలగర జ్వరాన్ని తగ్గిస్తుంది .

గోంగూర



• గోంగూర ఆకులనే కాకుండగా పువ్వుల్ని కూడా పచ్చడి చేసుకుంటారు • రేజీకటి రోగం కలవారికి ఈ కూర చాలా మేలు చేస్తుంది • గోంగూర ఉడికించిన నీళ్ల తాగుతూ చప్పిడి పథ్యం చేస్తే ఉబ్బురోగాలు తగ్గుతాయి • గోంగూరను నేతితో ఉడికించి వృషణాలకు కడితే వరిబీజాలు నయం అవుతాయి • బోదకాలు వ్యాధి ఉన్నవారు వేపాకుతో పాటు గోంగూరని నూరి కాళ్లకు కడితే గుణకారిగా ఉంటుంది.



మీరు ఎంత సానుకూలం?

సాటివారిపట్ల ప్రేమ, అనురాగం, అభిమానం, ఆప్యాయత వంటి గుణాలు కలిగున్న మనిషి ఆరోగ్యంగా ఉంటాడని మనస్తత్వ శాస్త్రవేత్తలతోపాటు వైద్యులు కూడా చెబుతున్నారు. అలాగే .... సానుకూలమైన అనుభూతులతో ఉన్న మనిషిలో తెల్ల రక్తకణాలు వృద్ధి చెంది, వ్యాధికారక క్రిములు పెరగకుండా నిరోధిస్తాయి. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

కోపం, ద్వేషం, దుఃఖం, విచారం, అసూయ వంటి ప్రతికూల భావోద్వేగాలు మనిషిని మానసికంగా ఒత్తిళ్లు, ఆందోళనలకు గురిచేసి తెల్ల రక్తకణాలను తగ్గిస్తాయి. ఫలితంగా మనిషి అనారోగ్యానికి గురవుతాడు. అందుకే మంచి ఆలోచనలు ఉంటే ఆనందంగా, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయి.

ఒంటరితనం వద్దు

ఒంటరిగా ఉన్న మనిషిలో ప్రతికూల ఆలోచనలు ఎక్కువ. ఫలితంగా మనిషిలో తెల్ల రక్త కణాలు తక్కువవుతుంటాయి. ఎన్నో శారీరక సమస్యలు మొదలవుతాయి. ఆహార విహారాలపై అవగాహన లోపిస్తుంది. శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉండవచ్చు. మనసు ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది. ఆ కారణంగా జ్ఞాపకశక్తి తగ్గుతూ అల్జీమర్స్ వంటి ఆరోగ్య సమస్యలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఒంటరిగా ఉన్నవారు ఏదో ఒక పనిలో నిమగ్నమైనప్పుడు మెదడు నిర్మాణాత్మకంగా పనిచేస్తూ, సానుకూల ఆలోచనలకు తెరలేపుతుందన్నది చికాగోలోని రష్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్ శాస్త్రజ్ఞుల సూచన. సానుకూల ఆలోచనల కోసం మెదడుకు తగు తర్ఫీదు ఇవ్వాలి.

ఇతరులతో మాట్లాడేటప్పుడు సానుకూల శబ్దాలు మాత్రమే ఉపయోగించే అలవాటు చేసుకోవాలి.. ఎవరికి వారు సానుకూల స్వయం సలహాలు ఇచ్చుకుంటుండాలి. ఆత్మవిశ్వాసంతో కూడిన మాటలు, చేతలకు మాత్రమే ప్రాధాన్యతనివ్వాలి. ఇతరుల పట్ల కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలి. తప్పులు జరిగినప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి. వైఫల్యాలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా గతంలో సాధించిన విజయాలను గుర్తుచేసుకుని, ప్రస్తుతం జరిగిన వాటిని విశ్లేషించుకోవాలి.

విజయాల బాటలో నడిచిన వారిని చూసి అసూయ చెందకుండా వారి నుంచి ప్రేరణ పొందడం అలవాటు చేసుకోవాలి. ప్రతికూల ఆలోచనలు వచ్చినప్పుడు... వాటిని సానుకూలం గా మార్చుకునే ప్రయత్నం చేయాలి. పెదవుల మీద చిరునవ్వు చెదరనీయకూడదు. మంచి జరగబోతోందని ఊహించుకోవాలి. ఉట్టి పుణ్యానికి బద్ధకంతో పనులు వాయిదా వేసే అలవాటు మానుకోవాలి.

సెల్ఫ్ రిలాక్సేషన్ పద్ధతి నేర్చుకునే ప్రయత్నం చేయాలి. ఇతరులతో ప్రేమగా వ్యవహరించడం.... నవ్వుతూ... నవ్విస్తూ ఉండడం వల్ల ఎంత పెద్ద జబ్బునైనా నయంచేసుకోవచ్చన్న నిపుణుల సలహాను పరిగణనలోకి తీసుకోవాలి. తీసుకునే ఆహారంతోనే ఆలోచనా విధానం ముడిపడి ఉందని అంటున్నారు నిపుణులు. తాజా పండ్లను, కూరగాయలను తినడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. కాబట్టి మంచి ఆహారాన్ని తీసుకోవడం అన్ని విధాలా మంచిది.

ప్రతికూల ఆలోచనలు వద్దు

నెగెటివ్ ఆలోచనల వల్ల ఆత్మవిశ్వాసం కోల్పోతారు. ఎదుటివాళ్లకి మన మీద నమ్మకం లేకుండా చేస్తాయి. ఇలాంటి ప్రతికూల ఆలోచనల నుంచి బయటపడటానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుందని చెబుతున్నారు మానసిక నిపుణులు.

ప్రతికూల ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని ఓ పుస్తకంలో రాసుకోవాలి. అవి మనం తీసుకొనే నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవాలి. అసలు ఇలాంటి ఆలోచనలు ఎందుకు కలుగుతున్నాయో కనుక్కోవాలి. వాటినుంచి బయట పడాలనే బలమైన తపన ఉండాలి. భవిష్యత్తు గురించి అతిగా ఆలోచించడం వల్ల ఫలితం ఉండదు. భవిష్యత్తు గురించి అసలు ఆలోచన చేయకుండా ఉండటం ఎంత తప్పో, భవిష్యత్తులో అలా జరుగుతుందేమో... ఇలా జరుగుతుందేమో అని అతిగా ఆలోచించడ కూడా అంతే తప్పు. దానివల్ల ఆరోగ్యం పాడవుతుంది. అందువల్ల అంతా మంచే జరుగుతుందనే ఆలోచన మంచిది.

ఎప్పుడైతే మనమీద మనకు నమ్మకం లేదో అప్పుడు ప్రతికూల ఆలోచనలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి అయేలా చేస్తాయి. అందువల్ల మనమీద మనకు ఇష్టం, గౌరవం, నమ్మకం ఉండేలా చూసుకోవడం అత్యవసరం. గతంలో సంభవించిన అపజయాలు, ఎదురైన చేదు అనుభవాల వల్ల ప్రతికూల ఆలోచనలు రావడం సహజం. అలాంటప్పుడు గతాన్ని మర్చిపోవాలి. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి.

మనల్ని మనం ప్రేమించుకోవాలి. సంతోషంగా ఉండడానికి ప్రయత్నించాలి. అప్పుడే మనం ఏడాదంతా కాదు.. ఎప్పటికీ ఆరోగ్యం గా ఆనందంగా ఉండగలుగుతాం.

మీకు తెలుసా?



వార్తలు వినడం, చదవడం, చూడడం ద్వారా మనచుట్టూ ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిందే. సామాజిక, రాజకీయ, మానవీయ కథనాల ద్వారా ప్రపంచంతో సంబంధం కలిగి ఉండాలి కూడా. అయితే మానవీయ కథనాలకంటే మనసును గాయపరిచే కథనాల మీద ఎక్కువగా దృష్టి పెట్టడం వల్ల మంచికంటే చెడు ఎక్కువగా ఉంటుంది. అలాంటి సంఘటనలను ఒక వార్తగా తెలుసుకోవడం వరకే పరిమితం చేయాలి. నేర కథనాలను చూసేటప్పుడు మనసు ఉద్వేగానికి లోనవుతుంది, ఆ మేరకు దేహంలో రక్తప్రసరణ వేగం పెరగడం, హార్మోన్‌లు ప్రభావితం కావడం వంటి మార్పులు చోటు చేసుకుంటాయి. క్రైమ్ వార్తల ఆధారంగా అల్లుతున్న సుదీర్ఘ కథనాలకు మన రోజులో ఎక్కువగా చోటివ్వకూడదని చెప్తున్నారు యూఎస్ ఆధారిత మేయో క్లినిక్ హెల్త్ సిస్టమ్ ప్రతినిధులు. పిల్లలు, వయసు మీరినవాళ్లు ఇంట్లో ఉన్న సమయంలో క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను పెట్టకూడదు. వీటివల్ల పిల్లలు తరచూ మానసిక ఆందోళనలకు లోనవుతుంటారు. పెద్దవాళ్లలో గుండె వేగం పెరిగిపోతూ ఉంటుంది. ఇలా రోజూ జరుగుతుంటే ఈ పరిస్థితి గుండె సమస్యలకు దారి తీస్తుంది. అందుకే లైఫ్ వెల్‌బీయింగ్‌కి క్రైమ్ స్టోరీలకు దూరంగా ఉండడం కూడా ప్రధానమే.

సినిమా



● 'అల్లరి' నరేశ్, నాగార్జున

కిష్టయ్య.. అంజి.. ఓ మంచి స్నేహం

"దేవుడే తన చేతితో రాసిన ఒక కావ్యం. అంజిది.. కిష్టయ్యది.... వీడదీయని ఒక బంధం.. చిరునవ్వులు పూసే స్నేహం.. చిరుగాలికి ఈలల పాఠం'' అంటూ సాగుతుంది 'నా సామిరంగ' సినిమాలోని 'విజిల్ థీమ్ సాంగ్'. నాగార్జున హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. ఈ సినిమాలో కిష్టయ్య పాత్రలో నాగార్జున, అంజి పాత్రలో 'అల్లరి' నరేశ్, భాస్కర్ పాత్రలో రాజ్ తరుణ్, వరలక్ష్మి పాత్రలో ఆషికా రంగనాథ్, కుమారి పాత్రలో రుక్సార్, మంగ పాత్రలో మిర్నా మీనన్ నటించారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం 'విజిల్ థీమ్ సాంగ్' లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. స్నేహం నేపథ్యంలో సాగే ఈ పాటకు ఈ చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి సాహిత్యం అందించగా, శాండిల్య పిసాపాటి పాడారు.

ఆ రేంజ్ ఎమోషన్ సైంధవ్‌లో ఉంది

- నిర్మాత వెంకట్ బోయనపల్లి



"హిట్' ట్రైలర్ చూసి, డైరెక్టర్ శైలేష్‌తో ఓ సినిమా చేయాలనుకున్నాను. వెంకటేశ్‌గారికి శైలేష్ కథ చెప్పారు. సాధారణంగా వెంకటేశ్‌గారితో సినిమా అంత సులభంగా వర్కౌట్ కాదని, సురేష్‌బాబుగారు కథల విషయంలో స్ట్రిక్ట్‌గా ఉంటారనే మాటలు వినిపిస్తుంటాయి. కానీ నేను ఇండియాలో విమానం ఎక్కి, అమెరికాలో దిగే సరికి 'సైంధవ్' సినిమా ఓకే అయ్యింది" అన్నారు వెంకట్ బోయనపల్లి. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన 'సైంధవ్' ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకట్ బోయనపల్లి చెప్పిన విశేషాలు.


● వెంకటేశ్–నానీగార్ల కాంబినేషన్‌లో మా బ్యానర్‌లో ఓ సినిమా చేయాలనుకున్నాను.. కుదర్లేదు. మా బ్యానర్‌లో తొలి సినిమాగా నానీగారు హీరోగా 'శ్యామ్ సింగరాయ్' తీశాం. ఇప్పుడు వెంకటేశ్‌గారి 75వ సినిమా 'సైంధవ్'ను నిర్మించడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఇక వెంకటేశ్–నానీగార్ల మల్టీస్టారర్ ఫిల్మ్‌కు మంచి కథ కుదిరితే నిర్మించడానికి రెడీగా ఉన్నాను. ● 'సైంధవ్'ను వెంకటేశ్, సురేష్‌బాబుగార్లు చూసి, హ్యాపీ ఫీలయ్యారు. కృష్ణా, గుంటూరు జిల్లా హక్కులను సురేష్‌గారే తీసుకున్నారు. ఈ సినిమా కథ విన్నప్పుడే భారీ ఖర్చుతో కూడుకున్నది అర్థమై, గ్రాండ్‌గా నిర్మించాం. 'సైంధవ్'ను చూసే ప్రేక్షకులు దాదాపు గంటసేపు కన్నీళ్లు పెట్టుకుంటారు. ఆ రేంజ్ ఎమోషన్ ఈ సినిమాలో ఉంది. ● పాన్–ఇండియా అంటూ కొంత బడ్జెట్ కేటాయించి మరీ ఇతర రాష్ట్రాల్లో ప్రమోషన్‌కు పరిగెడుతున్నారు. ఈ క్రమంలో తెలుగును మర్చిపోతున్నారు. కానీ మేం తెలుగుకు ప్రాధాన్యం ఇచ్చాం. 'కాంతార' వంటి కన్నడ చిత్రాలు ముందుగా మాతృ భాషలో విడుదలై, ఆ తర్వాత ఇతర భాషల్లోనూ హిట్ అయ్యాయి. ప్రస్తుతం నిర్మాతలకు పాన్ ఇండియా మార్కెట్ అంత లాభసాటిగా ఏం లేదు. మా వరకు ఓటీటీ, శాటిలైట్ బిజినెస్ బాగా జరిగింది. ఈ సంక్రాంతి రేసు నుంచి 'ఈగల్'ను వాయిదా వేయడం ఆ చిత్రం యూనిట్ గొప్పదనం.

చూపే పడితే మటాషే...!

శివ కందుకూరి హీరోగా నటించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. రాశీ సింగ్ హీరోయిన్. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముదుంబై నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో రిలీజ్ కానుంది. శుక్రవారం ఈ సినిమాలోని 'కేస్ ఏదైనా.. ప్లేస్ ఏదైనా.. చూపే పడితే మటాషే..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. పురుషోత్తం రాజ్, సురేష్ బనిశెట్టి ఈ పాట రాయగా, ఈ చిత్రం సంగీతం దర్శకుడు శ్రీ చరణ్ పాకాల పాడారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్.




● శివ కందుకూరి



● గోపీచంద్

బ్రహ్మరాక్షసుడు వచ్చాడ్రా...

ఫిబ్రవరిలో థియేటర్స్‌కు వస్తున్నాడు 'భీమా'. గోపీచంద్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా యాక్షన్ ఫిల్మ్ 'భీమా'. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో పోలీసాఫీసర్ భీమా పాత్రలో నటిస్తున్నారు గోపీచంద్. సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేసి, సినిమాను ఫిబ్రవరి 16న విడుదల చేయనున్నట్లుగా ప్రకటించారు. 'ఈ రాక్షసుల్ని వేటాడే బ్రహ్మరాక్షసుడు వచ్చాడ్రా' అనే వాయిస్ టీజర్‌లో వినిపిస్తుంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.



● శివ రాజ్‌కుమార్

రామ్‌చరణ్ సినిమాలో...

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని ఓ కీలక పాత్రకు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్‌ను సంప్రదించింది యూనిట్. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో భాగంగా శివ రాజ్‌కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారని సమాచారం.

వాళ్ల నాశనం కోరుకోనయ్యా...



● మమ్ముట్టి, జీవా

'ఏన్నా.. ఇంత రాత్రి అయినా నిద్ర పోకుండా ఈడ ఏం చేస్తున్నావన్నా' అంటూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రధారి జీవా డైలాగ్‌తో 'యాత్ర 2' టీజర్ విడుదలైంది. 'యాత్ర' వంటి హిట్ మూవీకి సీక్వెల్‌గా మహి వి. రాఘవ్ దర్శకత్వంలో రూపొందుతోన్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ నటుడు మమ్ముట్టి, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' ఫిబ్రవరి 8న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'మా వైఎస్ఆర్ కొడుకు వస్తున్నాడంట.. ఆయన కోసం ఎదురు చూస్తున్నానన్నా' (వైఎస్ఆర్ అభిమాని), 'కాదన్నా.. మీ వైఎస్ఆర్ కొడుకు వచ్చి మీ ముందు నిల్చున్నా మీకు కనపడదు కదా అన్న' (జీవా), 'నాకు ఆయన కనపడకపోయినా నేను ఆయనకు కనపడతా కదా అన్న, నాలాంటోళ్లు ఆయన వెనకాల ఉన్నామని తెలియడానికే నేను ఇక్కడున్నానన్నా' (వైఎస్ఆర్ అభిమాని), 'నా రాజకీయ ప్రత్యర్థినైనా, శత్రువునైనా ఓడించాలనుకుంటానే కానీ, మీ నాయకుడిలాగా వాళ్ల నాశనం కోరుకోనయ్యా' (వైఎస్ఆర్ పాత్రధారి మమ్ముట్టి) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు మహి వి. రాఘవ్. మహేశ్ మంజ్రేకర్, సుజానె బెర్నెర్ట్, కేతకీ నారాయణన్, 'శుభలేఖ' సుధాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మది, సంగీతం: సంతోష్ నారాయణన్.



● అవ్రామ్, విష్ణు మంచు

కన్నప్పలో మంచు వారసుడు అవ్రామ్

మంచు ఫ్యామిలీ వారసుడు అవ్రామ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్. ఈ సినిమాలో తన తనయుడు అవ్రామ్ మంచు నటించనున్నట్లుగా శుక్రవారం విష్ణు వెల్లడించారు. "సినిమా అనే విశ్వంలోకి 'కన్నప్ప' చిత్రంతో నా కొడుకు అవ్రామ్ వస్తున్నాడని చెప్పడానికి థ్రిల్లింగ్‌గా ఉంది. మంచు కుటుంబంలో మరో అధ్యాయం మొదలైంది. 'కన్నప్ప' సినిమాకు నా జీవితంలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఇది మా కుటుంబానికి చెందిన మూడు తరాల కలయికతో వస్తోన్న అరుదైన చిత్రం'' అన్నారు మంచు విష్ణు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్‌పై విష్ణు మంచు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానున్నట్లుగా తెలుస్తోంది.

లవ్ మౌళి నాకు దగ్గరగా అనిపించింది - నవదీప్



● పంఖురి, నవదీప్

''నా ఆలోచనా విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్ మౌళి' సినిమా దగ్గరగా అనిపించింది'' అని నవదీప్ అన్నారు. అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. పంఖురి గిద్వానీ, భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో జూక్ బాక్స్‌ని హీరో రవితేజ విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో ఈ సినిమాలోని పాటలను పాడిన వారితోనే పాటలను విడుదల చేయించారు.

ఒక్కొక్కరు ఒక్కో రకం

'ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి అని అన్నాడు ఓ మహాకవి' అని నటుడు–దర్శకుడు–రచయిత తనికెళ్ల భరణి చెప్పే డైలాగ్‌తో మొదలవుతుంది 'శ్రీరంగ నీతులు' సినిమా టీజర్. సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం ఇది. ప్రవీణ్ కుమార్ దర్శకత్వంలో బల్మూరి వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'నేను బాగు పడాలా.. నీకు నచ్చినట్లు ఉండాలా?', 'మరి మన గురించి ఎలా తెలుస్తుంది అందరికీ?', 'ఇక్కడ ఒక్కొక్కరు ఒక్కో రకం..' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''ఈ తరం యువత ఆలోచనలు, భావోద్వేగాలు ఎలా ఉంటున్నాయనేది ఈ సినిమాలోని పాత్రల ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఆసక్తికరమైన కథ, కథనాలతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తూనే, మనసుకు హత్తుకునేలా ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.



● సుహాస్

సాక్షి బిజినెస్
శనివారం
6-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
179	53
72,026	21,711

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 9.30 గంటలకు)

నాస్‌డాక్	14,582	▲	73
డోజోన్స్	37,532	▲	93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,700	▼	23
డాక్స్	16,630	▲	13
షాంఘై	2,929	▼	25
నికాయ్	33,377	▲	89

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,540
బంగారం (99.5 స్వచ్ఛత)	62,290
వెండి (కేజీ)	71,550

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.84	83.86
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.42	106.97
€	యూరో	ఎస్‌బీఐ	90.02	92.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.87	58.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.89	56.83
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.50	12.58

బ్రూక్‌ఫీల్డ్ చేతికి ఏటీసీ ఇండియా

డీల్ విలువ రూ. 20,800 కోట్లు



న్యూఢిల్లీ: కెనడియన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్రూక్‌ఫీల్డ్.. తాజాగా అమెరికన్ టవర్ కార్పొరేషన్(ఏటీసీ)కు చెందిన దేశీ బిజినెస్ కొనుగోలుకి తెర తీసింది. ఇందుకు మొత్తం 2.5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 20,800 కోట్లు) డీల్ కుదుర్చుకుంది. 2 బిలియన్ డాలర్ల ఎంటర్‌ప్రైజ్ విలువ(రూ. 16,630 కోట్లు)లో లావాదేవీ కుదిరింది. దీనికి 2023 అక్టోబర్1 నుంచి టికింగ్ ఫీజు సైతం జత కలవనుంది. వెరసి మొత్తం 2.5 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది. నియంత్రణ సంస్థల అనుమతుల తదుపరి 2024 ద్వితీయార్ధంలో డీల్ ముగిసే వీలున్నట్లు అంచనా. డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్(డీఐటీ) ద్వారా ఏటీసీ ఇండియా బిజినెస్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి ఏటీసీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ పేర్కొంది. ఏటీసీ ఇండియాకు దేశీయంగా సుమారు 78,000 టెలికం సైట్స్ ఉన్నాయి. డీల్ ద్వారా ప్రస్తుత మారకపు ధర ప్రకారం దాదాపు రూ. 21,000 కోట్ల నగదును అందుకోనున్నట్లు ఏటీసీ వెల్లడించింది. నిధులను రుణ చెల్లింపులకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఇది దేశీయంగా టెలికమ్యూనికేషన్స్ విభాగంలో బ్రూక్‌ఫీల్డ్ చేపట్టిన మూడో కొనుగోలుకావడం గమనార్హం!

1,75,000 టవర్లు

రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ హోల్డింగ్స్ నుంచి 2020లో బ్రూక్‌ఫీల్డ్ 1,75,000 టవర్ల పోర్ట్‌ఫోలియోను సొంతం చేసుకుంది. 2022లో 5,000 ఇన్‌డోర్ బిజినెస్ సొల్యూషన్ సైట్లు, స్మాల్ సెల్ సైట్లను కొనుగోలు చేసింది. వీటిద్వారా టెల్కోలకు 5జీ సేవలు, క్లిష్టమైన ప్రాంతాల్లో కవరేజీ విస్తరణకు వీలు కల్పించనుంది. తాజా కొనుగోలుతో దేశీ టెలికం టవర్ల పోర్ట్‌ఫోలియో విస్తరణసహా పటిష్టపరచేందుకు కృషి చేయనున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ మధ్యప్రాచ్యం, భారత్ కార్యకలాపాల మౌలిక సదుపాయాల హెడ్ అర్పిత్ అగర్వాల్ చెప్పారు. దీంతో తమ కస్టమర్లు, భాగస్వాములకు విస్తారిత సేవలు అందించనున్నట్లు తెలిపారు.

టాటా ప్యాసింజర్ ఈవీ రైడ్



న్యూఢిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహన విభాగమైన టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ వచ్చే ఏడాదిన్నరలో అయిదుకుపైగా ఈవీలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పూర్తి స్థాయి ఆధునిక ఎలక్ట్రిక్ వాహన వ్యవస్థ అయిన యాక్టి.ఈవీ ప్లాట్‌ఫామ్‌పై విభిన్న బాడీ, సైజుల్లో ఇవి రూపుదిద్దుకుంటాయని కంపెనీ శుక్రవారం వెల్లడించింది. యాక్టి.ఈవీ ఆధారంగా తొలుత పంచ్ ఈవీ వస్తోందని ప్రకటించింది. ఈ ఈవీ మోడళ్లలో 300 నుండి 600 కిలోమీటర్ల వరకు ప్రయాణించే యాక్టి.ఈవీ బ్యాటరీ ప్యాక్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. గ్లోబల్ ఎన్‌సీఏపీ, భారత్ ఎన్‌సీఏపీ భద్రతా ప్రమాణాలను అనుసరించి మోడళ్ల తయారీ చేపడతామని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ ప్రొడక్ట్స్ ఆఫీసర్ ఆనంద్ కులకర్ణి తెలిపారు. కాగా, పంచ్ ఈవీ బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. రూ.21,000 చెల్లించి కారు బుక్ చేసుకోవచ్చు.

టయోటా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోమొబైల్ రంగ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ వాహనాల ధరలను సవరించింది. ఎంపిక చేసిన మోడళ్లు, వేరియంట్లపై 0.5 నుంచి 2.5 శాతం వరకు ధర పెంచింది. జనవరి 1 నుంచి నూతన ధరలు అమలులోకి వచ్చాయని కంపెనీ ప్రకటించింది. పెరుగుతున్న వ్యయాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దాదాపు అన్ని కంపెనీలు వాహనాల ధరలను జనవరి నుంచి అధికం చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించాయి.

అదానీ మళ్లీ కుబేర్ నంబర్ 1

దేశ సంపన్నుల్లో మొదటి స్థానం ● రెండో స్థానానికి ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మళ్లీ మొదటి స్థానానికి చేరుకున్నారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రెండో స్థానానికి దిగిపోయారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా గణాంకాల ప్రకారం గౌతమ్ అదానీ సంపద విలువ 97.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో ముకేశ్ అంబానీ నికర విలువ 97 బిలియన్ డాలర్ల వద్ద ఉంది. అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు 30 శాతం వరకు ఇటీవలి కాలంలో ర్యాలీ చేయడంతో ఆయన సంపద విలువ 4.41 బిలియన్ డాలర్లు పెరిగింది. దీంతో ప్రపంచ కుబేరుల్లో 16వ స్థానం నుంచి 12వ స్థానానికి చేరుకున్నారు. ప్రపంచ కుబేరుల్లో ముకేశ్ అంబానీ 13వ స్థానంలో ఉన్నారు. ఏడాది తర్వాత గౌతమ్ అదానీ తిరిగి దేశ అత్యంత సంపన్నుడి స్థానానికి చేరారు. 2023 జనవరిలో అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ అదానీ గ్రూప్ కంపెనీలపై సంచలన ఆరోపణలతో నివేదిక విడుదల చేయడం తెలిసిందే. దీని తర్వాత గ్రూప్ కంపెనీల షేర్లు భారీ పతనం కావడంతో అదానీ సంపద విలువ గణనీయంగా తగ్గింది. సదరు ఆరోపణలపై సుప్రీంకోర్టు నుంచి దాదాపు క్లీన్‌చిట్ ఇవ్వడంతో గ్రూప్ కంపెనీల షేర్లు ర్యాలీ చేస్తున్నాయి. ఒక దశలో 127 బిలియన్ డాలర్ల విలువతో అదానీ ప్రపంచంలో మూడో అత్యంత సంపన్నుడి స్థానానికి కూడా వెళ్లడం గమనార్హం.

సేవలు స్పీడ్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం డిసెంబర్‌లో పురోగతి సాధించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ డిసెంబర్‌లో 59కి ఎగసింది. నవంబర్‌లో సూచీ 56.9 వద్ద ఉంది. సానుకూల ఆర్థిక పరిస్థితులు, డిమాండ్ ధోరణులు దీనికి కారణమని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనమిస్ట్ ప్రంజుల్ భండారీ పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	598-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
5-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00
రిటైల్ ధర	6.40

స్వల్ప లాభాల ముగింపు

- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు
- ఆదుకున్న ఐటీ, ఆటో షేర్లు
- మళ్లీ 72 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- 21,700 పాయింట్లు ఎగువకు నిఫ్టీ



ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ సంకేతాలతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. ఐటీ, టెక్నాలజీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 179 పాయింట్లు పెరిగి 72,026 వద్ద, నిఫ్టీ 53 పాయింట్లు బలపడి 21,711 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధంలో స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 309 పాయింట్లు బలపడి 72,156 వద్ద, నిఫ్టీ 90 పాయింట్లు ఎగసి 21,750 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. అయితే మిడ్ సెషన్‌లో తలెత్తిన అనూహ్య అమ్మకాలతో సూచీలు లాభాలన్నీ కోల్పోయాయి. ట్రేడింగ్ చివర్లో మరోసారి కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ఫార్మా, బ్యాంకింగ్, షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్‌తో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 0.61%, 0.19% చొప్పున రాణించాయి.

- డిసెంబర్ క్వార్టర్ ఫలితాల వెల్లడికి ముందు(గురువారం నుంచి) ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కోఫోర్జ్, టీసీఎస్ షేర్లు 2% పెరిగాయి. ఎల్‌టీఐఎం, ఎంఫసిస్, పర్‌సిస్టెంట్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్, విప్రో షేర్లు ఒక శాతం లాభపడ్డాయి.
- ఎవర్ రెన్యూ ఎనర్జీ లిమిటెడ్ నుంచి 225 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్ ఆర్డర్‌ను దక్కించుకోవడంతో సుజ్లాన్ ఎనర్జీ షేరు 5% లాభపడి రూ.41 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

కావేరీ సీడ్ షేర్ల బైబ్యాక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విత్తన తయారీ సంస్థ కావేరీ సీడ్ కంపెనీ షేర్ల బైబ్యాక్ ప్రకటించింది. టెండర్ ఆఫర్ రూట్‌లో రూ.325 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసేందుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. 9% ప్రీమియంతో ఒక్కో షేరు ధరను రూ.725గా నిర్ణయించారు. గరిష్టంగా 44.82 లక్షల షేర్లను కంపెనీ కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్‌నకు 59.9% వాటా ఉంది. బైబ్యాక్ వార్తల నేపథ్యంలో కావేరీ సీడ్స్ షేరు ధర బీఎస్‌ఈలో శుక్రవారం 1.18% ఎగసి రూ.662.60 వద్ద స్థిరపడింది.

ఐపీవో బాటలో మొబిక్విక్


- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 700 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ యూనికార్న్ మొబిక్విక్ సిస్టమ్స్ లిమిటెడ్ రెండేళ్ల తర్వాత మరోసారి పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 700 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. కంపెనీ ఇంతక్రితం 2021 జూలైలో రూ. 1,900 కోట్ల సమీకరణ ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు ప్రణాళికలు వేసింది. ఇందుకు వీలుగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. అయితే ఆపై ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా పబ్లిక్ ఇష్యూ యోచనను విరమించుకుంది. 2021 నవంబర్‌లో ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకుంది. కాగా.. ప్రస్తుత ప్రణాళికల ప్రకారం రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. ఐపీవోకంటే ముందుగా సెక్యూరిటీల కేటాయింపు ద్వారా రూ. 140 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇది జరిగితే ఆమేరకు ఐపీవో పరిమాణం తగ్గనుంది. కంపెనీలో ప్రధాన వాటాదారు పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్‌తోపాటు.. బజాజ్ ఫైనాన్స్, అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్‌కు పెట్టుబడులున్నాయి.

పబ్లిక్ ఇష్యూ యోచనలో ఐఐఎఫ్‌సీఎల్

ప్రభుత్వ రంగ సంస్థ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సీఎల్) పబ్లిక్ ఇష్యూ చేపట్టే యోచనలో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25)లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ఎండీ పీఆర్ జైశంకర్ పేర్కొన్నారు. ఇందుకు త్వరలోనే కన్సల్టేషన్ కార్యక్రమానికి తెరతీయనున్నట్లు కంపెనీ వ్యవస్థాపక రోజు సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం కంపెనీలో కేంద్రానికి 100% వాటా ఉంది. కంపెనీ ఏర్పాటయ్యాక ఇప్పటివరకూ 750 ప్రాజెక్టులకు రూ. 2.5 లక్షల కోట్ల రుణాలందించినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ. 1,076 కోట్ల నికర లాభం ఆర్జించగా.. ఈ ఏడాది(2023-24) రూ. 1,500 కోట్ల లాభం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో యూకీ బాంబ్రీ జోడీ

బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీ సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ -రాబిన్ ద్వయం 7-6 (7/5), 7-6 (7/5)తో నథానియల్ లామోన్స్-జేక్సన్ విత్రో (అమెరికా) జంటపై విజయం సాధించింది. 96 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను కాపాడుకోగా... టైబ్రేక్‌లలో యూకీ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని అందుకుంది.

రెండో స్థానానికి పడిపోయిన భారత్

ఐసీసీ టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా మరోసారి నంబర్‌వన్‌గా నిలిచింది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు రెండో స్థానానికి పడిపోయింది. పాక్‌పై ఆసీస్ 2-0తో సిరీస్ గెలుచుకోగా. దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను 1-1తో ముగించడంతో భారత్ ర్యాంక్ మారింది. ప్రస్తుతం ఆసీస్ 118 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో, భారత్ 117 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాయి.

భారత మహిళల విజయ గర్జన

- తొలి టి20లో 9 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- టిటాస్ సాధుకు 4 వికెట్లు
- షఫాలీ, స్మృతి అర్ధ సెంచరీలు


షఫాలీ, స్మృతి


టిటాస్ సాధు 4/17

ముంబై: ఆస్ట్రేలియా మహిళలతో వన్డే సిరీస్‌ను 0-3తో చేజార్చుకున్న భారత జట్టు టి20 సిరీస్‌లో మెరుపు విజయంతో శుభారంభం చేసింది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో ఆసీస్‌ను కట్టడి చేసిన మన జట్టు... ఆపై అలవోకగా లక్ష్యాన్ని ఛేదించి సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబర్చింది. శుక్రవారం డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన తొలి టి20లో భారత్ 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 19.2 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. 2020 టి20 ప్రపంచకప్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత ఆసీస్ జట్టు మళ్లీ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (32 బంతుల్లో 49 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఎలైస్ పెరీ (30 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. పవర్‌ప్లే ముగిసేసరికి 33/4 స్కోరుతో ఆసీస్ ఇబ్బందుల్లో పడిన స్థితిలో లిచ్‌ఫీల్డ్, పెరీ ఐదో వికెట్‌కు 52 బంతుల్లోనే 79 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. యువ పేస్ బౌలర్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిటాస్ సాధు (4/17) పదునైన బంతులతో ప్రత్యర్థిని కుప్పకూల్చగా... శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 17.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసి గెలిచింది. షఫాలీ వర్మ (44 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మృతి మంధాన (52 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 93 బంతుల్లోనే 137 పరుగులు జోడించడం విశేషం. తొలి ఓవర్లో ఎక్స్‌ట్రాల రూపంలోనే 14 పరుగులు రావడంతో మొదలైన ఛేదనలో చివరి వరకు భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. ముఖ్యంగా గత రెండు వన్డేల్లో తుది జట్టులో స్థానం దక్కించుకోలేకపోయిన షఫాలీ ఇప్పుడు మళ్లీ అవకాశం రాగానే చెలరేగిపోయింది. విజయానికి ఐదు పరుగుల దూరంలో స్మృతి వెనుదిరిగినా... షఫాలీతో కలిసి జెమీమా (6 నాటౌట్) మ్యాచ్ ముగించింది. సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజలో నిలవగా, రెండో మ్యాచ్ ఆదివారం ఇదే మైదానంలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌తో స్మృతి అంతర్జాతీయ టి20ల్లో 3 వేల పరుగులు పూర్తి చేసుకొని హర్మన్‌ప్రీత్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచింది.

జూన్ 9న... న్యూయార్క్‌లో...

టి20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ పోరు ● జూన్ 1 నుంచి 29 వరకు టోర్నీ



దుబాయ్: అమెరికా అభిమానుల సాక్షిగా టి20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. న్యూయార్క్ నగరం వేదికగా జూన్ 9న టి20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో దాయాది జట్లు తలపడతాయి. ఈ ఏడాది జరిగే మెగా టోర్నీ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం రాత్రి విడుదల చేసింది. న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక ఐసన్ హోవర్ పార్క్ స్టేడియంలో భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతుంది. ఈ పార్క్‌లో ఇప్పటి వరకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫుట్‌బాల్ ఫీల్డ్‌లు మాత్రమే ఉండగా... ప్రపంచకప్ కోసం కొత్తగా క్రికెట్ మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. జూన్ 1 నుంచి జూన్ 29 వరకు జరిగే ఈ ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడనుండగా... వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు.

- గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ లీగ్ దశలో తమ తొలి మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌తో, జూన్ 9న పాకిస్తాన్‌తో, జూన్ 12న అమెరికాతో, జూన్ 15న కెనడాతో తలపడుతుంది.
- గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, మాజీ విజేత ఆస్ట్రేలియా, నమీబియా, స్కాట్లాండ్, ఒమన్ జట్లు ఉన్నాయి.
- గ్రూప్ 'సి'లో న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్గానిస్తాన్, ఉగాండా, పపువా న్యూగినీ జట్లకు చోటు కల్పించారు.
- గ్రూప్ 'డి'లో దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్ జట్లు ఉన్నాయి.
- లీగ్ దశ తర్వాత ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు ముందంజ వేస్తాయి. ఆ తర్వాత ఎనిమిది టీమ్‌లతో 'సూపర్ ఎయిట్' దశ జరుగుతుంది. ఆపై సెమీఫైనల్స్, ఫైనల్‌ను నిర్వహిస్తారు.
- వెస్టిండీస్‌లో 6 వేదికల్లో (బార్బడోస్, ట్రినిడాడ్, గయానా, అంటిగ్వా, సెయింట్ లూసియా, సెయింట్ విన్సెంట్)... అమెరికాలోని 3 వేదికల్లో (న్యూయార్క్, ఫ్లోరిడా, డాలస్) కలిపి మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి.
- టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి (అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 10 గంటల నుంచి) జరుగుతాయి.

రాహుల్ సింగ్ డబుల్ సెంచరీ

తిలక్ వర్మ అజేయ శతకం ● హైదరాబాద్ 474/5 డిక్లేర్డ్


రాహుల్


తిలక్

దీమాపూర్: ఈసారి రంజీ ట్రోఫీలో 'ప్లేట్' డివిజన్‌లో పోటీపడుతున్న హైదరాబాద్ జట్టు తొలి మ్యాచ్‌లోనే పరుగుల వరద పారించింది. నాగాలాండ్ జట్టుతో శుక్రవారం మొదలైన మ్యాచ్‌లో హైదరాబాద్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 76.4 ఓవర్లలో 5 వికెట్లకు 474 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ఆట ముగిసే సమయానికి నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ కోల్పోయి 35 పరుగులు సాధించింది. అంతకుముందు నాగాలాండ్ బౌలర్ల భరతం పట్టిన హైదరాబాద్ బ్యాటర్ రాహుల్ సింగ్ గహ్లోత్ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. కెప్టెన్ తిలక్ వర్మ అజేయ శతకం (112 బంతుల్లో 100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) నమోదు చేయగా... తన్మయ్ అగర్వాల్ (80; 12 ఫోర్లు) కూడా రాణించాడు. గతంలో సర్వీసెస్ జట్టుకు ఆడిన రాహుల్ 157 బంతుల్లో 23 ఫోర్లు, 9 సిక్స్‌లతో 214 పరుగులు చేసి అవుటయ్యాడు. రాహుల్ 143 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో రవిశాస్త్రి తర్వాత రంజీ ట్రోఫీలో వేగవంతమైన డబుల్ సెంచరీ చేసిన రెండో ప్లేయర్‌గా రాహుల్ గుర్తింపు పొందాడు.

12 ఏళ్ల 284 రోజులకు...



రంజీ ట్రోఫీలో పిన్న వయస్సులోనే అరంగేట్రం చేసిన నాలుగో ప్లేయర్‌గా బిహార్ జట్టుకు చెందిన వైభవ్ సూర్యవంశీ (12 ఏళ్ల 284 రోజులు) గుర్తింపు పొందాడు. పట్నాలో ముంబై జట్టుతో శుక్రవారం మొదలైన ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో వైభవ్ బరిలోకి దిగాడు. రంజీ ట్రోఫీలో పిన్న వయస్సులోనే మ్యాచ్ ఆడిన ప్లేయర్ల జాబితాలో అలీముద్దీన్ (రాజ్‌పుతానా: 12 ఏళ్ల 73 రోజులు: 1942), ఎస్‌కే బోస్ (బిహార్: 12 ఏళ్ల 76 రోజులు: 1959), మొహమ్మద్ రంజాన్ (నార్తర్న్ ఇండియా: 12 ఏళ్ల 247 రోజులు: 1937) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

దబంగ్ ఢిల్లీకి ఆరో గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ, యు ముంబా జట్లు తమ ఖాతాలో ఆరో విజయాన్ని జమ చేసుకున్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీ 38-37తో పట్నా పైరేట్స్‌ను ఓడించగా... యు ముంబా 40-35తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	9	8	1	0	41
దబంగ్ ఢిల్లీ	10	6	3	1	35
గుజరాత్ జెయింట్స్	10	6	4	0	34
జైపూర్ పింక్ పాంథర్స్	9	5	2	2	33
యు ముంబా	8	6	2	0	31
పట్నా పైరేట్స్	10	5	5	0	28
హరియాణా స్టీలర్స్	9	5	4	0	26
బెంగళూరు బుల్స్	11	4	7	0	26
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పాకిస్తాన్ 68/7


హాజిల్‌వుడ్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులోనూ పాకిస్తాన్ జట్టుకు ఓటమి తప్పేలా లేదు. 14 పరుగుల స్వల్పఆధిక్యాన్ని పొందిన పాకిస్తాన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 26 ఓవర్లు ఆడి 68 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం పాకిస్తాన్ 82 పరుగుల ఓవరాల్ ఆధిక్యంలో ఉంది. ఆస్ట్రేలియా పేస్ బౌలర్ హాజల్‌వుడ్ (4/9) ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి పాక్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 116/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 299 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (60; 6 ఫోర్లు), మిచెల్ మార్ష్ (54; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. పాక్ బౌలర్ ఆమెర్ జమాల్ (6/69) ఆసీస్‌ను కట్టడి చేశాడు.

అనుస్తుప్ సెంచరీ

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర జట్టుతో శుక్రవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో బెంగాల్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగాల్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 86 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 289 పరుగులు సాధించింది. అనుస్తుప్ మజుందార్ (125; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ చేయగా... ఓపెనర్ సౌరవ్ పాల్ (96; 10 ఫోర్లు) త్రుటిలో సెంచరీని చేజార్చుకున్నాడు. అనుస్తుప్, సౌరవ్ మూడో వికెట్‌కు 189 పరుగులు జోడించడం విశేషం. ప్రస్తుతం కెప్టెన్ మనోజ్ తివారీ (15 బ్యాటింగ్), భారత జట్టు పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ తమ్ముడు మొహమ్మద్ కైఫ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, షోయబ్ ఖాన్‌లకు ఒక్కో వికెట్ లభించింది.

'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' రేసులో కోహ్లి, జడేజా





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వార్షిక అవార్డుల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' కోసం భారత్ నుంచి ఇద్దరు ఆటగాళ్లు పోటీ పడుతున్నారు. విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా ఈ అవార్డు రేసులో ఉన్నారు. 2023లో టెస్టులు, వన్డేలు కలిపి 35 మ్యాచ్‌లలో కోహ్లి 2048 పరుగులు చేయగా... 35 మ్యాచ్‌లలో కలిపి 613 పరుగులు చేసిన జడేజా 66 వికెట్లు కూడా పడగొట్టాడు. మరోవైపు 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం భారత స్పిన్నర్ అశ్విన్ బరిలో నిలిచాడు. 2023లో అశ్విన్ 17.02 సగటుతో 41 వికెట్లు పడగొట్టాడు.



ఏలూరు జిల్లా చాట్రాయిలో పింఛన్ల సొమ్మును అందజేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం వండవలో పెరిగిన పింఛన్ అందుకుని ఎమ్మెల్యే కళావతితో సంతోషం పంచుకుంటున్న అవ్వాతాతలు



కాకినాడ జిల్లా కోటనందూరులో కేఈస్ కొత్తూరు గ్రామానికి చెందిన పైల వరహాలబాబుకు దివ్యాంగ పింఛన్ అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం గనివానిపాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

ఇంటర్ ఫీజు చెల్లింపునకు 10 వరకు గడువు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం చదివే రెగ్యులర్ విద్యార్థులతో పాటు ప్రైవేటు (ఫెయిల్డ్), మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు ఫైన్‌తో ఫీజు చెల్లించేందుకు ఈనెల 10వ తేదీ వరకు గడువు ఇస్తున్నట్లు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సౌరభ్‌గౌర్ వెల్లడించారు. ఇప్పటి వరకూ ఫీజు చెల్లించని విద్యార్థులు గడువులోగా ఫీజు చెల్లించి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అర్హత పొందాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.

ప్రొబేషన్ ఆఫీసర్స్ గ్రేడ్–2 తాత్కాలిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ఏపీ జువెనైల్ వెల్ఫేర్ కరెక్షనల్ సబ్ సర్వీస్ కింద జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ గ్రేడ్–2 పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఈ జాబితా కమిషన్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో పెట్టామని, అలాగే కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.in లో పొందుపర్చామని పేర్కొంది.

తప్పుడు వార్తలు రాయడం సరికాదు

- సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష చేపడుతోన్న కార్యక్రమాలను https://schooledu.ap.gov.in/samagrashiksha/ లో చూడవచ్చని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదంటూ 'అయ్యో .. ఇదేంది బొత్స' శీర్షికన పత్రికల్లో ప్రచురితమైన వార్తను ఆయన ఖండించారు. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమగ్ర శిక్ష వెబ్‌సైట్ ను ఆవిష్కరించారని, ఆ రోజు నుంచి ఈ వెబ్‌సైట్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదంటూ అసత్యాలను ప్రచారం చేస్తూ, సంస్థను, ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాల్జేసేలా వార్తలు రాయడం సరికాదని హితవు పలికారు.

ఆర్టీసీ సంక్రాంతి కానుక..

స్పెషల్ బస్సుల్లో సాధారణ ఛార్జీలే..



- 6,795 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
- నేటి నుంచి 18 వరకు నిర్వహణ
- ప్రయాణికులపై అదనపు భారంలేకుండా వరుసగా నాలుగో ఏడాది సర్కారు చర్యలు
- ముందస్తు రిజర్వేషన్లకు రాయితీ సౌకర్యం
- చిల్లర సమస్య లేకుండా ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్ స్కాన్ సౌకర్యం ఏర్పాటు

అదనపు చార్జీల భారం లేకుండా సాధారణ చార్జీలతోనే సంక్రాంతి పండుగ ప్రత్యేక బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ నెల 6 నుంచి 18 వరకు మొత్తం 6,795 ప్రత్యేక బస్సులను నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నాలుగో ఏడాది సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నిర్వహించాలని నిర్ణయించడం గమనార్హం. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలతోపాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై.. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లోని ఇతర ప్రాంతాలకు ఈ ప్రత్యేక బస్సులను నడపనుంది. వీటిల్లో రిజర్వేషన్ల కోసం కూడా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. - సాక్షి, అమరావతి

ప్రత్యేక బస్సుల వివరాలు..

- ఈ నెల 6 నుంచి 14 వరకు 3,570 సర్వీసులు నిర్వహిస్తారు. తిరుగు ప్రయాణం నిమిత్తం ఈనెల 16 నుంచి 18 వరకు 3,225 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటుచేస్తున్నారు.
- సంక్రాంతికి ముందుగా నిర్వహించే ప్రత్యేక సర్వీసుల విషయానికొస్తే.. హైదరాబాద్ నుంచి 1,600, బెంగళూరు నుంచి 250, చెన్నై నుంచి 40 సర్వీసులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఏర్పాటుచేశారు.
- అలాగే, రాష్ట్రంలో విజయవాడ నుంచి 300, విశాఖపట్నం నుంచి 290, రాజమహేంద్రవరం నుంచి 230, తిరుపతి నుంచి 70, రాష్ట్రంలోని ఇతర జిల్లా కేంద్రాల నుంచి 790 బస్సు సర్వీసులు నిర్వహిస్తారు.
- సంక్రాంతి తరువాత ఈ నెల 16 నుంచి 18 వరకు హైదరాబాద్ నుంచి 1,500, బెంగళూరు నుంచి 495, చెన్నై నుంచి 85 సర్వీసులను రాష్ట్రంలోని ప్రాంతాలకు ఏర్పాటుచేశారు.
- విజయవాడ నుంచి 200, విశాఖపట్నం నుంచి 395, రాజమహేంద్రవరం నుంచి 50, తిరుపతి నుంచి 50, రాష్ట్రంలోని ఇతర జిల్లా కేంద్రాల నుంచి 700 సర్వీసులు నిర్వహిస్తారు.
- చార్జీలకు చిల్లర సమస్య లేకుండా ఉండేందుకు యూటీఎస్ మెషిన్ల ద్వారా టికెట్ల జారీ విధానాన్ని ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా టికెట్లు తీసుకోవచ్చు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కానుక ఇదీ..

నిజానికి.. సంక్రాంతి, దసరా పండుగల ప్రత్యేక బస్సు సర్వీసుల్లో అధిక చార్జీలు వసూలు చేయడం రాష్ట్రంలో దశాబ్దాలపాటు అమలవుతూ వచ్చింది. ఒకటిన్నర రెట్లు చార్జీలు అంటే సాధారణ చార్జీలపై 50శాతం అధికంగా చార్జీలు వసూలు చేసేవారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సాధారణ చార్జీల కంటే రెండుమూడు రెట్లు అధికంగా వసూలు చేసేవి. ఫలితంగా ప్రయాణికులు భారీ ఆర్థిక భారాన్ని వహించాల్సి వచ్చేది. ఈ విధానానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తి చెప్పింది. సాధారణ చార్జీలతోనే పండుగ ప్రత్యేక సర్వీసులను కూడా నిర్వహించాలని నిర్ణయించింది. 2019 మేలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020, జనవరి 1న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. అనంతరం పరిస్థితిని సమీక్షించి 2021 నుంచి పండుగ ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతోనే నిర్వహిస్తోంది. వరసగా నాలుగో ఏడాదీ ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతోనే నిర్వహించాలని నిర్ణయించింది.

రిజర్వేషన్లలో 10శాతం రాయితీ..

ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా ఆర్టీసీ కల్పించింది. ఒకేసారి రానూపోనూ రిజర్వేషన్ చేసుకుంటే 10శాతం రాయితీ ఇస్తోంది. దీంతో సాధారణ చార్జీల కంటే తక్కువతోనే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసేందుకు సూపర్‌వైజర్లను నియమించింది. బస్సులకు జీపీఎస్ ట్రాకింగ్, 24 గంటలు సేవలు అందించే సమాచార కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. కాల్ సెంటర్ నంబర్లు 149, 0866–2570005.

సద్వినియోగం చేసుకోండి

ప్రయాణికులపై భారం పడకూడదనే సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాది నిర్ణయించింది. సంక్రాంతి ప్రత్యేక బస్సుల ద్వారా ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సేవలు అందించేందుకు ఆర్టీసీ అన్ని ఏర్పాట్లుచేసింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఎండీ

అవ్వాతాతల ఇంట ముందే సంక్రాంతి

- రాష్ట్రమంతటా కోలాహలంగా పెన్షన్ రూ.3 వేల పెంపు ఉత్సవాలు
- కొత్తగా శుక్రవారం 139 మండలాలలో సంబరాల నిర్వహణ
- ఇప్పటివరకు 12,140 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉత్సవాలు పూర్తి

సాక్షి, అమరావతి: సంక్రాంతికి ముందే అవ్వాతాతల ఇళ్లు పండుగ కళ సంతరించుకున్నాయి. నెలానెలా పింఛను డబ్బులను రూ.2,750 నుంచి రూ. 3,000లకు పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఊరూవాడా అవ్వాతాతలు జేజేలు పలుకుతున్నారు. పెన్షన్ పెంపు నేపథ్యంలో ఈనెల 8వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మండలాల వారీగా, మున్సిపాలిటీల వారీగా ఎక్కడికక్కడ నిర్ణీత తేదీల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొని.. గత నాలుగున్నర ఏళ్లలో పెన్షన్ల మంజూరు, పంపిణీ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి లబ్ధిదారులకు గుర్తుచేస్తున్నారు. కాగా, శుక్రవారం కొత్తగా 139 మండలాల్లో ఈ పెన్షన్ పెంపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇక ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు మొత్తం 672 మండలాలు, మున్సిపాలిటీల్లోని 12,140 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ ఉత్సవాలు పూర్తయ్యాయని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

ఏపీని సర్వనాశనం చేసింది కాంగ్రెస్సే: కేఏ పాల్



సీతమ్మధార (విశాఖపట్నం): ఆంధ్రప్రదేశ్‌ను సర్వనాశనం చేసింది కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీనే అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. అలాంటి పార్టీలో షర్మిల చేరి తప్పు చేశారని అభిప్రాయపడ్డారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలులో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వై.ఎస్.రాజారెడ్డి, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే షర్మిలను కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా అడ్డుకునేవారన్నారు. వారి ఆత్మలు ఘోషిస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ ఎవరనీ బతకనివ్వదని వ్యాఖ్యానించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి బతికి ఉన్నప్పుడు సోనియా గాంధీ నిత్యం నరకం చూపించిందని చెప్పారు. ఆయన మృతి చెందిన తరువాత కూడా ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిని 16 నెలలు జైల్లో పెట్టించి వేధించిందని గుర్తుచేశారు. ఏపీలో చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను, కాంగ్రెస్ పార్టీని ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. నాపై విశాఖ నగరానికి చెందిన కొందరు రాజకీయ నాయకులు ఫుడ్‌పాయిజన్ చేయించారని, దీనిపై నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని, దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. పది రోజులుగా చికిత్స చేయించుకుంటున్నాని, త్వరలో వారి పేర్లు బయటపెడతానని అన్నారు. టికెట్ల కోసం గుంటూరులో ఎన్ఆర్ఐలు చంద్రబాబుకు రూ.50 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ ప్యాకేజీ నాయకుడని అన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పిచ్చి కుక్క కరిచినట్లు షర్మిల వెనుక పరిగెడుతున్నాడని విమర్శించారు.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

వించిపేట (విజయవాడ పశ్చిమ): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జనవరి–2024 నుంచి ప్రారంభం కానున్న విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పీజీ, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికేట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత శుక్రవారం తెలిపారు. సీఏ విద్యార్థులకు ఇగ్నో నిర్వహించే ప్రత్యేక బీకాం, ఎంకామ్ కోర్సులకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను ఈ నెల 31లోగా పంపించాలని కోరారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడు సంవత్సరాలు, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీ-రిజిస్ట్రేషన్ ఫీజును ఈ నెల 29 వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. వివరాలకు www.ignou.ac.in లేదా 0866–2565253 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

వీఐటీలో ఘనంగా మహిళా సదస్సు

చెన్నై: వీఐటీ బిజినెస్ స్కూల్, ఉమెన్–అప్ ఆధ్వర్యంలో శుక్రవారం తమిళనాడులోని చెన్నైలో మహిళా సదస్సు జరిగింది. ఇందులో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈడీ డాక్టర్.సంధ్యా పెంటారెడ్డి మాట్లాడుతూ..ఈ సదస్సు మహిళలను నాయకత్వంలో శక్తివంతం చేయడానికి ఒక కీలక వేదికగా పనిచేస్తోందని చెప్పారు. లింగ అసమతుల్యతలను పరిష్కరించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగకరంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సులో 'జర్నీ టు ది టాప్ 'పేరిట జరిగిన చర్చలో వీఐటీ వీసీ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్, ప్రముఖ శాస్త్రవేత్త, సెమీ కండక్టర్ టెక్నాలజీ కన్సల్టెంట్, ఉమెన్–అప్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వల్లి అరుణాచలం, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ (సౌత్ ఇండియా) డైరెక్టర్ ఐశ్వర్య దేశికన్, ఇస్రో జీశాట్ 7ఆర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.నీలావతి, జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాజలక్ష్మి పాల్గొన్నారు.

ఇదేమి వాదన?

వివేకా హత్య కేసులో సీబీఐపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సీబీఐ న్యాయవాదిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన సమాచారం లేకుండా 'ఐ థింక్ సో' అంటూ వాదనలు వినిపించడం సరికాదని చెప్పింది. వాదనలకు వచ్చే ముందే అధికారులు, ఇతర న్యాయవాదుల నుంచి సమాచారం తీసుకుని రావాలని వ్యాఖ్యానించింది. వైఎస్ వివేకా హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ గత నెల శివశంకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యతో శివశంకర్‌రెడ్డికి సంబంధంపై సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేసిందన్నారు. సీబీఐ చెప్పినట్లు దస్తగిరి(ఏ–4) వాంగ్మూలం ఇచ్చాడని.. అందుకే అతని బెయిల్‌కు దర్యాప్తు సంస్థ పూర్తిగా సహకరించిందని తెలిపారు. అనంతరం సీబీఐ తరఫున న్యాయవాది అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. తీర్పు కాపీ ఉందా అని ప్రశ్నించారు. కనీసం ఎస్ఎల్‌పీ (పిటిషన్) నంబర్ అన్నా చెప్పండి అని అడగగా.. సీబీఐ న్యాయవాది నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేశారు.

ఆర్చరీ క్రీడాకారిణి వినతిని పరిగణనలోకి తీసుకోండి

కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు తన పేరును పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రముఖ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ సమర్పించిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకుని, దానిపై ఈ నెల 8వ తేదీలోపు నిర్ణయం వెలువరించాలని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖను ఏపీ హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ కార్యదర్శి, ఖేల్‌రత్న అవార్డు ఎంపిక కమిటీ చైర్‌పర్సన్‌తోపాటు ఇతర సభ్యులకు, అవార్డుకు ఎంపికైన క్రీడాకారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తనను ఖేల్‌రత్న అవార్డుకు పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ జ్యోతి సురేఖ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకన్నా తక్కువ పాయింట్లు వచ్చిన బ్యాడ్మింటన్ క్రీడాకారులైన సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలను 2023 ఖేల్‌రత్న అవార్డు కోసం ఎంపిక చేశారని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పాయింట్ల ప్రకారం చూసుకుంటే తనకు 148.74 శాతం మార్కులు వస్తాయని, అవార్డుకు ఎంపికైన సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు 58.5 మార్కులే వచ్చాయని పేర్కొన్నారు. ఎంపిక విధానానికి విరుద్ధంగా కమిటీ వ్యవహరించిందన్నారు. దీనిపై గత నెల 14న కేంద్ర క్రీడల శాఖకు వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ అంశాలపై వాదనలు విన్న జస్టిస్ జయసూర్య ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేశారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఏపీ టాప్

రాజ్యసభ స్థాయీ సంఘం వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'ఆయుష్మాన్ భారత్'లో భాగంగా పేదల ఆరోగ్యానికి చేస్తున్న ఖర్చులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్‌లో ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఒక నివేదిక కూడా విడుదల చేసింది. 2022–23లో ఏపీ ప్రభుత్వం రూ.3,338 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొంది. రూ.2,623 కోట్లతో గుజరాత్ రెండోస్థానంలో, రూ.1,932 కోట్లతో మధ్యప్రదేశ్ మూడోస్థానంలో, రూ.1,724 కోట్లు ఖర్చు చేసి రాజస్తాన్ నాలుగోస్థానంలో ఉంది. రూ.1,155 కోట్లతో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచింది.

■ ఏటా ఏపీలో ఆయుష్మాన్‌భారత్ పథకం కింద చేస్తున్న ఖర్చు పెరుగుతోంది. 2018–19లో రూ.415.94 కోట్లు, 2019–20లో రూ.1,409 కోట్లు, 2020–21లో రూ.1,908 కోట్లు, 2021–22లో రూ.2,715 కోట్లు ఖర్చు చేసినట్టు ఆ నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 2022–23లో 15.42 లక్షలమంది లబ్ధిదారులుగా ఉన్నారు. లబ్ధిదారులపరంగా ఏపీ దేశంలో మూడోస్థానంలో ఉంది. 23.13 లక్షలతో కర్నాటక మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న రాజస్తాన్‌లో 16.40 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తెలంగాణ 5.59 లక్షల మంది లబ్ధిదారులతో 10వ స్థానంలో ఉంది.

భారత్–అమెరికా రక్షణ వాణిజ్యం 25 బిలియన్ డాలర్లు

హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్



సాక్షి, హైదరాబాద్: భారత్‌తో అమెరికా ద్వైపాక్షిక రక్షణ వాణిజ్యం (బైలేటరల్ డిఫెన్స్ ట్రేడ్) 2008లో సున్నా స్థాయి నుంచి 2023 చివరి నాటికి 25 బిలియన్ డాలర్లకు చేరుకుందని హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ చెప్పారు. రెండు దశాబ్దాల్లో భారత్‌కు రక్షణ సామగ్రి, పరికరాల సరఫరాలో యూఎస్ ముఖ్యమైన సరఫరాదారుగా, భారత్‌కు సంబంధించి అతిపెద్ద సైనిక విన్యాసాలు, ప్రదర్శన (మిలిటరీ ఎక్సర్‌సైజ్) భాగస్వామిగా అమెరికా నిలుస్తోందని వివరించారు. అందరికీ స్వేచ్ఛ, వికసిత, అనుసంధానం, సుసంపన్నమైన, స్థితిస్థాపక, సురక్షిత ప్రాంత (ఫ్రీ, ఓపెన్, ఇంటర్ కనెక్టెడ్, ప్రాస్పరస్, రిసైలెంట్, సెక్యూర్ రీజియన్) సాధనకు యూఎస్ కట్టుబడి ఉందని ఆమె స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్, కోల్‌కతా యూఎస్ కాన్సులేట్ జనరల్స్, సీయూటీఎస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 'డిఫెన్స్ న్యూస్ కాంక్లేవ్: స్టోరీస్ ఆఫ్ యూఎస్–ఇండియా డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ పార్ట్‌నర్‌షిప్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. అమెరికా–భారత్‌ల మధ్య ద్వైపాక్షిక రక్షణ, భద్రతా అంశాల్లో భాగస్వామ్యం, ఇండో పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల చేకూరిన ప్రయోజనాలు, బలోపేతమైన సంబంధాలను తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెన్నిఫర్ మాట్లాడుతూ హైదరాబాద్‌తో సహా భారత్‌లోని పలు ప్రాంతాల్లో భారత కంపెనీల భాగస్వామ్యంలో వివిధ యూఎస్ ఎయిరోస్పేస్ కంపెనీలు పనిచేస్తూ సాంకేతికత బదిలీతో పాటు ఇండియాలో దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు దోహదపడుతున్నాయని వెల్లడించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం । 6 । జనవరి । 2024



బెంగళూరు కంఠీరవ ఇండోర్ స్టేడియంలో 13వ రాష్ట్రస్థాయి పోస్టు కార్డుల బృహత్ ప్రదర్శన- కర్నాపెక్స్-2024 తపాల పండుగ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పురాతన కాలం నాటి స్టాంపుల ప్రదర్శనను చూడటానికి వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులు.

సిరిధాన్యాలకు ప్రాధాన్యత

- సీఎం సిద్దరామయ్య
- బెంగళూరు ప్యాలెస్‌లో ఘనంగా ప్రారంభమైన సిరిధాన్యాల మేళా



మేళాలో సిరిధాన్యాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన దృశ్యం

శివాజీనగర: ఆరోగ్య సముపార్జనకు ప్రతి ఒక్కరూ సిరిధాన్యాల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. నగరంలోని బెంగళూరు ప్యాలెస్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న 'సిరిధాన్యాల, సేంద్రియ -2024' అంతర్జాతీయ వాణిజ్య మేళాను శుక్రవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్య ఆహార పద్ధతిలో సిరిధాన్యాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎగుమతి స్థాయిని పెంచే లక్ష్యం నేపథ్యంలో వ్యవసాయ శాఖ, రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల సంస్కరణ, ఎగుమతి మండలి సంస్థ సహకారంతో 'సిరిధాన్యాలు, సేంద్రియ -2024' అంతర్జాతీయ వాణిజ్య మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరిధాన్యం వినియోగం సుస్థిర ఆహార వ్యవస్థకు బాటలు వేస్తుందన్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే పని జరగాల్సి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి మాట్లాడుతూ సిరిధాన్యాల ఉత్పత్తి, ఎగుమతి కార్యకలాపాలను రెండు నుంచి మూడింతలు పెంచటం, ఆరోగ్య దృష్టితో ప్రజలకు సిరిధాన్యాల అవగాహన కల్పించటం మేళా ప్రధాన ఉద్దేశమన్నారు. 2022-23వ సంవత్సరంలో రాష్ట్రం నుంచి రూ.36 కోట్ల విలువచేసే 7,764 మెట్రిక్ టన్నుల సిరిధాన్యం ఎగుమతి చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 15.61 లక్షల హెక్టార్లలో సిరిధాన్యాలు సాగులో ఉన్నాయన్నారు.

కుర్చీ లేక ఇబ్బంది పడిన రోహిణి సింధూరి

సిరిధాన్యాల అంతర్జాతీయ వాణిజ్య మేళాలో ఆహార సంస్కరణ, సాంకేతిక పరిజ్ఞాన శాఖ ప్రత్యేక కార్యదర్శి రోహిణి సింధూరికి వేదికపై కుర్చీ లభించక ఇబ్బందికి గురయ్యారు. ఆరంభంలో ముఖ్యమంత్రి కూర్చొన్న వరుసలో ఆమెకు సీటు కేటాయించారు. ఈ సమయంలో సీఎం కార్యాలయం సిబ్బందితో మాట్లాడేందుకు వెనుక సీటుకు వెళ్లినపుడు ఎమ్మెల్యే ఎస్.హెచ్.కోనరెడ్డి ఖాళీగా ఉన్న సింధూరి కుర్చీలో కూర్చున్నారు. ఆ తరువాత కార్యక్రమ వేదికపై నిలబడిన దృశ్యం కనిపించింది.

కరువు రైతులకు శోభాకరంద్లాజె భరోసా..

రాష్ట్రంలో తలెత్తిన కరువు పరిహారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహార నిధులు విడుదల చేయిస్తానని కేంద్ర వ్యవసాయ రాష్ట్ర శాఖ మంత్రి శోభా కరంద్లాజె భరోసానిచ్చారు. సిరిధాన్యాల వాణిజ్య మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు వినయ్ కులకర్ణి మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితి నెలకొన్నదని, కేంద్రం నుంచి నిధులు విడుదలకు డిమాండ్ చేయగా, మంత్రి ఈ భరోసానిచ్చారు.



హాజరైన సిరిధాన్యాల సాగు రైతులు



సిరిధాన్యాలతో నమూనా రైతు దంపతుల ఒడి నింపుతున్న సీఎం సిద్దరామయ్య

యువకుడి అవయవదానం

- రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బ్రెయిన్‌డెడ్
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు
- గుండె, కాలేయం, మూత్రపిండాలు గ్రీన్ కారిడార్ ద్వారా తరలింపు

హుబ్లీ: ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన నాలుగు అవయవాల్లో మూడింటిని గ్రీన్ కారిడార్ ద్వారా గురువారం బెళగావి, హుబ్లీ ప్రైవేటు ఆస్పత్రులకు ఏకకాలంలో తరలించారు. స్థానిక ఎస్‌సీజీకేఎల్‌ఈ శుతిరాయి ఆస్పత్రి వైద్యుల బృందం ఈ సాధన చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లప్ప ఉద్దార అనే వ్యక్తి గత నెల 26న హుబ్లీ శుతిరాయి ఆస్పత్రిలో చేరాడు. అయితే చికిత్స ఫలించక ఈనెల 2న బ్రెయిన్‌డెడ్ అయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు మల్లప్ప అవయవాలను దానం చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు శుతిరాయి ఆస్పత్రిలో గుండె, కాలేయం, మూత్రపిండాలతో పాటు నాలుగు ప్రముఖ అవయవాలను తొలగించి వాటిలో మూడింటిని గ్రీన్ కారిడార్ ద్వారా బెళగావి, హుబ్లీలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు నిర్ణీత సమయంలోగా అందజేశారు. శుతిరాయి ఆస్పత్రిలో మూత్రనిపుణులు, అవయవ ఆపరేషన్ నిపుణులు డాక్టర్ భువనేష్ ఎస్ ఆరాధి, కన్సల్టెన్సీ నెఫ్రాలజిస్ట్, అవయవ మార్పిడి వైద్యుడు డాక్టర్ చేతన్ ముద్రబెట్టు ఈ సాధనలో పాల్గొన్నారు. బెళగావి, హుబ్లీలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు అవయవాలను తరలించేందుకు ఎలాంటి ట్రాఫిక్ లేకుండా నిర్ణీత సమయానికి అవయవాలను చేరవేశారు.

కామాంధ తండ్రి

- డీఎన్ఏ పరీక్షల నివేదికలో వెల్లడి

యశవంతపుర: బుద్ధిమాంద్యురాలైన కుమార్తెపై తండ్రి లైంగిక దాడికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చి బిడ్డకు జన్మ ఇచ్చింది. పోలీసులు ఆ ముగ్గురికి డీఎన్ఏ పరీక్షలు చేయగా ఆ కామాంధుడి ఘాతుకం నిజమని తేలింది. ఈ ఘటన బెళగావి జిల్లా బెళవట్టిలో వెలుగులోకి వచ్చింది. బుద్ధిమాంద్యురాలైన యువతి శరీరంలో మార్పులు రావడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు ఆశా కార్యకర్త ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆమె గర్భిణి అని తేలడంతో 2023 ఫిబ్రవరిలో బెళగావికి చెందిన స్వచ్ఛంద సంస్థ బెళగావి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతిని ఆశ్రయ కేంద్రంలో ఉంచగా శిశువుకు జన్మ ఇచ్చింది. బుద్ధమాంద్య యువతితో పాటు, ఆమె తండ్రి, శిశువుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. ఆ నివేదిక పోలీసులకు అందింది. యువతి నాన్నే శిశువుకు తండ్రిగా బయట పడినట్లు బెళగావి నగర పోలీస్ కమిషనర్ సిద్దరామప్ప తెలిపారు.

న్యూస్‌రీల్

కేఐఏలో రూ.1.29 కోట్ల బంగారు పట్టివేత



పట్టుబడ్డ బంగారం

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు అక్రమంగా విదేశాల నుంచి తరలిస్తున్న రూ.1.29 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 2 కేజీల 86 గ్రాముల బంగారం సీజ్ చేశారు. ఈనెల 4న మస్కట్ నుంచి కెంపేగౌడ ఎయిర్ పోర్టుకు వచ్చిన 11 మంది మహిళలు ఒక పురుషుడి నుంచి ఈ బంగారం మొత్తం స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద ఉన్న బంగారానికి తగిన ఆధారాలు లేకపోవడం, పన్ను చెల్లించక పోవడం వల్ల బంగారం సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. 12 మందిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

వన్యజీవుల వేటగాళ్ల అరెస్ట్



పట్టుబడ్డ నిందితులతో అటవీశాఖ అధికారులు

దొడ్డబళ్లాపురం: జింకలను వేటాడుతున్న కనకపుర తాలూకా అరళాలు గ్రామానికి చెందిన గోవిందయ్య(71), చిక్కోళయ్య(61)ను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. శివనహళ్లి మెగా డెయిరీ వెనుక అటవీ ప్రదేశంలో నిందితులు నాటు తుపాకీతో జింకలను వేటాడారు. గస్తీలో ఉన్న అటవీశాఖ అధికారులు గమనించి నిందితులను పట్టుకున్నారు. జింక చర్మాలు, జింకల మాంసం, టార్పల్, నాటు తుపాకీ, వెయిట్ స్కేల్ స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్ర ప్రజలకు త్వరలో కరెంట్ షాక్ ?

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విద్యుత్ చార్జీలు పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. యూనిట్‌కు 50-60 పైసలు పెంపునకు ఎస్కాంలు కేఈఆర్‌సీ ముందు ప్రతిపాదన పెట్టింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశం ఉంది. యూనిట్‌కు 49 పైసలు పెంచాలని డిసెంబరు చివరి వారంలో బెస్కాం ప్రతిపాదన చేసింది. దీని ప్రకారం ఉత్పత్తి, ఖర్చు, వ్యయం, నిర్వహణ నష్ట నివారణకు చార్జీలు పెంచాలని కేఈఆర్‌సీ నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి విద్యుత్ చార్జీలు పెంపు అమలు చేసే అవకాశం ఉంది. నాలుగు ఎస్కాంల నుంచి 50-60 పైసలు పెంచాలని ప్రతిపాదన అందించింది.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

- హెచ్‌ఎం సస్పెండ్

మైసూరు: విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన ఆరోపణలపై మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా దాసనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ నియోజకవర్గం దాసనూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రకాశ్ అనే ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇతను పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం తెలుసుకున్న హెచ్‌ఎం పరారయ్యారు. విద్యాశాఖ అధికారి శివలింగయ్య పాఠశాలకు వచ్చి విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి హెచ్‌ఎంపై చర్యలకు సిఫార్సు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

డీకే శివకుమార్‌పై విచారణకు అనుమతివ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ

బనశంకరి: డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారణ చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. వివరాలు.. డీకే శివకుమార్ అక్రమాస్తులు కలిగి ఉన్నట్లు ఆయన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసు నమోదైంది. దీనిపై అప్పటి బీజేపీ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న యడియూరప్ప సీబీఐ దర్యాప్తునకు ఆదేశించారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డీకే శివకుమార్ కేసును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. డీకే.శివకుమార్‌పై సీబీఐ విచారణ ఆదేశాలు వెనక్కి తీసుకున్న ప్రభుత్వ చర్యను ప్రశ్నిస్తూ బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడపాటిల్ యత్నాళ్ పిటిషన్ వేశారు. మరో వైపు డీకేశివకుమార్ కేసును విచారణ చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ కూడా హైకోర్టులో వేసిన పిటిషన్ దాఖలు చేసింది. కాగా ఈ విషయంపై స్పందించిన డీకే.శివకుమార్... సీబీఐకి పిటిషన్ వేసే హక్కు ఉంది. మేము కూడా కోర్టులో వాదనలు వినిపిస్తామని, తనకు కోర్టుపై గౌరవం ఉందన్నారు.

కర సేవకుడి అరెస్ట్‌పై బీజేపీ ఆగ్రహజ్వాల

- ప్రతిపక్ష నేత అశోక్ నేతృత్వంలో ధర్నా

శివాజీనగర: కర సేవకుడు శ్రీకాంత్ పూజారి అరెస్టును నిరసిస్తూ ప్రతిపక్ష బీజేపీ పోరాటాన్ని తీవ్రతరం చేస్తోంది. తాను కరసేవకుడిని తనను కూడా అరెస్ట్ చేయాలనే అభియాన్‌ను రాష్ట్రమంతటా మరింత స్పీడు పెంచింది. శుక్రవారం బెంగళూరులోని కబ్బన్ పార్కులో శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ నేతృత్వంలో ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్బన్ పార్కు పోలీస్ స్టేషన్ ముందు చేరుకొన్న వందలాది మంది కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాన్ని అనుసరిస్తున్నదని మండిపడ్డారు. కార్యకర్తలు చేతిలో తాను కరసేవకుడిని, తనను కూడా అరెస్ట్ చేయాలనే నినాదంతో ప్లకార్డులు పట్టుకుని ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాలో ఎంపీ పీ.సీ మోహన్‌తో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు. మరోచోట మల్లేశ్వరం పోలీస్ స్టేషన్ ముందు భాగంలో ఎమ్మెల్యే సురేశ్ కుమార్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. తాను కూడా కరసేవలో పాల్గొన్నానని, తనను కూడా అరెస్ట్ చేయాలని, కర సేవకుడు శ్రీకాంత్ పూజారిని తక్షణమే విడుదల చేయాలని సురేశ్ కుమార్ డిమాండ్ చేశారు.

బీజేపీ ఆందోళనపై కాంగ్రెస్ ఎదురు దాడి

- సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య పోస్టర్లు విడుదల

శివాజీనగర: హిందూ కర సేవకుల అరెస్టును ఖండిస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనలపై కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. తాను ఆర్‌టీజీఎస్ ద్వారా లంచం తీసుకున్నా. రూ.40 వేల కోట్ల అక్రమంలో భాగస్వామినయ్యా అయ్యా.. తనను కూడా అరెస్ట్ చేయండి అంటూ విజయేంద్ర ప్లకార్డు ప్రదర్శిస్తున్నట్లు పోస్టర్‌ను సోషల్ మీడియాలో కాంగ్రెస్ విడుదల చేసింది. బెంగళూరుతో పాటుగా రాష్ట్రమంతటా వివిధ పోలీస్ స్టేషన్ల ఎదుట ధర్నా చేపట్టిన బీజేపీ నాయకుల ఫొటోలను కాంగ్రెస్ నాయకులు పై విధంగా ఎడిట్ చేసి ఎక్స్ ఖాతాలో విడుదల చేశారు. అదేవిధంగా బీజేపీ నేత సీ.టీ.రవి ఫోటోను ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. నేను కారు డ్రైవ్ చేసి ఇద్దరిని హత్య చేశా. తనను కూడా అరెస్ట్ చేయండి అంటూ సీటీ రవి అంటున్నట్లు పోస్టర్‌ను కాంగ్రెస్ విడుదల చేసింది. సీ.టీ.రవిని అరెస్ట్ చేయాలంటే ఇవి కారణాలు కాదా అంటూ కాంగ్రెస్ ప్రశ్నించింది. అదేవిధంగా కే.ఎస్.ఈశ్వరప్ప ఫోటోను కూడా కాంగ్రెస్ ఎడిట్ చేసింది. తాను 40 శాతం కమిషన్ తీసుకొని కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ మృతికి కారకుడయ్యాను. తనను కూడా అరెస్ట్ చేయండి అంటూ రూపొందించిన ఫొటోను కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో విడుదల చేసింది. అదేవిధంగా లోక్‌సభలో పొగబాంబు వేసినవారికి పాస్‌లు ఇచ్చి సహకరించా అని ఎంపీ ప్రతాప్‌సింహా పేరుతో కాంగ్రెస్ పార్టీ మరో పోస్టర్‌ను విడుదల చేసింది. అదేవిధంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సిమెంట్ దొంగ అంటూ పోస్టర్ విడుదల చేసింది.

లంచం అడిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- డీసీఎం డీకే శివకుమార్

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ధైర్యంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. బెంగళూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ భవనంలో శుక్రవారం యలహంక, బ్యాటరాయనపుర, దాసరహళ్లి నియోజకవర్గాల ప్రజల నుండి ఫిర్యాదులు, విన్నపాలు స్వీకరించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇక్కడకు అధికారులు అందరూ వచ్చారని ప్రజలు తమ పనులు చేయించుకోవాలని, ప్రజల రుణం తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇంటి ముంగిటకు ప్రభుత్వం, సేవకు కావాలి సహకారం పేరున ఈ కార్యక్రమం అందుకే చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు అర్హులందరికీ చేరాలనేది తమ ఉద్దేశమని, అయితే మొబైల్ నంబర్, పలు టెక్నికల్ సమస్యల కారణంగా సుమారు 5 లక్షల మంది మహిళలకు గృహలక్ష్మి పథకం అందడంలేదన్నారు. రెవెన్యూశాఖ మంత్రి క్రిష్ణబైరేగౌడ మాట్లాడుతూ...అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యలు పరిష్కరించి, పథకాలు మారుమూల చివరి వ్యక్తి వరకూ అందాలనే సదుద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

సంక్రాంతికి ఏపీఎస్ ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

బనశంకరి: బెంగళూరు నగరంలో నివసించే ప్రవాసాంధ్రుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూర్లకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని బెంగళూరు ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని ముఖ్య పట్టణాలైన విజయవాడ, నెల్లూరు, కడప, కర్నూలు, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, మదనపల్లితో పాటు ముఖ్యమైన పట్టణాలకు సాధారణ చార్జీలతో 11వ తేదీ నుంచి 13 తేదీ వరకు స్పెషల్ సర్వీసులు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు. అదే విధంగా బెంగళూరు నగరంలో నివసించేవారికి కార్గో (లాజిస్టిక్) పార్శిల్ బుకింగ్ ఏజెన్సీ కోసం ఏపీఎస్‌ఆర్‌టీసీ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఎంఈ-9731216688, ఏఎమ్‌టీ -9880540141, ఏటీఎం-9880540140 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సిఉంది.

గౌరవానికి భంగం కలగకుండా విధులు నిర్వర్తించాలి



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమిషనర్ దయానంద్

బనశంకరి: పోలీసు స్టేషన్లు, కోర్టులు ఆలయాల వంటివని, వాటి గౌరవానికి భంగం కలగకుండా పోలీసులు విధులు నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. శుక్రవారం దణిసంద్ర సీఏఆర్ మైదానంలో నెలవారి కవాతులో దయానంద్ గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగర పోలీసు శాఖ 61వ వార్షికోత్సవంలోకి అడుగు పెట్టిందని, ఎటువంటి అసాంఘిక ఘటనలు చోటుచేసుకోకుండా 2023 శాసనసభ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించి ప్రశంసలు పొందారని, అదే విధంగా లోక్‌సభ ఎన్నికలను కూడా శాంతియుతంగా జరపాలన్నారు.

బెంగళూరు పోలీసులు స్ఫూర్తి..

రాష్ట్రంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, మహిళలు, పిల్లలు రక్షణ తదితర విషయాలపై పోలీస్ స్టేషన్లలో ఫైళ్ల నిర్వహణ, సమయస్ఫూర్తిగా వ్యవహరించి బెంగళూరు నగర పోలీసులు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా డిసెంబరులో ఉత్తమ విధులు నిర్వహించిన వివిధ స్థాయి పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆ భూమిని తిరిగి రైతులకే అప్పగించాలి



మాట్లాడుతున్న జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ

శివాజీనగర: బెంగళూరు-మైసూరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ (బీఎంఐసీ) కోసం స్వాధీనం చేసుకొన్న అదనపు భూమిని తిరిగి రైతులకు ఇవ్వాలని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్.డీ.దేవెగౌడ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సుమారు 7 వేల కోట్ల విలువ చేసే 13 వేల ఎకరాలకు పైగా భూమి తిరిగి రైతులకు ఇవ్వాలని అక్టోబరు 19న ముఖ్యమంత్రికి లేఖ రాశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న టీ.బీ.జయచంద్ర అధ్యక్షతన అసెంబ్లీ కమిటీలో బీఎంఐసీ పథకం అక్రమాల విషయాన్ని ప్రస్తావించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అయినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయడంలో సీఎంకు ఎందుకు కష్టంగా ఉందో తెలియడం లేదన్నారు. తాను పేదల పక్షమని నిత్యం మాట్లాడే సిద్దరామయ్య బీఎంఐసీ విషయంలో చర్యలు తీసుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి, జేడీఎస్ కోర్ కమిటీ అధ్యక్షుడు జీ.టీ.దేవెగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బడిముబ్బడిగా బియ్యం దిగుమతి

- గూడ్స్ రైలులో బిహార్ నుంచి బియ్యం రవాణా
- సోనామసూరి బియ్యం డిమాండ్‌కు గండి పడేనా?



బోగీల నుంచి లారీల్లోకి నింపుతున్న బియ్యం బస్తాలు

రాయచూరు రూరల్: అనావృష్టితో ఈయేడాది ఖరీఫ్ సీజన్‌లో కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, బీదర్, కలబుర్గి, బళ్లారి, విజయనగర జిల్లాలు కరువు జిల్లాలుగా మారాయి. కృష్ణా నదీ తీరంలోని రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాలు, తుంగభద్ర నదీ తీరంలోని రాయచూరు, బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాల్లో ఈసారి రబీ సీజన్‌లో వ్యవసాయం కుంటుపడింది. ఈనేపథ్యంలో బిహార్ రాష్ట్రం నుంచి గంగావతికి బియ్యం దిగుమతి అయ్యాయి. రాష్ట్ర మార్కెట్‌లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటాయి.

కొత్త బియ్యం ధరకు రెక్కలు..

కొత్త బియ్యం ధర క్వింటాల్‌కు రూ.5400-5600 వరకు పలుకుతోంది. ఈ ప్రాంతపు మిల్లుల యజమానులు బిహార్ నుంచి 1200 టన్నుల బియ్యాన్ని తెప్పించుకున్నారు. వరి ధాన్యాగారంగా పేరొందిన రాయచూరు, బళ్లారి, కొప్పళ జిల్లాల్లో పండించే సోనా మసూరికి దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. తుంగభద్ర ఆయకట్టులో ఆరు లక్షల హెక్టార్లలో వరిని పండిస్తారు. ఈ ఏడాది వానలు లేక, జలాశయాలు నిండక, విద్యుత్ సరఫరాలో లోపాలతో వరి పంట దిగుబడి తగ్గింది. ఈ ప్రాంతంలో దాదాపు 2200కు పైగా రైస్ మిల్లులున్నాయి.

జోరుగా బియ్యం విక్రయాలు..

కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాల్లో పండించే సోనామసూరి బియ్యం క్వింటాల్‌కు రూ.2800-3100, ఆర్ఎన్ఆర్ సోనాకు రూ.3300-3400 ధర చొప్పున విక్రయాలు సాగుతున్నాయి. బిహార్, జార్ఖండ్‌ల నుంచి దిగుమతి అవుతున్న బీపీటీ రకం బియ్యం క్వింటాల్ ధర రూ.1500-1600 కాగా రవాణా ఖర్చులు అదనంగా రూ.1000 కలుస్తాయి. బిహార్ నుంచి మూడు రోజుల క్రితం గంగావతి రైల్వే స్టేషన్‌కు 21 బోగీల్లో వచ్చిన బియ్యాన్ని లారీల ద్వారా సిరుగుప్పకు తరలిస్తున్నారు.

కరసేవకుడు శ్రీకాంత్ పూజారి విడుదల



శ్రీకాంత్ పూజారి (ఫైల్)

హుబ్లీ: రాష్ట్రంలో కలకలం రేపిన హుబ్లీ నగరానికి చెందిన కరసేవకుడు శ్రీకాంత్ పూజారి అరెస్టుపై ఉవ్వెత్తున నిరసనలు వ్యక్తం కావడంతో ఎట్టకేలకు శుక్రవారం ఆయనను జామీనుపై విడుదల చేశారు. 31 ఏళ్ల క్రితం అయోధ్యలో జరిగిన ఘటనకు సంబంధించి నగరంలో చెలరేగిన ఘర్షణల్లో ఆయన్ను అరెస్టు చేశారు. ఆయనపై దాదాపు 16 కేసులున్నట్లు కూడా పోలీసు వర్గాలు వెల్లడించాయి. అయితే కక్షసాధింపు రాజకీయాల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకాంత్ పూజారిని అరెస్ట్ చేయించిందని ఆరోపిస్తూ బీజేపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. వివిధ కేసుల్లో అరెస్టు అయిన శ్రీకాంత్ పూజారిని విడుదల చేయాలని హుబ్లీ న్యాయస్థానంలో ఆయన తరఫున న్యాయవాది వాదించారు. దీంతో ఆయనకు జామీను లభించడంతో విడుదలయ్యారు.

కారు ప్రమాదంలో ఎమ్మెల్యేకు గాయాలు



చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పాటిల్

రాయచూరు రూరల్: కారు ప్రమాదంలో అఫ్జల్‌పుర ఎమ్మెల్యే ఎంవై పాటిల్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం కలబుర్గి జిల్లాలో జరిగింది. ఎమ్మెల్యే ఎంవై పాటిల్ ఆ తాలూకాలోని బి.జేవర్గిలో ప్రభుత్వ పాఠశాలలో ఓ కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఉండగా మార్గమధ్యంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడింది. ఎమ్మెల్యేకు, కారు డ్రైవర్ మొబిన్‌లకు స్వల్ప గాయాలు కావడంతో కలబుర్గిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



డ్రగ్స్‌పై గళం

డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బెళగావిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతాలో పాల్గొన్న విద్యార్థినులు

క్లుప్తంగా

ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

గంగావతి: అంజనాద్రి బెట్టలోని ఆంజనేయ స్వామి హుండీలో రూ.27,71,761ల కానుకలు లభించాయి. రెవిన్యూ శాఖాధికారి మహేష్ దళాల్ శుక్రవారం ఉదయమే హుండీని తెరిచి కానుకల లెక్కింపును ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హుండీ లెక్కింపు జరిగింది. ఈసందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ఈసారి 22 రోజులకే పైన తెలిపిన మొత్తం కానుకలు లభ్యమైనట్లు తెలిపారు. హనుమాన్ మాలధారుల కార్యక్రమం వల్లే కానుకల రూపంలో ఇంత పెద్ద మొత్తంలో సొమ్ము లభించిందన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాలు దూరం


జ్యోతి వెలిగిస్తున్న ఆర్టీఓ అధికారి వినయ్

రాయచూరు రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించడం అత్యవసరమని రాయచూరు ఆర్టీఓ వినయ్ కాటికోర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీఓ కార్యాలయంలో రోడ్డు సురక్ష సప్తాహ–2024 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వాహనాలను నడిపేది సంతోషం కోసం కాదన్నారు. జాతీయ రహదారుల్లో ప్రయాణించే సమయంలో ప్రాణాలపై జాగ్రత్త పాటించాలన్నారు. ప్రజలు వాహనాలపై భద్రత కల్పించుకోవాలన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లే ముందు వెనుక గమనించాలన్నారు. ప్రజల్లో ప్రచారం చేయడానికి జాతా ద్వారా ప్రజల్లో జాగృత పరచడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సూర్య ప్రకాష్, ఆర్టీఓ సిబ్బంది శివశంకర్, సిద్దయ్య స్వామి, సుధా పరిమళ, అర్జున్, జీనత్ సాజిద్, హుసేన్, సయ్యద్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు, ఫోన్ చోరీ


హుబ్లీ: స్థానిక కోటి లింగనగర రాజేశ్వర భవన్ పార్కింగ్‌లో నిలిపిన కారులోని రూ.77 వేల విలువ చేసే బంగారం, మొబైల్‌ను దుండగులు చోరీ చేశారు. అశ్విని అనే మహిళ పార్కింగ్‌లో కారును నిలపడాన్ని పసిగట్టిన చోరులు ఆ కారులో ఉన్న బంగారు నెక్లెస్, రూ.12 వేల విలువ చేసే మొబైల్‌ను చోరీ చేసుకొని పరారయ్యారు. ఈ ఘటనపై హుబ్లీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పంచమసాలీలకు 2ఏ రిజర్వేషన్ ఇవ్వాలి


జ్యోతిని వెలిగిస్తున్న జయ మృత్యుంజయ స్వామీజీ తదితరులు

కంప్లి: పంచమసాలి సమాజానికి 2ఏ రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వానికి పంచమసాలి సమాజ కూడల సంగమ పీఠాధ్యక్షులు జయ మృత్యుంజయ స్వామీజీ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం హగరిబొమ్మనహళ్లి తాలూకా వట్టమ్మనహళ్లి గ్రామస్తులు, యువకులు ఏర్పాటు చేసిన బసవేశ్వరస్వామి కార్తీకోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 20లోగా ప్రకటించేలా ప్రభుత్వానికి గడువు ఇచ్చినట్లు తెలిపారు. లేకుంటే 2ఏ రిజర్వేషన్ ప్రకటించేంత వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందన్నారు.

జనస్పందనతో సమస్యలకు పరిష్కారం


మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారిటౌన్: ప్రజలు తమ సమస్యలను జనస్పందన ద్వారా పరిష్కరించుకోవచ్చని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనస్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తాలూకా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. తాలూకాలోని గ్రామీణ ప్రాంతాల వారు తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. వీటిని వెంటనే ఆయా స్థానిక అధికారుల ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 130 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 54 రెవిన్యూ, 21 సర్వే ఆఫీసు, 14 పంచాయత్ రాజ్‌కు, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు జిల్లాధికారి మహమ్మద్ జుబేరా, తహసీల్దార్ గురురాజు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ ఎన్నికకు ముహూర్తం ఖరారు

- మేయర్ పదవి కోసం ముగ్గురు అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ
- ఈనెల 10న ఎన్నిక నిర్వహించాలని ప్రాంతీయ ఎన్నికల అధికారి ఆదేశం


బళ్లారి నగర నడిబొడ్డులోని సిటీ కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి,బళ్లారి: ఎట్టకేలకు మేయర్ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. కాంగ్రెస్ పార్టీలో భగ్గుమన్న విభేదాలు, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరక పోవడంతో మేయర్ పదవికి కాంగ్రెస్ పార్టీ తరఫునే ఇద్దరు అభ్యర్థులు, కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తున్న స్వతంత్రంగా గెలుపొందిన కార్పొరేటర్ ముగ్గురు పోటీ పడటంతో ఇప్పటికే రెండు సార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడింది. దీంతో జిల్లా కాంగ్రెస్ మంత్రి, ఎమ్మెల్యేలు పంచాయతీ చేయడానికి వీలు కాక పోవడంతో కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ కోర్టులోకి బంతి చేరడంతో ఇటీవల జరిగిన సమావేశం కొలిక్కి రావడంతో ఎన్నికల అధికారి మేయర్ ఎన్నిక తేదీని ఖరారు చేశారు. ఈనెల 10న మేయర్ ఎన్నిక నిర్వహించాలని కలబుర్గి ప్రాంతీయ ఎన్నికల అధికారి కార్పొరేటర్లకు, కమిషనర్‌కు ఆదేశాలను జారీ చేశారు.

కాంగ్రెస్‌కే మెజార్టీ సభ్యుల బలం

ఈ నేపథ్యంలో నగరంలో మేయర్ ఎన్నికపై జోరుగా చర్చ సాగుతోంది. నగరంలోని 39 మంది కార్పొరేటర్లలో కాంగ్రెస్ పార్టీ తరఫున 21 మంది, స్వతంత్రంగా గెలుపొందిన కార్పొరేటర్లు 5 మంది, బీజేపీ తరఫున గెలుపొందిన 13 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుతం మేయర్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున కుబేర, శ్వేత నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్రంగా గెలుపొందిన మించు శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు, స్వతంత్ర కార్పొరేటర్లు, బీజేపీ కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పదవి దక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈయన నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సమ్మినబంటు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఇరువురు కార్పొరేటర్లలో ఒకరు మంత్రి నాగేంద్ర వర్గంగా గుర్తింపు పొందగా, మరొకరు రాజ్యసభ మెంబర్ నాసీర్ హుస్సేన్ సూచనతో నామినేషన్లు వేశారు. మేయర్ పదవి కోసం ముగ్గురు తీవ్రంగా పోటీ పడుతుండటంతో రెండు సార్లు వాయిదా పడేలా తెరవెనుక అధికార పార్టీ నాయకులు తీవ్ర కృషి చేశారు. ప్రస్తుతం మేయర్ ఎన్నిక పంచాయతీ కాంగ్రెస్ హైకమాండ్ దృష్టిలో పడటంతో ఇటీవల బెంగళూరులో కేపీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ల తీరుపై డీకే.శివకుమార్ మండిపడ్డారు.

నామినేషన్ వేసిన వారితో సంతకాల సేకరణ?

తాము సూచించిన వ్యక్తికే మద్దతు ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు కుబేర, శ్వేత, మించు శ్రీనివాసులతో ముగ్గురి నుంచి సంతకాలు కూడా సేకరించినట్లు తెలుస్తోంది. పార్టీ సూచించిన వ్యక్తికి కార్పొరేటర్లంతా మద్దతు ఇవ్వాలని, మిగిలిన ఇద్దరూ పోటీ నుంచి తప్పుకోవాలనే విధంగా హెచ్చరికలు జారీ చేసి ఆ మేరకు సంతకాలు సేకరించడంతో పాటు ఎన్నిక రోజు కాంగ్రెస్ కార్పొరేటర్లకు విప్ కూడా జారీ చేసే అవకాశాలు ఉన్నట్లు పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు. మొత్తం మీద మేయర్ ఎన్నిక పంచాయతీని జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు సద్దుబాటు చేసేందుకు వీలు కాక పోవడంతో చినికి చినికి గాలి వానలా మారి కాంగ్రెస్ పార్టీలో విభేదాలు పతాక స్థాయికి చేరడంతో ముచ్చటగా మూడు నెలల పదవి కోసం పెద్ద ఎత్తున రాద్ధాంతం చేసి చర్చకు దారి తీయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఈనెల 10న మేయర్ ఎన్నికలో ప్రశాంతంగా పార్టీ నిలిపిన అభ్యర్థే గెలుపొందుతారా లేక పార్టీ నాయకుల ఆదేశాలు బేఖాతరు చేస్తారా? అన్నది వేచి చూడాలి.

కూరగాయల మార్కెట్ ప్రారంభం


మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: ప్రజారోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి అని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం నగరంలోని బసవేశ్వర నగర్‌లో నూతనంగా నిర్మించిన కూరగాయలు, పండ్ల మార్కెట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యంగా వర్షాలు వచ్చినప్పుడు బురదలోనే కూరగాయలు, పండ్ల అమ్మకాలు సాగిస్తుండడం వల్ల అవి త్వరగా కుళ్లిపోయే అవకాశం ఉండడంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల కూరగాయలు, పండ్ల అమ్మకాలకు ప్రత్యేక వసతి కల్పించామన్నారు. నగరంలో అవసరమైన చోట్ల చిన్న వ్యాపారులకు కూడా జీవనోపాధి కల్పించేలా ఇలాంటివి ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీఎంసీ, చిన్నమార్కెట్, పెద్దమార్కెట్ తదితర ప్రాంతాల్లోని కూరగాయలు, పండ్ల విక్రయ మార్కెట్లలో శుభ్రత పాటించాలన్నారు. ఎక్కడబడితే అక్కడ కుళ్లిన కూరగాయలు, పండ్లను పారేయరాదన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ జయప్రదానికి వ్యాపారులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈసందర్భంగా కార్పొరేటర్లు సురేఖ మల్లనగౌడ, హనుమంతు, మాజీ కార్పొరేటర్ మల్లనగౌడ, అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లాధ్యక్షుడు చానాళ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఈటీ దరఖాస్తుకు సహకరించాలి


మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ శాంతకుమారి

చెళ్లకెరె రూరల్: సీఈటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థులకు విజ్ఞానశాస్త్ర ఉపన్యాసకులు సహకరించాలని సీఈటీ మాస్టర్ ట్రైనర్ శాంతకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం కళాశాలలో తాలూకాలోని విజ్ఞానశాస్త్ర ఉపన్యాసకులకు నిర్వహించిన సీఈటీ విద్యార్థి మిత్ర–2024 శిక్షణా సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ముగిసిన తరువాత తమ భవిష్యత్ జీవితంలో ఇంజినీరింగ్, వైద్య వృత్తి శిక్షకులు కావాలని కలలు కంటారు. వారి కలలను సాకారం చేయడానికి ఉపన్యాసకులు తమ వంతు సహకారం అందించాలన్నారు. సీనియర్ ఉపన్యాసకుడు వసంతకుమార్ మాట్లాడుతూ ఇది అత్యుత్తమమైన సదస్సు అని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపన్యాసకులు మార్గదర్శనం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీ రవీష్‌కుమార్, ప్రిన్సిపాల్ శివారెడ్డి, వీరేష్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

కబ్జారాయుళ్లపై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న నరసింహులు

రాయచూరు రూరల్: నగరంలోని మైలార నగరలోని హరిశ్చంద్ర ఘాట్ శ్మశాన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్మశాన స్థలం తమదేనంటూ పేదలను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని స్థలాలను అమ్మారన్నారు. ఆ స్థలాలు తమవేనని మాజీ నగరసభ సభ్యులు జనార్దనరెడ్డి, లక్ష్మణ్‌లు మోసం చేశారని ఆరోపించారు. పేదల వద్ద తీసుకున్న డబ్బులను వాపస్ ఇప్పించాలని కోరారు. ఈసందర్భంగా వినోద్ సాగర్, కుమార్, రాజేశ్వరి, మాధవ రెడ్డి, హన్మంత్, వీరేష్‌రెడ్డి, శ్రీనివాస్, బసవరాజ్, నాగరాజ్‌లున్నారు.

సమాజ సేవకులకు అవార్డులు


అవార్డులు అందుకున్న సమాజ సేవకులు

రాయచూరు రూరల్: జిల్లాలోని సిరవారకు చెందిన మహిళా సమాజ సేవకురాలు విజయరాణి సావిత్రిబాయి పూలే అవార్డును అందుకున్నారు. గురువారం రాత్రి విజయపురలోని కందగల్ హనుమంతరాయ రంగమందిరంలో దళిత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమంలో మహిళా సాధకురాళ్లు అవార్డులను అందుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ మహిళలు అక్షరాలు నేర్చుకోవాలన్నారు. పూలే అగ్రవర్ణాలను ధైర్యంగా ఎదుర్కొని మహిళల విద్యకు నిరంతరం పోరాడారన్నారు. కార్యక్రమంలో రాష్ట్రాధ్యక్షుడు శ్రీనాథ్ పూజారి, మౌనేష్, సంయుక్త పాటిల్, అనిల్, బాలాజీ కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు సావిత్రిబాయి పునాది

కంప్లి: మహిళల విద్యాభ్యాసానికి పునాది వేసిన దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలె అని హెచ్ఎం భీమానాయక్ కొనియాడారు. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో ప్రార్థన ఆంగ్లమాధ్యమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు జరిపారు. సావిత్రిబాయి పూలె సిద్ధాంతాలను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులకు వివరించారు.

కారు, బస్సు ఢీ.. ఒకరు మృతి

హుబ్లీ: కారును బస్సు ఢీకొన్న ఘటనలో కారులో ఉన్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం స్థానిక కార్వార రోడ్డులోని బిడ్నాళ్ వద్ద జరిగింది. వివరాలు.. గోపనకొప్ప నివాసి పృథ్వీరాజ్ కిరగి(33) అనే వ్యక్తి కారులో హుబ్లీ నుంచి కార్వార వైపు వెళ్తుండగా, మిశ్రకోటె క్రాస్ నుంచి హుబ్లీ వైపునకు వస్తున్న ప్రైవేటు బస్సు కారును ఢీకొంది. కారులో ఉన్న యతీంద్రతో పాటు పృథ్వీరాజ్ తీవ్రంగా గాయపడ్డారు. పృథ్వీరాజ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు హుబ్లీ గ్రామీణ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉంది.

అడవుల అభివృద్ధి అవసరం


మాట్లాడుతున్న ఉగ్రప్ప తదితరులు

బళ్లారి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అడవులను అభివృద్ధి పరిచి పశువులు, పక్షులను కాపాడాలని మాజీ ఎంపీ, కేపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ ఉగ్రప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కూడ్లిగి తాలూకాలోని గుడేకోటలో 25 వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని సందర్శించి స్థానిక స్థితిగతులను పరిశీలించానన్నారు. ఈ ప్రాంతంలో పక్షులకు, జంతువులకు కావాల్సిన పళ్లు, కాయల వృక్షాలు లేనందున పశుపక్షాదులు అంతరించిపోతున్నాయన్నారు. ఇదే విధంగా రాష్ట్రంలో ఉన్న లక్షలాది ఎకరాల అటవీ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తాను ఒత్తిడి చేస్తున్నానన్నారు. 1992లో హుబ్లీ, ధార్వాడలో జరిగిన మత ఘర్షణల్లో ముగ్గురిపై ప్రస్తుతం కేసు దాఖలు చేసి విచారణ జరపడంతో దీనిపై బీజేపీ రౌడీషీటర్లను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కేపీఎస్సీ ఉద్యోగాల నియామకంలో పక్షపాత ధోరణిని అవలంభించడం వల్ల ఉద్యోగ ఆకాంక్షులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈసందర్భంగా స్థానిక కాంగ్రెస్ నేతలు కల్లుకంభ పంపాపతి, ఎల్.మారెన్న, వెంకటేష్ హెగ్డె, గౌస్, లోకేష్ పాల్గొన్నారు.

ముగ్గురు సాధకులకు నాడోజ ప్రశస్తులు


మాట్లాడుతున్న వీసీ పరశివమూర్తి తదితరులు


నాడోజ ప్రశస్తికి ఎంపికైన ముగ్గురు వీరే

- ఈనెల 10న కన్నడ వర్సిటీ స్నాతకోత్సవం

హొసపేటె: రాష్ట్రంలోని ప్రతిష్టిత హంపీ కన్నడ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని ఈనెల 10న నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పరశివమూర్తి తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈసారి ముగ్గురు సాధకులకు నాడోజ ప్రశస్తులను అందించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఆరోజు సాయంత్రం నవరంగ బయలు మందిరంలో జరుగనున్న నుడిహబ్బలో భాల్కికి చెందిన విరక్తమఠం డాక్టర్ బసవలింగ పట్టదేవరు, ఆంధ్రప్రదేశ్ గిరిజన విశ్వవిద్యాలయానికి చెందిన తేజస్వి కట్టిమని, రిటైర్డ్ నానో డైరెక్టర్ డాక్టర్ ఎస్సీ శర్మకు విశ్వవిద్యాలయం నాడోజ బిరుదులను అందిస్తుందని తెలిపారు. ఈ బిరుదులను రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా అందజేస్తారన్నారు. వివిధ విభాగాలకు చెందిన 264 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలను అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా శాఖ మంత్రి సుధాకర్, వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.731 కోట్ల డిపాజిట్ల సేకరణ


మాట్లాడుతున్న హిరేమట్

రాయచూరు రూరల్: వికాస్ బ్యాంక్ రూ.731 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు బ్యాంక్ అధ్యక్షుడు విశ్వనాథ్ హిరేమట్ వెల్లడించారు. శుక్రవారం ఆయన పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో నూతనంగా 12వ శాఖను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 1997లో వికాస సహకార బ్యాంక్‌ను ప్రారంభించి నేడు బ్యాంక్ ద్వారా పురోగతి సాధించామన్నారు. రూ.519 కోట్ల రుణాలు ఇచ్చామని, మొత్తం వ్యాపార లావాదేవీలు రూ.1250 కోట్లని అన్నారు. 365 రోజుల పాటు బ్యాంక్ లావాదేవీలు కొనసాగుతాయన్నారు. ఈసందర్భంగా రమేష్, వికాస్, యంకప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లపై కొత్త చట్టం రుద్దడం తగదు


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహన డ్రైవర్ల కోసం తెచ్చిన కొత్త చట్టం వారి తలపై రుద్దడం తగదని కర్ణాటక డ్రైవర్ల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షుడు రవీంద్రనాథ్ మాట్లాడారు. లోక్‌సభలో అంగీకరించిన రోడ్డు ప్రమాదంలో దారి మధ్యలో వదిలేసి వెళ్లిన, ఆస్పత్రికి తీసుకెళ్లకపోయినా, పారిపోయిన వారి కోసం అశాస్త్రీయ చట్టం తేవడం ద్వారా డ్రైవర్లపై రూ.10 లక్షల వరకు జరిమానా విధించడాన్ని ఖండించారు. లోక్‌సభలో డ్రైవర్లకు తెచ్చిన కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

గురువుల రుణం తీర్చలేనిది

కంప్లి: గురువులు, తల్లిదండ్రుల రుణం తీర్చడం ప్రపంచంలో ఎవరి వల్ల సాధ్యం కాదని బీఈఓ డాక్టర్ ఐర్ అక్కి తెలిపారు. సండూరు తాలూకా చోరనూరు ఫిర్కాలోని సెవియప్పనహళ్లి ప్రాథమిక పాఠశాలలో రిటైరైన ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన గురువందన, గౌరవ సభలో ఆయన మాట్లాడారు. గురువు ద్వారా పొందిన లబ్ధి వల్ల గురువుకు కృతజ్ఞత చూపాలన్నారు. గురువు వల్ల తాము పొందే ఫలితానికి విలువలేదన్నారు. గురువుకు వయస్సులో తేడా లేదన్నారు. పాఠాలు బోధించే ప్రతి ఒక్కరూ మనకు గురువులేనన్నారు.

ఆరోగ్య శిబిరం విజయవంతం

కంప్లి: యర్రంగళి గ్రామంలో ఆయుష్మాన్ భారత్, గ్రామ ఆరోగ్య యోజన ద్వారా ఉచిత ఆరోగ్య చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్, ఎముకలు, కీళ్ల వంటి వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని మొత్తం 197 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి వ్యాధులతో బాధపడుతున్న 31 మందిలో మెరుగైన శస్త్రచికిత్సకు ఐదు మంది రోగులను కురుగోడు సముదాయ ఆరోగ్య కేంద్రానికి సిఫార్సు చేశారు.

స్వతంత్ర జీవితానికి వృత్తి కౌశల్యత పునాది

కోలారు: విద్యార్థులు వృత్తి కౌశల్యాలను పెంపొందించుకుని స్వతంత్ర జీవితానికి పునాదులు వేసుకోవాలని డీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం నగరంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వృత్తి విద్యా కలికోత్సవ వస్తు ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు వస్తు ప్రదర్శనల నిర్వహణ విద్యార్థుల స్వతంత్ర జీవితానికి ఎంతో ప్రేరణ అన్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు పాఠ్యేతర కార్యక్రమాలు కూడా సమగ్ర శిక్షలో భాగమన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఆసరా అయిన వృత్తి శిక్షణకు ప్రాధాన్యతనివ్వడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల పరిసర సంరక్షణలో ప్రముఖ పాత్ర వహించే వృత్తి శిక్షకుల పాత్ర విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో కీలకమన్నారు. ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మునియప్ప, ప్రధానోపాధ్యాయుడు విజయానంద్, నివృత్త ఉపాధ్యాయులు వెంకటేశప్ప, వృత్తి శిక్షకుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్కండేశ్వర్ పాల్గొన్నారు.

జేడీఎస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: టీఏపీసీఎంఎస్ ఎన్నికల్లో పోటీ పడుతున్న జేడీఎస్, బీజేపీ మైత్రి అభ్యర్థులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం నగరంలోని కోలారమ్మ ఆలయంలో విశేష పూజలను జరిపారు. జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ తాలూకా రైతుల భవిష్యత్తును రూపొందించే టీఏపీసీఎంఎస్ ఎన్నిక ఈ నెల 7న ఆదివారం జరుగుతుంది. తాలూకాలోని సమాన మనస్కులు, జేడీఎస్, బీజేపీ సంయుక్తంగా పోటీ పడుతున్నాయి. 14 డైరెక్టర్ల స్థానాల్లో ఇప్పటికే 3 స్థానాలకు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. మిగిలిన 11 స్థానాలకు సమర్థులను రైతులు ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ మైత్రి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. ఈసందర్భంగా జేడీఎస్ నాయకుడు మల్లేష్‌బాబు, ఎస్ మునిరాజు, మునిశ్యామిరెడ్డి, వీఎస్ రఘునాథ్, ఎల్ రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో సమస్యలకు చెక్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థులకు వ్యవసాయంపై సరైన అవగాహన కల్పించడానికి, అనేక సమస్యల పరిష్కారానికి క్షేత్ర పర్యటనలు ఎంతో ఉపయోగపడతాయని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సురేష్ తెలిపారు. ఆయన శుక్రవారం తిప్పేనహళ్లిలో ఏర్పాటు చేసిన వ్యవసాయ వస్తు ప్రదర్శనలో మాట్లాడారు. విద్యార్థులు రైతులతో కలిసి వ్యవసాయ కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. రైతులకు వ్యవసాయంలో అధిక దిగుబడి సాధనకు అనుసరించాల్సిన మార్గాల గురించి తెలియజేయాలన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భవ్యరాణి, పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్డుల వితరణ


కార్డులు పంపిణీ చేసిన సురేంద్రబాబు

రాయచూరు రూరల్: జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తాలూకాలోని మిట్టి మల్కాపూర్‌లో ప్రజలకు ఆరోగ్య కార్డులను జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి సురేంద్రబాబు అందించారు. ఆయుష్మాన్ భారత్ పీఎం, సీఎం ఆరోగ్య కార్డు(ఏబీపీఎంజేవై సిమార్క్)ల ద్వారా ప్రభుత్వాస్పత్రులు, పెద్ద ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందవచ్చన్నారు. జీపీ అధ్యక్షుడు బాపూజీ, కంప్యూటర్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో రూ.11.925 లక్షల వంచన

హుబ్లీ: రెండు వేర్వేరు ఘటనల్లో ఆన్‌లైన్ ద్వారా రూ.11.925 లక్షలను కోల్పోయిన ఉదంతాలు శుక్రవారం నగరంలో వెలుగు చూశాయి. వివరాలు..మార్కెట్‌లో డబ్బు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయంటూ స్థానిక విద్యానగర నివాసి శశికుమార్‌కు గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ ద్వారా పరిచయమయ్యారు. తర్వాత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని నమ్మించాడు. దీన్ని నమ్మిన శశికుమార్ పూర్తి వివరాలను ఆ వ్యక్తికి ఇవ్వగా, అతడు దశల వారిగా రూ.9.65 లక్షలను బదలాయించుకొన్నాడు. ఈ ఘటనపై సదరు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో పాత హుబ్లీ చెన్నపేట నివాసి రామచంద్ర సఫారే అనే వ్యక్తి బయోమెట్రిక్ వివరాలను చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తి ఆయనకు తెలియకుండా రూ.2.275 లక్షలను వంచించారు. ఈ మేరకు బాధితుడు కసబాపేటె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10 నుంచి గవిసిద్ధేశ్వర జాతర మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష


మాట్లాడుతున్న జిల్లాధికారి నళిన్ అతుల్ తదితరులు

గంగావతి: కొప్పళలో ఈనెల 10 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే గవిసిద్ధేశ్వర మహాస్వామి జాతర మహోత్సవ కార్యక్రమాలపై శుక్రవారం జిల్లాధికారి నళిన్ అతుల్ నేతృత్వంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గవిసిద్ధేశ్వర స్వామి జాతర మహోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను ఆయా శాఖల వారీగా చేయాలని సూచించారు. తాగునీరు, భక్తుల రాకపోకలకు వీలుగా బారికేడ్లు, స్వామి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్, భోజన సదుపాయం, బందోబస్తు ఏర్పాట్లను, ఇతర సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా ఎస్పీ యశోద, ఆయా శాఖల ముఖ్యాధికారులు, పలు ప్రాంతాల డీఎస్పీలు పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంచుకోవాలి


చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించిన దృశ్యం

రాయచూరు రూరల్: యువత మానవీయ విలువలను పెంచుకోవాలని మాజీ సిండికేట్ సభ్యుడు విజయ భాస్కర్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి పరిషత్ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకత్వ లక్షణాలను కూడా అలవర్చుకోవాలన్నారు. ఈసందర్భంగా భీమేష్, ఈరణ్ణ, రాఘవేంద్ర, రాధ, పవన్, గోపాల్, నరసింహమూర్తి, భర్మారెడ్డిలున్నారు.